అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 07 -01-2019

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక : 10 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 6.50

తమిళనాడులో ఘోర ప్రమాదం

మెదక్ జిల్లాకు చెందిన 10 మంది అయ్యప్ప భక్తులు మృతి

మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

- తిరుగు ప్రయాణంలో కంటైనర్‌ను ఢీకొట్టిన ట్రావెల్ వ్యాన్
- నాలుగు గ్రామాల్లో విషాదఛాయలు
- ఘటనపై సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి



నవతెలంగాణ-నర్సాపూర్

శబరిమల యాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణమైన అయ్యప్పస్వామి భక్తులను మృత్యువు మింగేసింది. రోడ్డు ప్రమాదం రూపంలో మాటువేసి కాపుగాసిన కంటైనర్.. పది మందిని పొట్టనబెట్టుకుంది. 'మా స్వాములు మరికొన్ని గంటల్లో తిరిగొస్తారు' అని ఆత్రంగా ఎదురుచూసిన బంధువులు గుండెలు బాదుకుంటున్నారు. తమిళనాడు రాష్ట్రం పుదుకొట్టై సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెదక్ జిల్లాకు చెందిన పది మంది భక్తులు మృతిచెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయపడ్డారు. ప్రధాన రహదారిపై ఆగి ఉన్న కంటైనర్‌ను ట్రావెల్ వ్యాన్ ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకున్నది. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఖాజిపేట, మంతూర్, రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామాలకు చెందిన నాగరాజు, మహేష్, కుమార్, శ్యాంగౌడ్, కృష్ణ, సాయి, ఆంజనేయులు, సురేష్, ప్రవీన్‌గౌడ్, రాజు, వెంకటేష్, నరేష్‌గౌడ్, భూమాగౌడ్, శ్రీశైలం, డ్రైవర్‌తో కలిపి మొత్తం 15 మంది ఈ నెల 2న ప్రయివేటు ట్రావెల్ వ్యాన్‌లో హైదరాబాద్ నుంచి శబరిమలకు బయలుదేరారు. ఆది వారం తిరుగు ప్రయాణంలో తమిళనాడు రాష్ట్రంలోని పుదుకొట్టై సమీపంలో ప్రధాన రహదారిపై ఆగి ఉన్న లారీని భక్తులు ప్రయాణిస్తున్న ట్రావెల్ వ్యాన్ ...9లో

మహారాష్ట్ర వాటా 24 శాతానికి పైనే..

దేశంలోని మొత్తం రుణాల్లో.. ఆర్బీఐ

ముంబయి: గత ఆర్థిక సంవత్సరంలో వివిధ బ్యాంకుల నుంచి దేశంలో మంజూరైన రుణాల్లో మహారాష్ట్రదే అధిక వాటాగా ఉన్నది. భారత రిజర్వు బ్యాంకు(ఆర్బీఐ) విడుదల చేసిన 'బేసిక్ స్టాటిస్టికల్ రిటర్న్స్ ఆఫ్ షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్స్ ఇన్ ఇండియా' నివేదికలో ఈ విషయం వెల్లడైంది. గత ఆర్థిక సంవత్సరం 2017-18లో(మార్చి 31, 2018కి అందిన సమాచారం మేరకు) బ్యాంకుల నుంచి దేశంలో మొత్తం రూ.87.67 లక్షల కోట్ల మేర రుణాలు అందాయి. ఇందులో 21.56 లక్షల కోట్ల రుణాలు పారిశ్రామిక రంగానికి మారు పేరైన మహారాష్ట్రకు మంజూరయ్యాయి. దేశంలోని మొత్తం ...9లో

న్యాయం కావాలి

క్రిమినల్ జస్టిస్‌లో కుల వివక్ష ?

- ఖైదీల్లో ఎస్సీలు,ఎస్టీలు, ముస్లింలు అత్యధికం
- జనాభాలో 39 శాతం, జైళ్లలో 55 శాతం
- న్యాయ వ్యవస్థలోని లోపాలపై ఓ నివేదిక



క్రిమినల్ జస్టిస్‌లో కుల వివక్ష కొనసాగుతున్నదా..? భారత దేశంలోని జైళ్లలో ఆదివాసీలు, దళితులు, ముస్లింలు అత్యధిక సంఖ్యలో ఉండటానికి కారణాలేమిటి..? వారికి సత్వర న్యాయం అందించడంలో ఎదురవుతున్న అడ్డంకులేమిటి..? రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల్ని వారికి దూరం చేస్తున్నదెవరు..?మన న్యాయ వ్యవస్థలోని నేర విచారణ తీరులో పారదర్శకత లోపించిందా..? దళితులు, ఆది వాసీలు జైళ్లలో అధిక సంఖ్యలో మగ్గుతున్న పరిస్థితులపై సమగ్ర అధ్యయనమేదీ ఇప్పటి వరకూ జరగలేదు. అయితే, అటువంటి ఓ ప్రయత్నం నేషనల్ దళిత్ మూవ్‌మెంట్ ఫర్ జస్టిస్, నేషనల్ సెంటర్ ఫర్ దళిత్ హ్యుమెన్ రైట్స్ ద్వారా జరిగింది. ఈ రెండు సంస్థల భాగస్వామ్యంతో నిర్వహించిన అధ్యయన నివేదికను'క్రిమినల్ జస్టిస్ ఇన్ ద షాడో ఆఫ్ క్యాస్ట్' పేరుతో ఢిల్లీలో ఇటీవల విడుదల చేశారు. దళితులు,ఆదివాసీలు క్రిమినల్ జస్టిస్‌లోని లోపాల వల్ల బాధితులుగా ఎందుకు మారుతున్నారో తెలియజేసే మొదటి ప్రయత్నం ఇది..

న్యూఢిల్లీ: జాతీయ నేర రికార్డుల బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) తన 21వ నివేదికను 2015లో విడుదల చేసింది. దాని ప్రకారం దేశ జైళ్లలోని విచారణ ఖైదీల్లో 55 శాతంమంది దళితులు, ఆదివాసీలు, ముస్లింలేనని తేలింది. జనాభాలో వారి వాటాకన్నా ఇది అత్యధికం కావడం గమనార్హం. 2011 లెక్కల ప్రకారం జనాభాలో ఈ మూడు వర్గాల వాటా 39 శాతం. అంటే జనాభాతో పోలిస్తే 16 శాతం అధికంగా జైళ్లలో మగ్గుతున్నారని అర్థం. అరెస్టయి విచారణను ...9లో

సంచార జాతులపై నేరస్తుల ముద్ర

సంచారజాతులుగా జీవించే కొన్ని కులాలవారిని నేరస్తులుగా ముద్ర వేయడం మరో కారణం. చేయని నేరాలను వారిపై మోపి ఇబ్బందులపాలు చేసిన ఉదంతాలు పలు సందర్భాల్లో వెలుగు చూశాయి. తమిళనాడులోని కురవర్ సామాజిక వర్గంపై ఈరకమైన వివక్ష ధోరణి కనిపిస్తుంది. 2014లో ఓ నేరానికి సంబంధించి ఆ వర్గానికి చెందిన 14మందిని అరెస్ట్ చేసి వేధించారు. నేరం చేసినట్టు ఒప్పుకునేదాకా పోలీసులు వారిని హింసించారు. దీనిపై విచారణ జరిపిన షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ ఆ నేరంతో వారికి ఏవిధమైన సంబంధమూ లేదని తేల్చింది. ఎస్సీలపై పోలీసుల దారుణాలకు ఇది ఓ ఉదాహరణ. కురవర్లు నివాసముండే ప్రాంతాల్లో ఏ నేరం జరిగినా వారిపై మోపడం తమిళ పోలీసులకు ఓ ఆనవాయితీగా మారడం శోచనీయం. చేయని నేరాలకు వారిని పదేపదే వేధించి, హింసించడం వల్ల కురవర్ల జీవితం నిత్య భయాందోళనలతో సాగుతోంది. కురవర్ మహిళలపై అత్యాచారాలకూ అక్కడి పోలీసులు తెగిస్తున్నారు. పురుషులచే చేయని నేరాలను అంగీకరింపజేయడం కోసం థర్డ్ డిగ్రీ ఉపయోగిస్తున్నారు. తంజావూర్, అరియలూర్, తిరువరూర్, సాలెం, త్రిచీ, విల్లుపురం జిల్లాల్లో కురువర్లపై పలు తప్పుడు కేసులు నమోదైనట్టు నివేదిక తెలిపింది.

కాంగ్రెస్‌లో బాహాబాహి

భగ్గుమన్న విభేదాలు

- కుంతియాను దూషించిన సర్వే
- అడ్డుకున్న బొల్లు కిషన్, మహేష్‌కుమార్
- వాగ్వాదం...కొట్టుకున్న నేతలు
- సర్వే పై వేటు



గాంధీ భవన్ నుంచి బయటకు వస్తున్న సర్వే సత్యనారాయణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్‌పార్టీ నేతల్లో నివురు గప్పిన నిప్పులా ఉన్న అంతర్గత విభేదాలు మరోమారు బయట పడ్డాయి. గాంధీభవన్ సాక్షిగా నేతలు బాహాబాహికి దిగారు. ఎన్నికలపై సమీక్షలు నిర్వహిస్తున్న ఆ పార్టీ నేతలు ఓటమికి బాధ్యత మీదంటే, మీదంటూ వాగ్వాదానికి దిగారు. మాట మాట నేతలు కొట్టుకున్నారు. పిడిగుద్దులకు దిగారు. ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గ సమీక్ష సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శులు బోసు రాజు, సలీం, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు పొన్నం ప్రభాకర్, జెట్టి కుసుమ కుమార్, ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ, ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, హైద్రాబాద్ నగర అధ్యక్షులు అంజన్ కుమార్ యాదవ్, పోటీ చేసి అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ ఓటమికి రాష్ట్ర, జాతీయ నాయకులు బాధ్యత వహించాలని అన్నట్టు తెలిసింది. తెలంగాణ ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడానికి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ కుంతియాలే కారణమని ఆరోపించారు. ఓటమి కారకులే మళ్లీ ఓటమిపై ...9లో

కేరళలో కాషాయ కాష్టం

భౌతికదాడులకు దిగుతున్న ఆరెస్సెస్, బీజేపీ

- శబరిమల అంశాన్ని మరింత వివాదం చేస్తున్న హిందూత్వశక్తులు

తిరువనంతపురం: శబరిమల అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుని రాష్ట్రంలో హింసాత్మక వాతావరణాన్ని సృష్టించడానికి మోడీ సర్కారు తీవ్రంగా యత్నిస్తున్నది. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్రానికి చెందిన ఇద్దరు మహిళలు అయ్యప్ప ఆలయాన్ని దర్శించుకోవడాన్ని వివాదం చేస్తోంది. దీనిపై ఇప్పటికే ఆరెస్సెస్, బీజేపీలు కేరళ వ్యాప్తంగా బంద్‌లు, ఆందోళనలతో రాష్ట్రంలో భయపూరిత వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి.

బంద్‌లతో పాటు సాధారణ ప్రజలు, సీపీఐ(ఎం) కార్యకర్తలపై భౌతిక దాడులకు దిగుతున్నాయి. సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలు, నాయకుల ఇండ్లపై బాంబులు విసురుతూ పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మారుస్తున్నారు. ముఖ్యంగా కన్నూరు, పాలక్కడ్, పతనంథిట్ట జిల్లాలలో ఘర్షణపూరిత వాతావరణాన్ని సృష్టిస్తూ ఈ అంశాన్ని మరింత జటిలం చేసేలా బీజేపీ ప్రయత్నిస్తున్నది.



డీవైఎఫ్ఐ కార్యకర్తలపై దాడి

శబరిమలలో మహిళల ప్రవేశాన్ని నిరసిస్తూ పాలక్కడ్‌లో ఆరెస్సెస్, బీజేపీలు చేపట్టిన ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. ర్యాలీ సందర్భంగా ఆరెస్సెస్ వ్యక్తులు.. ఇద్దరు డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ) కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో వీరికి తీవ్ర ...9లో

నెలాఖరులో సహకార నోటిఫికేషన్

ఫిబ్రవరి మూడో వారంలో ప్యాక్స్ ఎన్నికలు

- అదే మాసంలో డీసీసీబీ, టెస్కాబ్ ఎన్నికలు పూర్తి
- 20 లక్షల మంది ఓటర్లు

వివరాలు 3లో

అమెరికాలో తెలంగాణ విద్యార్థిపై కాల్పులు

బాధితుడి పరిస్థితి విషమం..

- కారు, నగదు, ఐడీ కార్డులు అపహరణ

నవతెలంగాణ-మహబూబాబాద్



(ఫైల్)

అమెరికాలో తెలంగాణ విద్యార్థిపై దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. అనంతరం బాధితుడి నుంచి నగదు, కారు, గుర్తింపు కార్డులు అపహరించు కుపోయారు. మిచిగాన్ రాష్ట్రంలో ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది.

మహబూబాబాద్ పట్టణం బెస్తంబజార్‌కు చెందిన పూస ఎల్లయ్య, శైలజ దంపతులకు చెందిన కుమారుడు పూస సాయికృష్ణ లోరెంచ్‌టెక్ యూనివర్సిటీ సౌత్ ఫీల్డ్‌లో ఎంఎస్ చదువుతున్నాడు. ఈ నెల 3న స్థానిక రెస్టారెంట్‌లో పార్శిల్ కోసం వెళ్లాడు. బయటకు వస్తున్న క్రమంలో కొందరు దుండగులు తుపాకీతో అతనిపై కాల్పులు జరిపారు. కుడి చేతికి తీవ్రంగా గాయమైంది. బాధితుడు కుప్పకూలగానే అతని వద్ద నుంచి డబ్బు, గుర్తింపు కార్డులు సహా కారును ఎత్తుకెళ్లారు. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ఈ విషయం బంధువులకు తెలియడంతో ఆందోళన చెందుతున్నారు.

పొలంలో విషాదం

విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యానికి ముగ్గురు మృతి

- కొత్తలైన్ వేస్తుండగా కరెంట్ సరఫరా
- విద్యుద్ఘాతానికి గురై ఇద్దరు రైతులు, కాంట్రాక్ట్ ఉద్యోగి..
- మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలో ఘటన

వివరాలు 9లో



భూమికోసం బెదిరిస్తున్నారు

దళిత మహిళా రైతు ఆత్మహత్యాయత్నం

- పోలీస్‌స్టేషన్ ఎదుట కిరోసిన్ పోసుకున్న వైనం

నవతెలంగాణ-చందుర్తి

తన భూమిని మరొకరు పట్టా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీస్‌స్టేషన్ ఎదుట కిరోసిన్ పోసుకుని ఓ దళిత మహిళా రైతు ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలకేంద్రంలో ఆదివారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తి ...9లో



కస్తూర్బాలో ఫుడ్ పాయిజన్

67 మంది విద్యార్థినులకు అస్వస్థత

- చేవెళ్ల ప్రభుత్వాస్పత్రి, హైదరాబాద్ నిలోఫర్‌కు తరలింపు



వివరాలు 9లో

పర్మినెంటు కాక.. అరకొర జీతాలతో..

గ్రామపంచాయతీ, మున్సిపల్ వర్కర్ల ఇక్కట్లు

సమ్మెల సందర్భంగా ఇచ్చిన హామీలు బుట్టదాఖలు

- జీపీ, మున్సిపల్ కార్మికులపై పాలకుల చిన్నచూపు
- ఎక్కువ మంది దళితులు కాబట్టే వివక్ష
- సార్వత్రిక సమ్మెలో పాల్గొననున్న జీపీ, మున్సిపల్ కార్మికులు



(ఫైల్)

వివరాలు 9లో

ఏండ్ల సంది రెక్కలను ముక్కలు చేసి పనిచేస్తున్న గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులు దుర్భర బతుకులీస్తున్నారు. అరకొర వేతనాలతో దుర్భర జీవితాలను గడుపుతూ...మరోవైపు పర్మినెంట్ అవుతుందనే ఎక్కడో చిన్న ఆశతో జీవితాలను నెట్టుకొస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక అయినా తమ ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయని, తమ బతుకులు మారుతాయని ఆశపడ్డ వారికి నిరాశే ఎదురైంది. రెండు సమ్మెల సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలు బుట్టదాఖలయ్యాయి. ఈ రంగంలో ఎక్కువగా దళిత, అట్టడుగు స్థాయి సామాజిక తరగతుల వారే పనిచేస్తుండటంతోనే పాలకులు చిన్నచూపు చూస్తున్నారని..వివక్ష ప్రదర్శిస్తున్నారని జీపీ, మున్సిపల్ కార్మికులు ఆరోపిస్తున్నారు. తమ హక్కుల కోసం మరోమారు గళమెత్తుతూ ఈ నెల 8,9 తేదీల్లో జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు వారు సిద్ధమవుతున్న నేపథ్యంలో గ్రామపంచాయతీ, మున్సిపల్ వర్కర్లపై ప్రత్యేక కథనం.

రాష్ట్రాలకు గ్రేడింగ్



- పాఠ్యప్రణాళికలో మార్పులు : కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్

న్యూఢిల్లీ : విద్యారంగంలో ఆయా రాష్ట్రాలు చూపే ప్రతిభ ఆధారంగా వాటికి గ్రేడింగ్ ఇవ్వనున్నామని కేంద్ర మానవ వనరులు, అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. మొత్తం 70 అంశాల్ని పరిగణలోకి తీసుకొని ఈ గ్రేడింగ్‌ను రూపొందిస్తామని, పాఠ్యప్రణాళికలను హేతుబద్ధీకరణ జరపాల్సిన అవసరముందని, ఈ సంవత్సరం నుంచి విద్యార్థులపై పుస్తకాల భారం తగ్గించే పని చేపడతామని ఆయన చెప్పారు. 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే, "రాష్ట్రాలకు గ్రేడింగ్ ఇవ్వడం ద్వారా ఎక్కడ లోపమున్నదన్న విషయం బయటపడుతుంది. నాణ్యమైన విద్య అందడానికి ఆస్కారం ఏర్పడుతుంది. పాఠ్యాంశాల హేతుబద్ధీకరణ ద్వారా విద్యార్థులపై పుస్తకాల భారం తగ్గించే పని కొంతైనా జరగనున్నది. 2021నాటికి పుస్తకాల భారాన్ని 50శాతం తగ్గిస్తా"మని చెప్పారు. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్ని పెద్ద సంఖ్యలో అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. రెండేండ్ల క్రితం 2కోట్ల పుస్తకాల్ని పంపిణీ చేశామనీ, గతేడాది 6కోట్ల పుస్తకాల్ని తీసుకొచ్చామనీ, ఈ ఏడాదిలో 8కోట్ల పుస్తకాల్ని ముద్రించాలన్న లక్ష్యం పెట్టుకున్నామని చెప్పారు. సృజనాత్మకతతో కూడిన విద్య, ఈ దేశంలోని ఉపాధ్యాయులు మాత్రమే విద్యారంగాన్ని మార్చగలరన్న అభిప్రాయం ఆయన వ్యక్తం చేశారు.

ప్రశ్నించిన విద్యార్థిపై మంత్రి అసహనం

- అరెస్టు చేయాలని పోలీసులకు ఆదేశం

ముంబయి: ఆయన రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి. విద్యారంగంలో ఉన్న సమస్యలపై స్పందించి పరిష్కరించాల్సిన బాధ్యత ఆ మంత్రిపై ఉన్నది. కానీ, ఇలాంటి సమస్యలపై ప్రశ్నిస్తూ వీడియో తీసిన ఓ విద్యార్థిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నన్ను ప్రశ్నిస్తావా' అంటూ విద్యార్థిపై చిందులు తొక్కాడు. అంతటితో ఆగకుండా ఆ విద్యార్థిని అరెస్టు చేయాలంటూ పోలీసులను ఆదేశించాడు. ఈ ఘటన మహారాష్ట్రలోని అమరావతిలో చోటుచేసుకున్నది. ఓ కళాశాలలో వక్తృత్వ పోటీల ప్రారంభించడానికి మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి వినోద్ తావ్డే ఇక్కడకు వచ్చారు. కార్యక్రమంలో మంత్రి ప్రసంగించి బయటకు వెళ్తున్న సమయంలో కొందరు విద్యార్థులు ఆయన దగ్గరకు వచ్చారు. 'ఉచిత విద్యా విధానం'పై మంత్రి అభిప్రాయం కోరుతూ వారు వీడియో తీస్తుండగా తావ్డే ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడియో రికార్డింగ్‌ను ఆపాలని విద్యార్థి యువరాజ్ దబాడ్‌ను మంత్రి గద్దించాడు. కానీ, తమ ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పకపోవడంతో దబాడ్ అందుకు నిరాకరించాడు. దీంతో ఆగ్రహించిన మంత్రి.. దబాడ్‌ను అరెస్టు చేయాలని అక్కడున్న పోలీసులను ఆదేశించారు. అనంతరం విద్యార్థిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని నుంచి దూరంగా తీసుకెళ్లారు. దబాడ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కొన్ని గంటల తర్వాత తిరిగి ఇచ్చేశారు. కాగా, మంత్రి తీరుపై బీజేపీ మిత్రపక్షం శివసేన పార్టీ నాయకుడు ఆదిత్య థాక్రే తీవ్రంగా స్పందించారు.



గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఆదివారం కైట్ ఫెస్టివల్ అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దేశంలోని పలు ప్రాంతాలకు చెందినవారే కాక 45 దేశాలకు చెందిన ఔత్సాహికులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం బీజేపీ కిచిడీ



బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై జరుగుతున్న అరాచకాలకు వ్యతిరేకంగా హస్తినలోని పెద్దలెవరూ నోరు విప్పటంలేదు. నిందితులంతా బయటకు వచ్చి మరీ బెదిరింపులకు దిగుతున్నారు. వారి ఓట్లు కీలకంగా మారటంతో.. నిన్నా మొన్నటిదాకా దళితుల ఇండ్లకు వెళ్లి.. ముందుగా సెట్ చేసుకున్న ప్రకారం బీజేపీ నేతలు వండి వార్చించుకున్న విషయం విదితమే. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుంటే.. భీమ్ సంగమ్ విజయ సంకల్ప్..2019 పేరిట దళితులను మచ్చిక చేసుకునేలా బీజేపీ వ్యూహం రచించింది. ఇందులో భాగంగానే ఓట్ల కోసం కిచిడీ రాజకీయానికి తెరలేపింది. అయితే ఇలాంటి ఎత్తుగడలు దళిత ఓటర్లపై ఎంతమేర ప్రభావం చూపుతాయోనన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

దళితుల ఓట్లకు కమలనాథుల గాలం !

- ఢిల్లీలో దళితుల నుంచి సేకరించిన బియ్యంతో వెజిటబుల్ బిర్యానీ



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ దళితుల ఓట్లను ఆకర్షించేందుకు బీజేపీ రంగంలోకి దిగింది. ఇందులో భాగంగానే దేశ రాజధాని ఢిల్లీలోని.. దళితుల ఇండ్లల్లో నుంచి సేకరించిన బియ్యం, పప్పు, ధాన్యాలతో ఐదు వేల కిలోల కిచిడీ వండారు. ఈ వంటకానికి సామరస్యత కిచిడీ అని పేరునూ పెట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు విజయ్ గోయల్, థావర్‌చంద్ గెహ్లాట్, బీజేపీ ఉపాధ్యక్షుడు దుష్యంత్ గౌతమ్‌లు పాల్గొన్నారు. వివరాల్లోకి వెళితే.. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భీమ్ సంగమం పేరిట బీజేపీ కార్యకర్తలు ఆదివారం ఒక ర్యాలీ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కార్యకర్తల కోసం మూడు లక్షల మంది దళితుల ఇండ్లల్లో నుంచి వెయ్యి కిలోల బియ్యం, పప్పులను సేకరించారు. ఈ వంటకంలో 300 నుంచి 400 కిలోల కూరగాయలు, 200 లీటర్ల నెయ్యి, 100 లీటర్ల నూనెను వినియోగించారు. గిన్నిస్ రికార్డు నెలకొల్పిన విష్ణుమనోహర్ ఈ వంటకాన్ని 'నాగ్‌పూర్' చెఫ్ వండారు. అయితే ఈ 'సామరస్యత' కిచిడీ.. దళితులను ఆకట్టుకునేందుకేనని చర్చ జరుగుతున్నది.

దళితుల ఓట్లే లక్ష్యం..

దేశవ్యాప్తంగా 20.14 కోట్ల మంది దళితులు ఉంటే.. 17 శాతం ఓట్లు ఉన్నట్టు సమాచారం. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 150 సీట్లపై వారి ప్రభావం పడనున్నది. దళితవర్గాలకు 84 సీట్లు రిజర్వ్‌లో ఉన్నాయి. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో దళితుల ఓట్లు కీలకంగా మారటంతో.. వారిని తమవైపు తిప్పుకునే కార్యక్రమాలను బీజేపీ చేపడుతున్నట్టు తెలుస్తున్నది. బీజేపీ పాలనలో సామాజికంగా వెలివేత, కులం పేరిట దూషణలు, దాడులకు గురైన దళితులను ఆకట్టుకునేందుకే ఈ కార్యక్రమాలని చర్చిస్తున్నారు.

మనోహర్ పారికర్ ప్రాణాలకు ప్రమాదం

- 'రాఫెల్ డీల్' కీలక సమాచారం ఆయన వద్ద ఉంది : రాష్ట్రపతికి లేఖ రాసిన కాంగ్రెస్ గోవా చీఫ్



పనాజీ : రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందానికి సంబంధించి కీలక ఫైళ్లు గోవా సీఎం మనోహర్ పారికర్ వద్ద ఉన్నాయని, ఆయన ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని గోవా కాంగ్రెస్ చీఫ్ గిరీష్ ఛోడాంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆయన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు లేఖ కూడా రాశారు. పారికర్‌కు పూర్తిస్థాయిలో భద్రత కల్పించాల్సిన అవసరముందని ఆ లేఖలో రాష్ట్రపతిని కోరారు. రాఫెల్ డీల్‌కు సంబంధించి గోవా మంత్రి విశ్వజీత్ రాణే సంభాషణతో కూడిన ఆడియో టేపులు దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. కీలకమైన ఫైళ్లు తన పడకగదిలో మంచం కింద ఉన్నాయన్న మాటలు మనోహర్ పారికర్ తనకు చెప్పాడని రాణే ఇందులో చెప్పారు. వీటిపై నిజానిజాల్ని నిగ్గుతేల్చాలని ప్రతిపక్షాలు పార్లమెంట్ సమావేశాల్లో డిమాండ్ చేశాయి. దీంతో మోడీ సర్కార్ డిఫెన్స్‌లో పడిపోయింది. అవి నిజమైన ఆడియో టేపులు కావనీ, కావాలని సృష్టించినవనీ బీజేపీ నాయకులు చెబుతున్నారు.

ఒకవేళ అవి ఫేక్ ఆడియో టేపులే అయితే, విశ్వజీత్ రాణే పోలీస్ ఫిర్యాదు ఎందుకు ఇవ్వలేదనీ, ఇప్పటిదాకా దీనిపై ఎందుకు ఎఫ్ఐఆర్ దాఖలుకాలేదనీ గిరీష్ ఛోడాంకర్ ప్రశ్నించారు. ఒప్పందానికి సంబంధించి ప్రధాని మోడీపై అవినీతి ఆరోపణలు బలపడుతున్నవేళ మనోహర్ పారికర్ ప్రాణాలకు ప్రమాదం పొంచివుందన్న అనుమానాల్ని ఆయన వ్యక్తం చేశారు.

రైల్వేస్టేషన్‌కు 20 నిమిషాలు ముందుగానే..

- ఎయిర్‌పోర్టుల్లో మాదిరిగా ప్రయాణికుల తనిఖీ..
- ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న రైల్వే శాఖ



న్యూఢిల్లీ : సాధారణంగా విమానంలో ప్రయాణించాలంటే కొన్ని గంటల ముందుగానే ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలి. ఎందుకంటే విమానాశ్రయాల్లో ముందస్తు తనిఖీలు పూర్తయ్యేసరికి చాలా సమయం పడుతుంది. భద్రతను కట్టుదిట్టం చేసే పనిలో భాగంగా సెక్యూరిటీ ఈ తనిఖీలను నిర్వహిస్తోంది. కాగా.. ఇప్పుడు రైలు ప్రయాణికులనూ ఇదే విధంగా తనిఖీ చేయాలని రైల్వే శాఖ భావిస్తున్నది. దీంతో.. రైలు బయలుదేరే సమయం కంటే 20 నిమిషాలు ముందుగానే రైల్వేస్టేషన్‌కు చేరుకోవడం తప్పనిసరి కానున్నది. ప్రయాణికులను తనిఖీ చేసిన తర్వాతే స్టేషన్ లోపలికి పంపించనున్నట్టు, ఇందుకోసం అధునాతన టెక్నాలజీని వినియోగిస్తున్నామని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ అరుణ్‌కుమార్ వెల్లడించారు. ఈ విధానాన్ని కుంభమేళా జరగనున్న ప్రయాగ్‌రాజ్, కర్నాటకలోని హుబ్లీ రైల్వేస్టేషన్లలో ఇప్పటికే అమల్లోకి తెచ్చినట్టు వివరించారు. మరో 202 రైల్వేస్టేషన్లలోనూ ముందస్తు తనిఖీలు చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లనూ సిద్ధం చేసినట్టు తెలిపారు. ప్రతి రైల్వేస్టేషన్‌లో ఎంట్రీ గేట్లను పరిమితం చేసి.. ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ సిస్టం(ఐఎస్ఎస్) ద్వారా ప్రత్యేకంగా తనిఖీలను నిర్వహించనున్నట్టు చెప్పారు. ఐఎస్ఎస్.. సీసీటీవీ కెమెరాలు, లగేజీ స్క్రీనింగ్ సిస్టం, బాంబు గుర్తింపు పరికరాలు, బాంబు నిర్వీర్య వ్యవస్థతో కూడి ఉంటుందని చెప్పారు. అయితే.. ఇందుకోసం ప్రయాణికులు విమానాశ్రయాల్లో మాదిరిగా గంటల ముందు రావాల్సిన అవసరం లేదని.. దాదాపు 15 నుంచి 20 నిమిషాలు ముందుగా వస్తే సరిపోతుందని అరుణ్‌కుమార్ వెల్లడించారు.

విజ్ఞానశాస్త్రాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలి

- ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి




బెంగళూరు: దేశంలో పరిశోధనల నాణ్యత మెరుగుపడాలంటే విజ్ఞానశాస్త్రాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలని ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి అన్నారు. ప్రపంచంలోని మొత్తం నాలుగువేల మంది అగ్రశ్రేణి పరిశోధకుల్లో(హైలీ సైటెడ్ రీసెర్చర్స్) కేవలం పదిమంది భారతీయులే ఉన్నారని క్లారివేటివ్ అనలైటిక్స్ ఇటీవల విడుదల చేసిన నివేదికలో తేలిందన్నారు. ఇందులో అమెరికాకు చెందిన భారత మహిళ ఒక్కరే ఉన్నారని తెలిపారు. విజ్ఞానశాస్త్రాల్లో మహిళల భాగస్వామ్యం ఎంత ఎక్కువ పెరిగితే పరిశోధనల్లో అంత నాణ్యత పెరుగుతుందనడంలో సందేహం లేదన్నారు. స్నాతకోత్సవాల సందర్భంగా ఏ వర్సిటీకి లేదా ఐఐటీలకు వెళ్లినా మగవారి కంటే మహిళలే ఎక్కువగా బంగారు పతకాలకు పొందుతున్నారని తెలిపారు. పరిశోధనలకు అనువైన వాతావరణం కల్పిస్తే మహిళలు అద్భుతాలు సృష్టిస్తారన్నారు. 'వివాహం తర్వాత కూడా వారికి తోడ్పాటు అందించాలి. ప్రతిభ, నైపుణ్యం కలిగిన మహిళలకు ఆటంకాల కలిగించకుండా ఉంటే పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయి వరకు వెళ్లి ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉన్నది' అని ఆయన అన్నారు. శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఇంజనీర్లు, సామాజిక శాస్త్రవేత్తలకు ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్(ఐఎస్ఎఫ్) వార్షిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

అంతర్జాతీయం

సెల్ఫీ తీసుకుంటూ భారతీయ విద్యార్థి మృతి

- ఐర్లాండ్ మొహెర్ కొండపై ఘటన



లండన్: ఐర్లాండ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం మొహెర్ కొండ అంచుల్లో సెల్‌ఫోన్‌తో సెల్ఫీ తీసుకుంటూ ప్రమాదవశాత్తూ కాలుజారి ఓ భారతీయ విద్యార్థి మృతి చెందాడు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆ విద్యార్థి ఎత్తైన మొహెర్ కొండ అంచులకు చేరుకుని, తన మొబైల్‌తో సెల్ఫీ తీసుకుంటున్నాడు. ఆ సమయంలో అనుకోకుండా కాలు జారి పట్టుతప్పి కిందపడిపోయాడు. తోటి పర్యాటకుల హెచ్చరికలతో రంగంలోకి దిగిన పోలీసులు హెలికాప్టర్ సాయంతో అతడిని గుర్తించి, ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతిచెందిన భారతీయ విద్యార్థి డబ్లిన్ వర్సిటీలో చదువుకుంటున్నాడని పోలీసులు తెలిపారు.

అఫ్ఘాన్ బంగారు గనిలో ప్రమాదం

- 30 మంది మృతి



కాబూల్: అఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్ నగరంలోని ఓ బంగారు గనిలో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 30 మంది మృతి చెందారు. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. గనిలో చిక్కుకున్న మరికొందరిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...బదాక్షణ్ ప్రావిన్స్‌లో కొహిస్తాన్ జిల్లాలోని బంగారు గనిలో కార్మికులతో కలిసి గ్రామస్థులు తవ్వకాలు జరుపుతున్న సమయంలో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 30 మంది చనిపోయారు. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ రోస్తమ్ రఘీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. సహాయక బృందాలు 13మందిని రక్షించాయని చెప్పారు. మరికొందరు గనిలో చిక్కుకొని ఉంటారని అనుమానిస్తున్నామని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా గ్రామస్థులు తవ్వకాలు జరపడంతోనే ఈ ప్రమాదం సంభవించిందని అన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకటించింది.

ఖతార్‌లో చర్చలకు సిద్ధం : తాలిబన్లు



కాబూల్ : అమెరికాతో చర్చలకు అంగీకరించిన తాలిబన్లు తమ భేటీ వేదికను ఖతార్‌కు మార్చారు. ఈ విషయాన్ని తాలిబన్ సంస్థ అధికార ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ ధ్రువీకరించారు. గతంలో పేర్కొన్నట్టు సౌదీ అరేబియాలో చర్చలు జరపడం సాధ్యంకాదని తేల్చి చెప్పారు. కాగా, అఫ్ఘాన్‌లో 17 ఏండ్ల నుంచి అంతర్యుద్ధం కొనసాగుతోంది. ప్రాణభయంతో లక్షలాది మంది అఫ్ఘాన్లు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. భద్రతా బలగాలకు, తాలిబన్లకు మధ్య జరిగిన భీకరపోరులో వందలాది మంది మృతిచెందారు. తాలిబన్లతో చర్చలు జరపాలని అఫ్ఘాన్ ప్రభుత్వం అనేక సార్లు ప్రయత్నించింది. అయితే, అఫ్ఘాన్ సర్కార్‌కు ప్రత్యక్షంగా చర్చలు జరిపేందుకు సిద్ధంగా లేమని తాలిబన్లు పేర్కొన్నారు. తాలిబన్లతో చర్చలు జరపాలని కొంతకాలంగా అమెరికా ప్రయత్నిస్తోంది. తాలిబన్ నేతల డిమాండ్‌లను తెలుసుకోవాలని యూఎస్ దౌత్యవేత్త జాల్మె ఖలీల్‌జాద్‌ను అమెరికా రంగంలోకి దింపింది. సౌదీ అరేబియాలో చర్చలకు హాజరుకావాలని తొలుత తాలిబన్ నేతలు ఖలీల్‌జాద్‌ను కోరారు.

పాక్‌కు యూఏఈ ఆర్థిక సాయం



ఇస్లామాబాద్: యూఏఈ రాజు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ బిన్ సుల్తాన్ ఆదివారం పాకిస్తాన్‌లో పర్యటించారు. పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ రావల్పిండి విమానాశ్రయానికి చేరుకున్న బిన్ సుల్తాన్‌కు ఘన స్వాగతం పలికారు. 12ఏండ్ల తర్వాత యూఏఈ రాజు పాకిస్తాన్‌లో పర్యటించడం గమనార్హం. పాక్ ప్రధాని బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇమ్రాన్ యూఏఈలో రెండు సార్లు పర్యటించారు. పాక్‌కు ఆర్థిక సాయం అందించాలని కోరారు. పాక్ పర్యటనలో బిన్ సుల్తాన్ 6.2 బిలియన్ డాలర్ల (రూ.4,31,11,70,00,000) ఆర్థిక సాయం ప్రకటించే అవకాశముందని స్టేట్ మీడియా డాన్ పేర్కొంది. ఈ ఆర్థిక సహాయం విషయమై గతంలో ఇరు దేశాల మధ్య సంప్రదింపులు జరిగాయి. పాకిస్తాన్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి, విదేశీ మారక నిల్వలు కూడా అడుగంటిపోయిన నేపథ్యంలో ప్రధాని ఇమ్రాన్ ఖాన్.. తమను ఆదుకోవాలని పలు వేదికలపై అంతర్జాతీయ ద్రవ్య నిధిని (ఐఎంఎఫ్) కోరిన సంగతి తెలిసిందే. తమ ఆర్థిక వ్యవస్థను గాడిలోకి తీసుకురావడంతో పాటు జీతాల సమస్యను నివారించుకొనేందుకు ఐఎంఎఫ్ నుంచి సుమారు 8 బిలియన్ డాలర్ల (రూ.5,56,28,00,00,000) బెయిల్ అవుట్ ప్యాకేజీని కోరింది. అయితే, తాజాగా యూఏఈ చేయబోయే ఈ ప్రత్యేక సాయంతో పాక్‌కు విదేశీ మారక నిల్వలు పెంచు కొనేందుకు, ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించేందుకు అవకాశం లభించనుంది. యూఏఈ ప్రకటించబోయే 6.2 బిలియన్ డాలర్లలో 3.2 బిలియన్ డాలర్ల (రూ.2,22,51,20,00,000) సహకారాన్ని వాయిదాల పద్ధతిలో చమురు ఎగుమతుల ద్వారా అందిస్తామని, మిగతా మొత్తాన్ని నగదు రూపంలో జమ చేస్తామని యూఏఈ ప్రకటించే అవకాశముందని పాకిస్తాన్ స్టేట్ మీడియా 'ద డాన్' పత్రిక వెల్లడించింది. "యూఏఈ అందించనున్న ప్యాకేజీకి సంబంధించి పలు షరతులు విధించింది. ఈ ప్యాకేజీపై గురువారం సాయంత్రమే తుది నిర్ణయం జరిగింది' అని పాక్ కేంద్ర మంత్రి ఒకరు చెప్పిన మాటలను పత్రిక ఉటంకించింది. మరోవైపు గతంలో ఇదే తరహాలో సౌదీ అరేబియా కూడా పాక్‌కు 6 బిలియన్ డాలర్ల (రూ.4,17,21,00,00,000) ఆర్థిక సహకారం అందించింది. పాక్ మిత్ర దేశమైన చైనా కూడా ప్రత్యేక ప్యాకేజీ అందించేందుకు ముందుకొచ్చింది. కానీ ఎంత మొత్తంలో ఈ సాయం ఉంటుందనే విషయాన్ని ఇరు దేశాలు ప్రకటించలేదు.

వైదొలిగిన మరో పెంటగాన్ అధికారి



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనాలోచిత నిర్ణయాల పట్ల అసంతృప్తితో రక్షణశాఖ మరో కీలక అధికారి వైదొలిగారు. ట్రంప్ నిర్ణయాల పట్ల అసంతృప్తితోనే రాజీనామా చేసినట్టు చీఫ్ ఆఫ్ స్టాఫ్ కెవిన్ స్వీని తెలిపారు. తన రాజీనామా వెనుక ఎవరి ఒత్తిడి లేదని మీడియాతో చెప్పారు. స్వీని సహా ఇప్పటికీ ముగ్గురు పెంటగాన్ అధికారులు తమ పదవుల నుంచి వైదొలిగారు. సిరియాలోని యూఎస్ బలగాలకు రెండేండ్ల పాటు స్వీని నేతృత్వం వహించారు. ఐఎస్ దాడులను సమర్థవంతంగా తిప్పిగొట్టగలిగే సామర్థ్యం స్వీని సొంతం. సిరియాలోని ఉగ్రశిబిరాలను ధ్వంసం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. స్వీని రాజీనామా అంశం అమెరికాలో చర్చనీయాంశంగా మారింది. కాగా, సిరియా నుంచి అమెరికా బలగాలను ఉపసంహరించుకోవాలని రక్షణ శాఖకు గతవారం ట్రంప్ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అమెరికా సైన్యం ఐఎస్‌పై విజయంకేతం ఎగురవేసిందని, అందుకే సిరియా నుంచి బలగాలను వెనక్కి రప్పిస్తున్నట్టు ట్రంప్ తెలిపారు. అమెరికా అధ్యక్షుడి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ యూఎస్ రక్షణమంత్రి జెమ్స్ మాట్టిస్ సహా పలువురు అధికారులు తమ పదవులకు రాజీనామా చేశారు. సిరియా నుంచి అమెరికా సైన్యం వెనక్కి వచ్చిట్టయితే ఉగ్రసంస్థలు పుంజుకునే అవకాశాలు ఉన్నాయని మాట్టిస్ హెచ్చరించారు.

ఆరోగ్యశాఖ మంత్రికి ఉద్వాసన

- సూడాన్ దేశాధ్యక్షుడికి వ్యతిరేకంగా నినాదాలు



ఖార్తౌమ్ : సూడాన్‌లో నిరసనలు వెల్లువెత్తాయి. సూడాన్ అధ్యక్షుడు ఒమర్-అల్-బషీర్ ఆదేశ ఆరోగ్యశాఖ మంత్రి మొహ్మద్ అబూజైద్‌ను పదవి నుంచి తొలగించారు. ఆదివారం వేలాది మంది అబూజైద్ మద్దతుదారులు రాజధాని ఖార్తౌమ్ వీధుల్లోకి చేరుకొని ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ప్లకార్డులు, బ్యానర్లు చేబూని ప్రెసిడెంట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అబూజైద్‌ను ఎందుకు తొలగించారో తెలపకుండా ఆయన స్థానంలో అల్ ఖీర్ అల్‌నూర్‌కు ఆరోగ్యశాఖ మంత్రి పదవి కట్టబెట్టడాన్ని నిరసనకారులు తప్పుపట్టారు. దేశాధ్యక్షుడు నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

కాగా, సూడాన్‌లో నిత్యావసర, చమురు, మందుల ధరలు మిన్నంటాయి. పెరిగిన ధరలను తక్షణమే తగ్గించాలనే డిమాండ్‌తో గతనెల19న ప్రారంభమైన నిరసనలు ఇంకనూ కొనసాగుతున్నాయి. భద్రతా బలగాలు, నిరసనకారులకు మధ్య జరిగిన అల్లర్లలో 19 మంది మృతి చెందారు. వందలాది మంది గాయపడ్డారు. ఉపాధ్యాయులు, వైద్యులు, ఇంజినీర్లు కూడా నిరసనకారులకు మద్దతు తెలపడంతో ఆందోళనలు ఉధృతమయ్యాయి. గత నెల 23 నుంచి విద్యాసంస్థలు మూతపడ్డాయి. వైద్యులు కూడా నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడంతో వైద్య సేవలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతున్నది. పెరిగిన ధరలను నియంత్రించడంలో ఒమర్ అల్ బషీర్ విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రహస్య విడాకులు చెల్లవ్..

- నోటీసు ఇవ్వాల్సిందేనని సౌదీ ప్రభుత్వం స్పష్టీకరణ



రియాద్ : మహిళల హక్కులను పరిరక్షించాలని సౌదీ ప్రభుత్వం నిర్ణయించుకుంది. సౌదీలో ప్రస్తుతం రహస్య విడాకుల విధానం కొనసాగుతున్నది. భర్త విడాకులు ఇచ్చింది కూడా భార్యకు తెలిసేది కాదు. ఇలాంటి విధానంతో మహిళల హక్కులకు భంగం వాటిల్లుతున్నది. మహిళలు న్యాయస్థానాలను ఆశ్రయించినప్పటికీ కూడా సరైన న్యాయం జరగడం లేదు. విడాకుల సమాచారం అందకపోవడంతో అనేక మంది మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనేపథ్యంలో ఈవిధానాన్ని రద్దు చేయాలని సౌదీ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. విడాకులు ఇవ్వాలని భావిస్తున్న భర్త కచ్చితంగా భార్యకు నోటీస్ పంపాల్సిందేనని సౌదీ ప్రభుత్వం స్పష్టం చేసింది. విడాకులు ఎందుకు ఇవ్వాలనుకుంటున్నారో కూడా నోటీసులో స్పష్టంగా పేర్కొనాలని ఆదేశించింది. కాగా, మహిళల హక్కుల పరిరక్షణ కోసం సౌదీ యువరాజు మొహ్మద్ బిన్ సల్మాన్ పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. ముస్లిం మహిళలు స్టేడియంకు వెళ్లి ఫుట్‌బాల్ మ్యాచ్‌లను తిలకించవచ్చునని, పురుషులతో సమానంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చునని అన్నారు. బహుళ జాతీయ కంపెనీల్లోనూ మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. అంతేగాకుండా, పురుషులతో సమానంగా ముస్లిం మహిళలు కూడా డ్రైవింగ్ చేయవచ్చునని ప్రకటించారు. సౌదీ యువరాజు నిర్ణయాల పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా, రహస్య విడాకుల విధానాన్ని వ్యతిరేకించి సల్మాన్ అందరి దృష్టిని ఆకర్షించారు.

నెలాఖరులో సహకార నోటిఫికేషన్

ఫిబ్రవరి మూడో వారంలో ప్యాక్స్ ఎన్నికలు

- అదే మాసంలో డీసీసీబీ, టెస్కాబ్ ఎన్నికలు పూర్తి
- 20 లక్షల మంది ఓటర్లు



ఫైల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (ప్యాక్స్) ఎన్నికలకు ఈ నెలాఖరులో నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ మేరకు రాష్ట్ర సహకారశాఖ రంగం సిద్ధం చేసింది. పంచాయతీ ఎన్నికలు ముగియగానే ఫిబ్రవరి మూడో వారంలో ఒకే రోజున 902 ప్యాక్స్‌లకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. మొత్తం 906 ప్యాక్స్‌లున్నప్పటికీ నాలుగింటికి ఇంకా గడువు ఉన్నందున 902 ప్యాక్స్‌లకు ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే బ్యాలెట్ పేపర్లు, సిరా టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఒక్కో సంఘానికి సుమారు లక్ష రూపాయలు ఖర్చు చేయనున్నారు. ఈ ఖర్చులు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు భరించాల్సి ఉంది. లేని పక్షంలో టెస్కాబ్ సమకూర్చాలని ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఎన్నడూ ఏని విధంగా ఈ ఏడాది ఓటరు గుర్తింపు కార్డులు కూడా జారీ చేయనున్నారు. ఈ ఎన్నికలు అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నట్టు రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ వి. సుమిత్ర వెల్లడించారు. అదే రోజున ఓట్ల లెక్కింపు కూడా చేపట్టి గెలుపొందిన కమిటీని ప్రకటించనున్నారు. ఆ వెంటనే తొమ్మిది డీసీసీబీలు, తొమ్మిది జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలతోపాటు తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు (టెస్కాబ్)ల ఎన్నికలు పూర్తి చేయనున్నారు. ఈ ప్రక్రియంతా ఫిబ్రవరి నెలాఖరు వరకు ముగించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలకంటే ముందే ఎన్నికల ప్రక్రియ ముగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లను రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ముమ్మరం చేసింది. ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా కూడా తుది దశకు చేరుకుంది. రెండు జిల్లాలు మినహా మిగతా జిల్లాల నుంచి ఓటర్ల జాబితా ఎన్నికల అథారిటీకి అందింది. ఇందులో మొత్తం 18 లక్షల మందికిపైగా ఓటర్లు ఉన్నారు. మిగిలిన రెండు జిల్లాల నుంచి కూడా జాబితా వస్తే మొత్తం ఓటర్ల సంఖ్య 20 లక్షలకు చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు. సహకార సంఘంలో ఏడాది, అంతకంటే ఎక్కువ కాలం సభ్యులుగా కొనసాగిన వారినే ఓటరుగా గుర్తించనున్నారు. పూర్తిస్థాయిలో అన్ని జిల్లాల నుంచి ఓటర్ల జాబితా రాష్ట్ర సహకారశాఖ రిజిస్ట్రార్ ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయిలో సహకారశాఖ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించనుంది.ఆ తరువాత తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. రాష్ట్రంలో ఉన్న ప్యాక్స్‌లకు పర్సన్ ఇన్‌చార్జీలు (పీఐసీ)లు పాలక వర్గాలుగా కొనసాగుతున్నారు. వాస్తవానికి గతేడాది జనవరిలో కొన్ని, ఫిబ్రవరిలో కొన్ని ప్యాక్స్‌లకు పదవీకాలం ముగిసింది. దీంతో ఫిబ్రవరి రెండోవారంలో ఎన్నికలను నిర్వహించే సమయానికి పర్సన్ ఇన్‌చార్జీల పాలనకు సరిగ్గా ఏడాది పూర్తవుతుంది. మరోవైపు ఎన్నికలకు సంబంధించిన నిర్వహణ వ్యయాన్ని రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ నుంచి ఇవ్వనున్నారు. గతంలో ఎన్నికల అధికారి ప్రతిపాదనలు సమర్పించి సొసైటీ నుంచే ఖర్చు చేసే విధానం ఉండేది. అయితే అందులో లోటుపాట్లు, అవినీతి చోటుచేసుకుంటున్నందున ఇటీవల ఎన్నికల నిబంధనల్లో భాగంగా ఈ మేరకు సవరణ తీసుకువచ్చారు. 50 మంది కంటే తక్కువ ఓటర్లు ఉన్న సొసైటీలకు చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా భద్రాచలం ప్యాక్స్‌కు చేతులెత్తే విధానంలోనే ఎన్నిక నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు కూడా జారీ చేసింది.

బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు...

ప్యాక్స్ ఎన్నికలకు 12 వేల బూత్‌లను ఏర్పాటు చేస్తున్నారు. బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహిస్తారు. ఇందుకోసం దాదాపు 40 వేల మంది సిబ్బందిని వినియోగించనున్నారు. వివిధ శాఖల ఉద్యోగులు ప్యాక్స్ ఎన్నికల్లో విధులు నిర్వహించనున్నారు. ఎన్నికల ఏర్పాట్ల కోసం పంచాయతీ ఎన్నికల్లో తమ శాఖ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని ఇప్పటికే సహకారశాఖ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరింది.

కేటీఆర్ వ్యాఖ్యలు సత్యదూరం : దత్తాత్రేయ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలు సత్యదూరమని కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ బండారు దత్తాత్రేయ అన్నారు. టీమిండియా కాన్సెప్ట్‌తో అన్ని రాష్ట్రాల సీఎంలతో కలిసి ప్రధాని మోడీ ముందుకు సాగుతు న్నారన్నారు. బీజేపీయేతర ప్రభుత్వాలపై మోడీ సర్కారు కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటుందని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తు న్నామన్నారు. తెలంగాణకు నాలుగున్నరేండ్ల కాలంలో గ్రాంట్ల రూపంలో కేంద్రం రెండు లక్షల కోట్ల రూపాయలను ఇచ్చిందని, కేటీఆర్ చెబుతు న్నట్టుగా కేంద్రం పైసా విదల్చలేదని చెబుతున్నదన్నంతా అబద్ధమని కొట్టిపరేశారు. రాష్ట్రంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు కేంద్రం చేయూ తనిస్తోందని పలు అంశాలను ఉదహరించారు.

జూరాల వద్ద ఉద్రిక్తత

నీటి విడుదలను అడ్డుకున్న రైతులు

- ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిరసన
- ఆర్డీవోకు వ్యతిరేకంగా నినాదాలు.. పలువురి అరెస్ట్
- పోలీసుల సాయంతో దిగువకు నీరు విడుదల


ప్రాజెక్టు వద్ద రైతుల ఆందోళన

నవతెలంగాణ- అమరచింత

జూరాల నీటి విడుదలను నిరసిస్తూ వనపర్తి జిల్లాలో రైతులు ఆదివారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. ప్రధాన ఎడమ కాలువ నుంచి దిగువ ప్రాంతాలైన కొల్లాపూర్, వనపర్తి, కొత్తకోట మండలాలకు నీటిని విడుదల చేయడంతో ఆత్మకూరు మండలం నంది మల్లాల, అమరచింత మూల మల్లాల రైతులు ప్రాజెక్టు వద్ద మూడు గంటల పాటు బైటాయించారు. ఆర్డీఓకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీటి విడుదలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో చంద్రారెడ్డి, డీఎస్పీ సజన, తహసీల్దార్‌లు జీకే మోహన్, కల్యాణి ప్రాజెక్టు వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో కొందరు ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో పరిస్థితి చేయిదాటేలా కనిపించింది. అధికారులు పోలీసులకు సమాచారమివ్వగా వారు రైతులను అరెస్టు చేసి ఆత్మకూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం నాలుగు టీఎంసీల నీళ్ల మాత్రమే ఉన్నాయనీ, నిబంధనలకు విరుద్ధంగా దిగువ ప్రాంతాలకు నీళ్లొదిలితే ఎండాకాలంలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయనీ రైతులు వాపోయారు. ఇక్కడి రైతులకు తాగునీరు, సాగునీరివ్వాలని ఈఈ శ్రీధర్‌ను ఎన్నోమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ప్రజాప్రతినిధుల ఒత్తిడితో ఇక్కడి రైతులను ఎండబెట్టి కొల్లాపూర్, వనపర్తి మండలాలకు నీరిస్తూ తమకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నీటి విడుదలను ఆపకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో సీపీఐ(ఎం) రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కురుమూర్తి, పార్టీల నాయకులు రాజేందర్ రెడ్డి, భీమన్న ఆనంద్‌గౌడ్, ప్రశాంత్ రెడ్డి, భాస్కర్, ఆనంద్ రెడ్డి, సోమిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి ఉన్నారు.

కేసీఆర్ పోటీచేస్తే స్వాగతిస్తాం

- పంచాయతీ ఏకగ్రీవానికి సహకరించాలి: విలేకరులతో ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ

నల్లగొండ పార్లమెంటు నుంచి కేసీఆర్ పోటీ చేసే ఆలోచన ఉన్న విషయం పత్రికల ద్వారా చూస్తున్నామనీ, అదే నిజమైతే తాము స్వాగతిస్తామనీ ఎంపీ, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షులు గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ పోటీ చేస్తే 4 లక్షల మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఎమ్మెల్యే భాస్కర్‌రావుతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామపంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలూ సహక రించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తాం దన్నారు. తద్వారా గ్రామ సర్పంచులకు గౌరవ ప్రదమైన అధికారాలు అందుతా యన్నారు. అధికారం దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకునే చట్టం ఉందన్నారు. వీలైనన్ని గ్రామపంచాయతీలు ఏకగ్రీవం చేసుకోవాలనీ, అలా చేసుకుంటే ప్రభుత్వం రూ.10 లక్షలు ప్రోత్సాహకం అందిస్తుందనీ, ఎంపీ, ఎమ్మెల్యే నిధుల నుంచి మరో రూ.10 లక్షలు అందజేస్తామనీ తెలిపారు.

సార్వత్రిక సమ్మెకు యూఎస్‌పీసీ మద్దతు

- భోజన విరామంలో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 8, 9 తేదీల్లో కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు యూఎస్‌పీసీ సిహెచ్ రాములు, చావ రవి, బి కొండల్ రెడ్డి, మైస శ్రీనివాసులు, ఎం రఘుశంకర్ రెడ్డి, టి లింగారెడ్డి, సయ్యద్ షౌకత్ అలీ, కోట్ల నరసింహారావు, యు పోచయ్య, డి సైదులు, కొమ్ము రమేష్, ఎస్ బాబు, జాడి రాజన్న, జాదవ్ వెంకట్రావ్, హరికిష్ణ, శ్రీనునాయక్, మసూద్ అహ్మద్, ముజీబుర్ రెహ్మాన్, కె సుభాష్, ఎస్ మధుసూదన్‌రావు, మహిపాల్ రెడ్డి, శాగ కైలాసం, బి కొండయ్య, మహేశ్, కుర్సం రామారావులు సంయుక్తంగా ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 8,9 తేదీల్లో రెండురోజులపాటు ఉపాధ్యాయులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి తమ పాఠశాలల ఎదుట భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్దరించాలనీ, ధరల పెరుగుదలను నియంత్రించాలనీ, కనీస వేతనం అమలు చేయాలనీ, పేదలకు విద్యను దూరం చేసే డిటెన్షన్ విధానాన్ని విరమించుకొని నాన్ డిటెన్షన్ విధానాన్ని కొనసాగించాలనీ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకై కేంద్ర కార్మిక సంఘాలు, జాతీయ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపును విజయవంతం చేయాలని కోరారు.

పంతంగి టోల్‌గేట్ ఏర్పాటు అన్యాయం

జీఎంఆర్‌కు నిబంధనలు పట్టవా?

- రైతులను సంప్రదించకుండా భూములు లాక్కోవడమేంటీ?
- అనుమతి లేకుండా వాళ్లు అడుగు జాగ ఇస్తరా!
- ఇదెక్కడి అన్యాయం : టోల్‌గేట్ బాధిత రైతులు బాతరాజు శంకర్, ముత్యాలు గౌడ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజకీయ ఒత్తిళ్ల మేరకు రైతుల భూములను లాక్కొని నిబంధనలకు విరుద్ధంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి వద్ద టోల్‌గేట్ ఏర్పాటు చేయడం అన్యాయమని బాధిత రైతులు బాతరాజు శంకర్, మాదగోని ముత్యాలు గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. జీఎమ్ఆర్ సంస్థ తమకు చేస్తున్న అన్యాయంపై హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మీడియాతో మాట్లాడారు. ప్రజావసరాల కోసం అంటూ అన్యాయంగా భూములు లాక్కోవటం మానేసి నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి-వెలిమినేడు మధ్య ఏర్పాటు చేయాల్సిన టోల్‌గేట్‌ను పంతంగి వద్ద ఎందుకు ఏర్పాటు చేసారో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. భూ యజమానులను సంప్రదించకుండా ఎవరో అనామకులు పంచనామా చేస్తే భూములు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. అసలు భూమి తీసుకునే ముందు రైతులకు కనీస సమాచారం ఇవ్వాలన్న నిబంధన కూడా అధికారులకు తెల్వదా అని నిలదీశారు. జీఎమ్ఆర్-అధికారుల మధ్య లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని, అందుకే అధికారులు, పోలీసులు రైతులను వేధిస్తున్నారని ఆరోపించారు. వాళ్ల అనుమతి లేకుండా పోయి కొంత జాగ తీసుకుంటాననే జీఎంఆర్ సంస్థ వాళ్ల భూమిని వదిలిపెడతారా? అని ప్రశ్నించారు.

మా భూముల్లో కంచె వాళ్లు కంచె వేయడం అన్యాయమని, తమ భూముల్లోని తాతల, తండ్రుల సమాధులను కూల్చేశారని, మిగిలిన భూముల్లోకి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం బాటసింగారం నుంచి ఆరులైన రోడ్డు వేసి హైదరాబాద్ నుంచి జీఎంఆర్ సంస్థ టోల్‌ఫీజు వసూలు చేస్తూ వాహనదారులను మోసం చేస్తోందని ఆరోపించారు. అదనంగా భూమి అవసరమైతే రైతుల నుంచి కొనుగోలు చేయాలని క్లాజుల్లో స్పష్టంగా ఉన్నప్పటికీ జీఎంఆర్ సంస్థ అన్యాయంగా రైతుల భూములను లాక్కుంటున్నదని అన్నారు. తమ భూములు దక్కేవరకూ పోరాటం ఆపబోమని నొక్కి చెప్పారు.

శంషీర్ ఇంటిపై దాడి చేసిన కాషాయ గూండాలను శిక్షించాలి

డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి విజయ్ డిమాండ్

- ఈసీఐఎల్ చౌరస్తాలో ఆర్ఎస్ఎస్, బీజేపీ దిష్టిబొమ్మలు దహనం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేరళలో ఎమ్మెల్యే, డీవైఎఫ్‌ఐ అఖిల భారత ఉపాధ్యక్షులు ఎఎన్ శంషీర్ ఇంటిపై ఆర్ఎస్ఎస్, బీజేపీలకు చెందిన కాషాయ గూండాలు బాంబుదాడి చేయడాన్ని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ విజయ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. శంషీర్ ఇంటిపై దాడి చేసిన కాషాయ గూండాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శంషీర్ ఇంటిపై దాడిని ఖండిస్తూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. అందులో భాగంగానే డీవైఎఫ్‌ఐ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో ఆర్ఎస్ఎస్, బీజేపీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ శంషీర్‌ను చంపాలనే కుట్రతోనే శనివారం ఉదయం ఆర్ఎస్ఎస్, బీజేపీ గూండాలు ఆయన ఇంటిపై బాంబుదాడి చేశారని విమర్శించారు. శబరిమలలో సంప్రదాయం పేరుతో మహిళలను ఆలయంలోకి అనుమతించాలనే సుప్రీం కోర్టు తీర్పును ధిక్కరిస్తూ అలజడి సృష్టిస్తున్నారని చెప్పారు. శబరిమలకు స్వచ్ఛందంగా వస్తున్న మహిళలను సుప్రీం కోర్టు తీర్పును అమలు చేస్తున్న కేరళ ప్రభుత్వంపై అస్థిరతను కల గచేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. డీవైఎఫ్‌ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, నాయకులు కిరణ్, భాస్కర్, శశాంక్, శ్రీకాంత్, నరేష్ రెడ్డి, నవీన్ గౌడ్, మధు,సాయి గౌడ్ పాల్గొన్నారు.

ఈవీఎంలను రద్దు చేసి.. బ్యాలెట్‌ను కొనసాగించాలి

బామ్‌సెఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ చింతల

- ఈవీఎం ట్యాంపరింగే కాదు..అదో స్కామ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) విధానాన్ని రద్దు చేసి బ్యాలెట్ విధానాన్ని కొనసాగించాలని బ్యాక్‌వర్డ్ అండ్ మైనారిటీ కమ్యూనిటీ ఎంప్లాయీస్ పెడరేషన్ (బామ్‌సెఫ్) జాతీయ కార్యదర్శి శ్రీకాంత్ చింతల ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. ఈవీఎంలు పెద్ద స్కామ్ అని ట్యాంపరింగ్ మాత్రమే కాకుండా ఇంకా అనేక లోపాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈవీఎం విధానంతో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలోకి నెట్టివేయబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తాము నాలుగేండ్లుగా దేశవ్యాప్త ఉద్యమం చేస్తున్నామని అన్నారు. ఈవీఎంలలో అవకతవకలపై ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో బామ్‌సెఫ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలు పారదర్శకంగా పనిచేస్తాయని నమ్మలేమని 2013లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. మిషన్‌తోపాటు వీవీప్యాడ్ స్లిప్పులను కూడా లెక్కించాలని ఈసీని ఆదేశించినా పట్టించుకోవడంలేదని విమర్శించారు. స్లిప్పులను కేవలం వ్యక్తి ఓటు వేసినప్పుడు పడిందా లేదా అనేది చూసుకోవడానికే ఈసీ పరిమితం చేస్తున్నదని మండిపడ్డారు. వాటిని లెక్కిస్తే వచ్చే నష్టమేమిటో ఈసీ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎందుకు లెక్కించలేకపోతున్నారో ప్రజలకు తెలియజేయాలని అన్నారు. దీనిపై తమ సంస్థ దేశవ్యాప్త ఉద్యమం చేస్తున్నదని అన్నారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ మాత్రమే కాదని.. అదో స్కామ్ అని దీనిపై ప్రజలు, పోటీ చేసే నాయకులకు సైతం అవగహన లేదని అన్నారు. వారిలో చైతన్యం కలిగించేందుకు ఉద్యమ బాటపట్టామని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఓటు అనేది రహస్యంగా ఉండాలి. కానీ ఈవీఎం మిషన్లతో అది సాధ్యం కాదు. ఓటు ఎవరికి వేశారో ఈసీ సులభంగా తెలుసుకోవచ్చు. గెలిచిన వ్యక్తి కూడా తెలుసుకునే అవకాశం ఉంది. ఇది ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం. అంతేకాకుండా కొద్ది ఓట్ల తేడాతో ఓడిన వ్యక్తి రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకునే హక్కును రాజ్యాంగం కల్పించింది. ఈ అవకాశం ఈసీ తుంగలో తొక్కుతున్నదని మండిపడ్డారు. బామ్‌సెఫ్ జాతీయాధ్యక్షులు వామన్‌మేశరామ్ మాట్లాడుతూ 2013 అక్టోబర్ 8న సుప్రీంకోర్టు తీర్పు గురించి మీడియా సంస్థలు విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గెలిచే అభ్యర్థి, ఓడే వ్యక్తిని ఎన్నికలకు ముందే ఈవీఎంలు నిర్ధారిస్తున్నాయని విమర్శించారు.

బ్యాలెట్ విధానాన్ని తీసుకురావాలని ఈసీని డిమాండ్ చేశారు. ఇటీవల ఎన్నికల్లో పరాజయం పాలైన నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఫెరోజ్‌ఖాన్ ఈసీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బోగస్ ఓట్ల వల్లే తాను మూడు సార్లు ఓటమి చవిచూశానని తెలిపారు. ఈ విషయాన్ని ఈసీకి, కోర్టు దృష్టికి తీసుకెళ్లిన తనకు న్యాయం జరగలేదని వాపోయారు. ఈసీ తీరుపై కేసు నమోదు చేయాలని త్వరలోనే సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేయనున్నట్టు వివరించారు. సమావేశంలో బామ్‌సెఫ్ ప్రతినిధులు శాంతినాయక్, పద్మారావు, కుమార్ పాల్గొన్నారు.

బహుభాషా సాహిత్యవేత్త డా॥నోముల

"రచయితలు రెండు రకాలు. ఒక ఉద్గ్రంథాన్ని వొదిలి పోయేవారు. తమకు రచనాసక్తి తక్కువైనా సారస్వతానికి కొత్త జీవాన్నిచ్చేవారు. ఏ కొందరో రెండూ చేయగలవారుంటారు" అనే చలంగారి మాటలు డా. నోముల సత్యనారాయణగారికి అక్షరాలా వర్తిస్తాయి.

డా॥నోములవారు 10-8-1940వ తేదీన జన్మించారు. తల్లిదండ్రులు నోముల మల్లయ్య, శీనమ్మ. తండ్రి జన్మస్థానం నల్లగొండ. తల్లి జన్మస్థలం ఖమ్మం. నోములవారు పుట్టక ముందే, కలప వ్యాపారం నిమిత్తం తండ్రి ఖమ్మం (అత్త వారింటికి) వెళ్ళారు. నోములవారు పదకొండేళ్ళ పిల్లవాడిగా ఉన్నప్పుడే తండ్రి మరణించారు. ఏడుగురు అక్కల తర్వాత కలిగిన ఎనిమిదవ సంతానం నోముల సత్యనారాయణగారు. కొడుకు సర్వరక్షణభారం తల్లి వహించింది.

హెచ్.యస్.సి. వరకు (1956) ఖమ్మంలోనే చదువుకున్నారు. వరంగల్లులో పి.యు.సి. (1957) పూర్తి చేశారు. పి.యు.సి. లో వరవరరావు సహాధ్యాయులు. నల్లగొండలో బేసిక్ టీచర్ ట్రైనింగు చేశారు. 1959లో ఖమ్మంలో ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో చేరినారు. బదిలీ మీద సెప్టెంబరులో నల్లగొండకు వచ్చినారు. 1962 లో ఇంగ్లీషు ప్రధానాంశంగా డిగ్రీ (ప్రైవేటుగా), 1964లో హైదరాబాదులో బి.ఎడ్. పూర్తిచేశారు. అలీఘడ్ యూనివర్సిటీ నుంచి ప్రైవేటుగా ఎం. ఎ. ఇంగ్లిషు (1968) పూర్తిచేశారు. రామగిరి, పానగల్లు, మాన్యం చెలక పాఠశాలల్లో 1970 వరకు ఉపాధ్యాయునిగా పనిచేశారు. 1970లో జూనియర్ లెక్చరర్గా పదోన్నతి పొంది నాగార్జునసాగర్లో ఎనిమిది నెలలు పనిచేసి తిరిగి బదిలీ మీద నల్లగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చారు. 1977లో డిగ్రీ కళాశాల లెక్చరర్గా పదోన్నతి పొందారు. 1998 ఆగస్టులో ఉద్యోగవిరమణ చేసే వరకు నల్లగొండలోని నాగార్జున డిగ్రీ కాలేజిలో పనిచేశారు. మొత్తం ముప్పై తొమ్మిదేళ్ళ ఉద్యోగ జీవితంలో ఒకటిన్నర సంవత్సరాలు మాత్రమే నల్లగొండ కాకుండా ఇతర ప్రాంతాలలో (నాగార్జునసాగర్, పాలెం, మహబూబ్నగర్) పనిచేశారు.

"నీవు పిల్లలను ప్రేమించడం మొదలు పెడితే వాళ్ళ శ్రేయస్సును కాంక్షిస్తావు. వాళ్ళకు మంచి విద్య గరపాలనే అభిలాష కలుగుతుంది. మంచి విద్య నేర్పాలంటే నువ్వు సమర్థుడివి కావాలె. వీటన్నిటికి ప్రేరణ ఏందంటే ప్రేమే ఆధార భూతమైన లక్షణం. తల్లిదండ్రుల తర్వాత అంత అవ్యాజంగా, ఉపాధ్యాయుడు పిల్లలను ప్రేమించగలిగి ఉండాలె. ప్రేమ లేనివాడు ఉత్తమ ఉపాధ్యాయుడు కాలేడు. విద్యాసాగరమయి ఉండవచ్చు, ఉత్తమ ఉపాధ్యాయుడు కాజాలడు" అని నోముల వారన్నారు. ఆయన అంత ఆదర్శ ఉపాధ్యాయుడిగానే గడిపారు. విద్యార్థులపట్ల ప్రేమమూర్తి, సహోద్యోగుల పట్ల స్నేహమూర్తి. వారి పాఠాలు విన్న విద్యార్థులు ఎవరూ, వారిని మరచిపోలేరు.



"న్యూ మొరాలిటీ ఇన్ ఇండియన్ ఇంగ్లిష్ నావెల్, విత్ స్పెషల్ రిఫెరెన్స్ టు ముల్క్ రాజ్ ఆనంద్, ఆర్కే. నారాయణ్ అండ్ అరుణ్ జోషి" ("భారతీయ ఆంగ్ల నవలలలో నవ్య నైతికత - ముల్క్ రాజ్ ఆనంద్, ఆర్కే.నారాయణ్ అరుణ్ జోషి సందర్భంలో") అనే అంశం మీద డా॥జగన్మోహనాచారిగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి 1987 లో పిహెచ్.డి. పట్టా పొందారు. పి.యు.సి. వరకే వారు కాలేజికి వెళ్ళి చదువుకున్నారు. ఆ తర్వాత అంతా స్వీయ అధ్యయనమే. పట్టుదలతో సొంతంగా చదువుకొని ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ భాషాసాహిత్యాలలో అమోఘమైన పాండిత్యాన్ని సంపాదించారు. కొంత వరకు ఫ్రెంచ్ భాష నేర్చుకున్నారు. కన్నడం, మరాఠీ చదువగలరు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ భాషలలో, ఏ భాష నుంచి ఏ భాషలోకి అయినా అనువాదం చేయగల నైపుణ్యం సంపాదించారు.

1970 దశకంలో 'లక్ష్మీపతి', 'సత్యం' అనే కలం పేర్లతో కొన్ని సాహిత్య వ్యాసాలు రాశారు. ఆ వ్యాసాలు అన్నీ కలిపి, వారి ఉద్యోగవిరమణ సందర్భంలో (1998) 'సామ్యవాద వాస్తవిత - మరి కొన్ని వ్యాసాలు' పేరుతో పుస్తకంగా (వారి మిత్రులు) ప్రచురించారు. శ్రీశ్రీ రాజకీయ దృక్పథం, చితి - చింత, "తీర్పు": సామ్యవాద వాస్తవికత, అంతర్జ్వాల, రాజు మహిషి - ఒక పరిశీలన, కోర్టుల 'మాయ', సాహిత్యవిమర్శలో వ్యక్తిత్వాధిగమనం, ప్రేమ్చంద్ 'హోరాహోరీ', కృష్ణశాస్త్రిపై ప్రభావాలు ఒక టిప్పణి అనేవి ఈ పుస్తకంలోని వ్యాసాలూ. ఈ వ్యాసాలన్నీ వారి విస్తృత అధ్యయన తత్పరతకు, సునిశిత విశ్లేషణాశక్తికి తార్కాణాలే.

టావ్ చెంగ్ చైనా భాషలో రాసిన నవలను ఆంగ్లానువాదం ఆధారంగా 'నా కుటుంబం' పేరుతో తెలుగులోకి అనువాదం చేశారు. 'మరో కొత్త వంతెన' (1993) అనే తెలుగు - ఉర్దూ సంకలనం కోసం



ఏడు తెలుగు కవితలను ఉర్దూలోకి అనువదించారు. సార్వత్రిక విశ్వవిద్యాలయంవారి డిగ్రీకి సంబంధించిన చరిత్ర పాఠ్యపుస్తకం కోసం రెండు అధ్యాయాలు తెలుగు నుంచి ఉర్దూలోకి అనువదించారు.

ఆ తర్వాత, 'ప్రజాసాహితి' వారి మఖ్దూం ప్రత్యేక సంచికకోసం (2003 అక్టోబర్) "మఖ్దూం మొహియుద్దీన్ వ్యక్తిత్వం - కృతిత్వం" అనే వ్యాసం రాశారు. పెన్నా శివరామకృష్ణ (ఈ వ్యాసకర్త) రాసిన 'సల్లాపం' గజళ్ళ సంపుటికి కొత్త విస్తృతమైన పీఠిక రాశారు. ఈ రెండు రచనలు వారికి ఉర్దూ కవిత్వం మీద ఉన్న గాఢమైన అవగాహనను, అధికారాన్ని ప్రతిఫలిస్తాయి. మరికొన్ని పుస్తకాలకు ముందుమాటలు కూడ రాశారు. వివిధ రచయితల పుస్తకాలను పరిచయం చేస్తూ వివిధ సభలలో విశ్లేషణాత్మక ప్రసంగాలు చేశారు.


నల్లగొండలో వారి సలహాలు తీసుకోని సాహిత్య సంస్థలు కాని, వారు ప్రధాన పాత్ర పోషించని సాహిత్యసమావేశాలు కాని ఉండేవి కావు. తన శిష్యులను కూడ తనతో సమానంగానే పరిగణించేవారు. శిష్యుల అభ్యుదయానికి మురిసిపోతుండేవారు. ప్రతిభను ప్రశంసిస్తూనే, లోపాలను సున్నితంగా సూచించే తత్వం వారిది. "అట్లా కాకుండా, ఇట్లా అంటే బాగుంటుంది!" అని అనేవారు కాదు. "నేనైతే ఇట్లా అంటా!" అని అనేవారు. యువరచయితలలో, ఎవరిలో ఏ చిన్న మెరుపు కనిపించినా "పిల్లడు బాగా రాస్తున్నడయ్యా!" అని సంబరపడేవారు. ఆయన ఎప్పుడూ వామపక్ష భావజాలం వైపే మొగ్గు చూపినా, స్త్రీ, దళిత, బహుజన, మైనారిటీ, ప్రాంతీయ అస్తిత్వవాదాలను సానుకూలంగా స్వీకరించి వ్యాఖ్యానించేవారు. వారితో ఎవరైనా మొదటిసారి సంభాషించినా, ఎంతోకాలం నుంచి పరిచయమున్నంత సాన్నిహిత్యం, చనువు ఏర్పడతాయి. అది వారి వ్యక్తిత్వంలోని ఆహ్లాదకరమైన లక్షణం.

ఆయనది మార్క్సిజం నేపథ్యంగా కలిగిన ప్రగతిశీల దృక్పథం. అయినప్పటికీ శిల్పాన్నీ, సౌందర్యాన్నీ కూడ ఆనందించేవారు. దృక్పథాలకు, భావజాలాలకు అతీతంగా ప్రతిభను గౌరవించేవారు. విశ్వనాథవారి దృక్పథం తనకు ఆమోదయోగ్యం కాకపోయినా "ఆయనలాగా అనేక సాహిత్య ప్రక్రియలు చేపట్టి అన్నింటిలో ఉత్తమస్థాయి రచనలు చెయ్యగలిగిన వారు ప్రపంచ సాహిత్యంలోనే ఎక్కడా కనిపించరు" అని నోములవారు అంటుండేవారు. ఆయనది అన్ని విషయాలలో ప్రజాస్వామిక ధోరణి. అందుకే అన్ని పక్షాల వారు ఆయనకు సన్నిహితులు కాగలిగినారు.

నేటి ప్రముఖ రచయిత 'అంపశయ్య' నవీన్ గారు 1964 నుంచి 1970 వరకు నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (నల్లగొండ) అర్థశాస్త్ర ఉపన్యాసకులుగా పనిచేశారు. నవీన్ గారు 1968లో 'అంపశయ్య' నవల రాశారు. ఆ నవల రాతప్రతిని చదివిన కొద్దిమందిలో నోముల వారొకరు. "It was a rich Novel", (ఇటీజ్ ఎ రిచ్ నావెల్), ఈ నవలకు తెలుగు సాహిత్యంలో ఒక శాశ్వత స్థానం లభిస్తుంది" అని ప్రశంసించారు. ఇది నోములవారి కచ్చితమైన అంచనాలకు ఒక ఉదాహరణ.

వామపక్ష నిబద్ధత కలిగినవారు ప్రేమ, శృంగారం లాంటి వస్తువుల జోలికి పోకూడదనే ఒక అప్రకటిత నిబంధన అమలులో ఉండడాన్ని ఆయన నిరసించే వారు. 'నిబద్ధత', 'ప్రయోజనం' అనే విషయాలు సాహిత్య సృజనకు మిక్కిలి అవసరమూ, ప్రధానమైన విషయాలే. కాని అవి మాత్రమే సమగ్ర జీవన నిర్ణాయకాంశాలు కావు కదా! జీవితంలో శృంగార, సంయోగ వియోగ విషాదాలు కూడా భాగాలే. నిరంతరం 'అభ్యుదయం', 'నిబద్ధత' అని నినదిస్తే, ఆ నినాదంతో ఏకనాదత (monotony), విసుగు, ఫలితంగా విముఖత లేదా నిర్లిప్తత కలుగుతై. రూప, భావ వైవిధ్యం కోసమైనా కొంత మార్పు అవసరం" అంటూ నా పుస్తకానికి (సల్లాపం) రాసిన ముందుమాటలో పేర్కొన్నారు.

గజలుకు సంబంధించి, "షేర్లు బేసి సంఖ్యలోనే ఉండాలి. దీనికొక వింత సమర్థన ఉంది. ప్రియురాలు అసమానమైనది (నిరుపమానమైనది) కనుక షేర్ల సంఖ్య కూడ అసమంగానే ఉండాలి" అని వివరించారు. నేను వారికి ప్రియశిష్యుడనే అయినప్పటికీ ఎక్కడా అతిశయోక్తులతో ప్రశంసించలేదు. పెన్నాలో కవితారచనా ప్రతిభ, ప్రజ్ఞ నిండుగా ఉన్నై. గజలును తెలుగు నేలలో అంటుకట్టడంలో సఫలీకృతుడైనాడనే అనవచ్చు. గమన (రవానీ) దోషాల కలుపును ఏరివేసి గాయన సౌలభ్యం (తఘజ్జుల్) పెంచితే ఇంతకంటే సుందర సుమధుర పుష్పవనం వెల్లివిరుస్తుంది" అని చెప్పడం వారి సమదృష్టికి సంకేతం.



దివాకరుని కృష్ణమోహనశర్మ, కొంపెల్లి వెంకట్ గౌడ్ వారిని సుదీర్ఘంగా ఇంటర్వ్యూ చేసి 'నోముల సార్ - అన్ టోల్డ్ లెసన్స్' (2010) అనే పుస్తకం అచ్చు వేశారు. ఈ పుస్తకం వారి వ్యక్తిత్వానికి ఉత్తమ దర్పణం లాంటిది. సుమారు మూడు దశాబ్దాలపాటు వారితో సన్నిహితంగా మెలిగే అవకాశం వారు నాకు ఇచ్చారు. నా చాల రచనలకు వారే మొదటి శ్రోత (పఠిత), సంపాదకుడు. కవిత్వవిశ్లేషణకు సంబంధించి వారి నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ సాహిత్యాలకు సంబంధించి నాకు ఏ సందేహం కలిగినా వారిని ఫోన్ ద్వారా సంప్రదిస్తుండే వాడిని. విసుగూ, విరామం లేకుండా వారు జవాబులు చెబుతుండేవారు. వారి ప్రోత్సాహం, సహకారం లేకపోతే నేను 'గజల్ సౌందర్య దర్శనం' (2011) అనే పుస్తకం రాయగలిగే వాడిని కాదు.

"ఇతర పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయుల కంటే భాషోపాధ్యాయులకు అదనపు బాధ్యతలు ఉన్నాయి. తాము బోధించే భాషాసాహిత్యాల గూర్చి మాత్రమే కాకుండా, ఇతర భాషాసాహిత్యాలను గూర్చి, ఆయా భాషలకు సంబంధించిన వ్యాకరణ అంశాలను గూర్చి భాషోపాధ్యాయులు తెలుసుకోవాలి. ఇతర మతాలను గూర్చి, సంస్కృతులను గూర్చి తెలుసుకోవాలి. చరిత్ర, తత్వశాస్త్రాల మీద తగిన అధికారం ఉండాలి. తమ పాఠ్యాంశ బోధనలో సందర్భానుసారంగా వాటిని కూడ వివరించాలి. విద్యార్థి సమగ్ర జ్ఞాన, వ్యక్తిత్వ వికాసాలలో భాషోపాధ్యాయుని పాత్ర కీలకమైనది" అని వారు ఎప్పుడూ చెబుతుండేవారు. గురువుగారు డా॥ నోముల సత్యనారాయణ గారికి నా హార్దిక నివాళి!

- పెన్నా శివరామకృష్ణ, 9440437200

జెండాలు మారుస్తున్న చీకట్లు!

చలి పులి వెంటాడుతుంటే
మనం అత్తి పత్తి ఆకులమవుతున్నాం
వాళ్ళేమో దుమ్మెత్తి పోసుకుంటున్నారు
ఎన్నికల రుతువు ఆగమించిందా?!

కుర్చీ దిగనున్న సత్య హరిశ్చంద్రుడు
కొత్త అబద్ధాలు ప్రాక్టీసు చేస్తున్నాడు
ప్రత్యర్థులేమీ తక్కువ తినలేదు
మాట తప్పిన ఘటనలను పూసగుచ్చుతున్నారు!

ఇక్కడెవరూ శుద్ధ పప్పుల్లేరు
అంతా దేశాన్ని శవాన్ని చేసి
పేలాలేరుకునే బాపతే
జస్ట్! అధికార మార్పిడికే ఇంత హంగామా!



నిజాయితీని పెట్టుబడిని చేసిన చౌకీదార్
చౌరాస్తాలో నిలబడ్డాడు
సొంత బలం లేని బుడ్డోడు
ఈ మధ్య గట్టిగనే నిలదీస్తున్నడు!

చరిత్ర తెలిసిన దేశం
అతన్ని నమ్మ లేక
ఇతన్ని సమర్థించ లేక
సందిగ్ధ సంద్రంలో కొట్టు మిట్టాడుతున్నది!

ఎవరో ఒకరు
చేత కాగడా పట్టంది
జెండాలు మార్చే చీకట్లు
ఈ దేశాన్ని వదలి పెట్టవు!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి, 9440233261

కొండి మల్లారెడ్డికి అలిశెట్టి సాహిత్య పురస్కారం

అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి సందర్భంగా తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ ఫిలిమ్ భవన్లో ఈ నెల 12వ తేదీ ఉదయం 10గంటలకు ఏర్పాటు చేసిన సమావేశంలో కొండి మల్లారెడ్డికి పురస్కారం ప్రదానం జరుగుతుంది. ఇందులో కందుకూరి అంజయ్య, ఆచార్య జయధీర్ తిరుమల రావు, నారదాసు లక్ష్మణరావు, జూకంటి జగన్నాథం, గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, నిజాం వేంకటేశం, పొట్లపల్లి వరప్రసాద్ రావు, సి. వి. కుమార్ పాల్గొంటారు.

- కూకట్ల తిరుపతి, 99492 47591

'సాహితీ మాణిక్యం' అవార్డులు

రావులపాటి నారాయణ, మాణిక్యం పేరిట ఇచ్చే 'సాహితీ మాణిక్యం' అవార్డును 2018కి గాను కోట్ల వెంకటేశ్వరరెడ్డికి, ప్రసాదమూర్తికి ప్రకటించారు. ఈ నెల 12వ తేదీన ఖమ్మంలో ఈ అవార్డులను ప్రదానం చేస్తారు.

- సీతారాం, 9866563519

పక్కి రవీంద్రనాథ్కు ఎక్స్రే అవార్డు

ఎక్స్రే సాహిత్య సేవా సంస్థ అందించే 'ఎక్స్రే 2018 జాతీయ స్థాయి అవార్డు'కు పక్కి రవీంద్రనాథ్ ఎంపికయ్యారు. ఉత్తమ కవితా పురస్కారాల కింద చొక్కాపు లక్షునాయుడు (విజయనగరం), వై.హెచ్.కె.మోహనరావు (పిడుగురాళ్ళ), పాలువ శ్రీనివాస్ (రాయదుర్గం), వి.యోగానందం నాయుడు (తిరుపతి), షేక్ ఖాజా మొహిద్దీన్ (కర్నూల్), పద్మావతి రాంభక్త (విశాఖపట్నం), చిత్తలూరి (హైదరాబాద్), కె.వి.నాగేశ్వరరావు (కోవూరు), వెన్నెల సత్యం (షాద్నగర్), స్వాతి శ్రీపాద (హైదరాబాద్) ఎంపికయ్యారు.

- కొల్లూరి

చేపల కంట్లో

మీరెప్పుడైన
కళ్ళ కింద కొలను నిర్మించారా?
కొలనులోని చేపల కంట్లో
అక్షర దీపాన్ని వెలిగించారా?



కాలే సాంప్రదాయ కట్టెలు కడుపులో శబ్దించాయి
కాళ్ళ కింద పొంగుతున్న కట్టుబాట్లు వెక్కిరించాయి
ఊగే కొమ్మకు ఆడపేరు పెట్టిందెవరు?
కొమ్మను బొమ్మగా చేసి గోపురానికి వేలాడతీసిందెవరు?

పేరు వెనుక సూదుల దాడులెందుకు?
జీవితం ముందో, వెనుకో
వెలుగుతున్న దీపాన్ని లాక్కున్నదెవరు?
ఇప్పుడామె ఆకు కాదు సముద్రపు అరణ్యం

నుదుటిపై సూర్యాస్తమయాలకు కొరివి పెట్టి
వెచ్చగానో, ఎడారిగానో నవ్విన వారు
ఎవరైతే ఏంటి?
వారి ముఖాలపై కొలను నిర్మించి
అక్షర దీపాన్ని వెలిగించండి...

రెండు కనుబొమ్మల మధ్య తెరను తెంపి
పావురాన్ని వదిలిన ఆమెకు జోహార్లు
చేపల కంట్లో నుండి సుడులు సుడులుగా లేచే
అక్షరాన్ని చూసి పువ్వులై వికసించండి...

- జాని.తక్కెడశిల, 7259511956

సమాజాన్ని అలికిన అలుకు పిడచ

కవి, రైతు... ఒకే కోవకు చెందిన వారు. రైతు భూమిని కౌలుకు తీసుకుంటే, కవి సమాజాన్ని కౌలుకు తీసుకుంటాడు. అమాయకులు, మాయ తెలియనివారు కవిత్వంతో మాయ చేయగలరు. ఈ కోవకు చెందిన కవి కందుకూరి శ్రీరాములు గారు.

రావురూకల గ్రామం చిన్న పల్లెటూరు. మధ్య తరగతి కుటుంబం ఇచ్చిన చిన్న ఉద్యోగాలు, తల్లిదండ్రుల ప్రేమ, ఇవన్నీ ఇచ్చిన అనుభవాలు మాత్రం చాలా ఎక్కువ.

బాల్యం అని ఒకమాట వినగానే ఒక్కసారిగా ఆ వెన్నెల రాత్రుల్లోకి దుంకి, చుక్కల దుప్పటి అటుదన్ని, ఇటుదన్ని పండుకోవడం, మాయమర్మం తెలియని ఆ బాల్యంలోకి వెళ్ళి, ఒక్కసారి మొత్తం తన అనుభవాలను గలగల చెప్పుకుంట చిన్న శ్రీరాములుగా మారడం ఆశ్చర్యం కలిగిస్తుంది. 1993లో వయోలిన్ రాగమో వసంత మేఘమో... మొదటి సంకలనం నుండి 28మందితో కలిసి గుజరాత్కి వెళ్లి అక్కడ జరిగిన మారణకాండకు చెలించిన హృదయంతో 'దహన కావ్యం' అనే శీర్షికతో కవితా సంపుటి వెలువరిచారు. దీని ద్వారా గమనించి రాసే తత్వం, చలించిపోయే సున్నితత్వం మనకు అగుపడుతుంది.





సమాజంలో ఎన్నో సంఘటనలు జరుగుతాయి. వాటిని అందరం చూస్తాం. కాని వాటికి స్పందించి, నిశితంగా పరిశీలించి, ఆలోచించి, తన అనుభవాన్ని, అనుభూతిని జోడించి రాసేవాడే కవి.

శ్రీరాములు సార్ కవిత్వంలో ఆయన బాల్యం ముడివడి వుంటుంది. అతను దోస్తానా చేసిన చెరువుకట్ట, ఈత కొట్టిన మోటబాయి, తలనూనెగ మారిన ఆముదం చెట్లు, ఎవరికీ తెలియకుండా చేను చెలకలల్ల సినిమా కోసం సీటీలు గొట్టుకుండా ఉరకడం... ఇవన్నీ ఊరు ఆయనకు ఇచ్చిన తీపి జ్ఞాపకాలు. ఈ కల్మషం లేని బాల్యం కవిత్వాన్ని నేర్పింది. కవిత్వం - జీవితం వేరుగా చూసేవాడు కవిత్వం రాయలేడు. రాసినా అది అనుభూతిని అందించదు. శ్రీరాములు గారు జీవితపు జ్ఞాపకాలను కవిత్వంతో రంగరించి రాస్తారు. కాబట్టే అతని కవిత్వంలో అనేక అనేక భావచిత్రాలు మనల్ని ఒక సముద్రానికి, ఒక వాగుకి, ఒకపల్లెకు, ఓ అవ్వకాడికి, తెలుగు భాషకు దగ్గరగా తీసుకుపోతాయి.

ఒకసారి అప్పటికప్పుడు సముద్రాన్ని చూసి వెంటనే దాని గురించి రాసారట. ఆ కవిత అందరి ప్రశంసలు అందుకుంది. సముద్రం ఒడ్డున కూర్చుని గమనిస్తే అది మన మనసుకు ప్రతిబింబం. మనసును దు:ఖం ముసిరినప్పుడు అలలు బరువెక్కినట్లు, సంతోషంగా వుంటే ఉద్వేగంతో ఎగిసిపడుతున్నట్టు అగుపడుతుంది. ఇది కవి ప్రత్యేకతా, సముద్రం ప్రత్యేకతా... ఏమో!

"భూమికి చిరునవ్వు పచ్చగడ్డి...
దేహానికి అంటిన చల్లదనం పోయి
మెల్లమెల్లగా మంచుపువ్వు మీద కాస్తుంది."

ప్రకృతితో అతనికున్న అనుబంధం కనబడుతుంది.

"ఊబిలో దిగబడ్డ చేతులు చాచిన దేహానికి నేలమీద దిగ్గొట్టిన మేకుకు కట్టిన తాడు చివరాఖరికి కొన్నాళ్ళ కోసమైనా తాడు దొరకాలి" ముదిమి అనే కవితలో వృద్ధాప్యం గురించి రాసిన కవితలో అంటారు.

జీవితాన్ని అనేక కోణాల్లో తన కవిత్వంలో చూపెట్టే శ్రీరాములు గారు మృత్యువు విషాదాన్ని కూడా గుండె పట్టేసెట్టు చెపుతారు.

"గిట్టడం ఒక సుదీర్ఘ దు:ఖయాత్ర
నిన్న కళ్ళముందు కదలాడిన నవయవ్వన జీవనగానం
ఈరోజు శిథిలమై, ముక్కలై..." అంటూ మనిషి మాయమైపోయె తీరు దు:ఖ భరితంగా చెప్పగలడు. కాని దు:ఖపడుతూ ఉండడం కాదు ఆ దు:ఖంలోనుండి వేదమై అవతరించాలి అంటూ ఒక గంభీర ముగింపును ఇస్తాడు. కందుకూరిగారి ప్రతి కవితలోనూ ముగింపులో ఒక ఆలోచనా పూరిత వ్యాఖ్యతో పూర్తి చేస్తాడు. ఇది ఆయన కవిత్వం ప్రత్యేకత.


"అక్షరం భోగవస్తువు కాదు"
"పూజకు సమర్పించే నైవేద్యమూ కాదు"
"చీకటిని చీల్చి వెలుగును చూపెట్టే దివ్వె" అంటూ అక్షరం పైన ఉండే తన గౌరవాన్ని చాటుతాడు. కాపు రాజయ్యగారి గురించి చాలా మంది చాలా రకాలుగా చెప్పారు. తెలంగాణా గర్వించదగ్గ చిత్రకారుడు రాజయ్య గురించి కందుకూరి గారు రాసిన కవిత్వం చదివితే ఆయన గీసిన చిత్రాలతోపాటు రాజయ్యగారు మన కళ్ళముందు నిలుచున్న అనుభూతిని పొందుతాం. కవుల పట్ల కూడా అనేకమంది ఉపమానాలిచ్చారు. కానీ కవి సముద్రానికి గురువు అని కవిని విశదీకరించలేని అత్యున్నత స్థానంలో నిలిపారు కందుకూరిగారు. 1970 - 80 దశకాలు తెలుగు నేల మీద ప్రత్యేకమైన మార్పును సంతరించుకున్న చారిత్రక కాలాలు. ఆ సమయంలో ఉస్మానియా అనేక మంది కవులను, మేధావులనూ, సమాజ మార్పుకు నడుం కట్టిన ఉద్యమకారులనూ అందించింది. అలాంటి ఒక ప్రత్యేక కాలంలో, ప్రత్యేక చారిత్రక సందర్భంలోంచి వచ్చినవారు కందుకూరి గారు. ఆ వారసత్వాన్ని ఆయన తెలంగాణ పోరాటం వరకూ కొనసాగించారు.

అటు పల్లెజీవితాన్ని, ఇటు పట్నం జీవితాన్ని సమపాళ్ళలో అనుభవించినా ఆయనకు పల్లెపట్ల, రైతుపట్లా మమకారమే ఎక్కువ. ఆ మమకారంతోనే ఇక నుంచీ తల్లి తండ్రి, ఆచార్యునితో పాటు రైతుదేవోభవ అనాల్సిందేనంటూ నినదిస్తాడు. పండగకోసం ఇల్లును అలంకరించడానికి తన నాయనమ్మ ఎట్లా అలుకు పిడచయ్యేదో మనకు దృశ్యం గా శ్రీరాములు చెబుతారు. తెలవారంగ లేచింది మొదలు పడుకునే దాక పొక్కిలి నేలకు అలుకు పిడచయ్యేది మా నాయనమ్మ అంటాడు. ఇప్పుడు కవిత్వాన్ని ప్రాణంగా చేసుకున్న శ్రీరాములు గారు నిత్య కవిత్వ అలుకుపిడచగా మనుషులనూ సమాజాన్ని అలుకుతూనే ఉన్నారు.

- సిహెచ్. ఉషారాణి, 9441228142

నాడు... నేడు

నాడు...
నాగలి నాగరికతను నాటింది
అగ్ని ఆకలిని, చీకటిని తరిమింది
చక్రం ప్రగతిని మోసుకొచ్చింది
అక్షరం ఆలోచనకు ఊతమిచ్చింది
కలం మధుర గళమయ్యింది
పుస్తకం మస్తిష్కానికి పదును పెట్టింది
భావాల విత్తులు ప్రేమ మొలకలైనాయి
మనిషి మానవత్వపు నిధి అయినాడు!



నేడు...
మనిషి, మాట, మనసు మాలిన్యకేంద్రాలు
సంబంధాలన్నీ వ్యాపార వస్తువులే
అధికారం హస్తలాఘవం నేర్పింది
అంతర్జాలం అశ్లీలతను వెదజల్లింది
క్రీడలు ఓడించటమే నేర్పాయి
డిగ్రీలు అంగట్లో సరుకులయినాయి
స్మార్ట్ఫోన్లు పైశాచికతకే ప్రతినిధులు
స్నేహబంధానికే చెదలు పట్టింది
పర్యావరణం పాడైపోయింది

- డా॥బుర్ర మధుసూదన్రెడ్డి, 9949700097

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@ gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్లింగంపల్లి, హైదరాబాద్- 500020



నా చదువు ఇంటర్ వరకు ఖమ్మంలోని ఆంధ్ర బాలిక పాఠశాలలోనే సాగింది. ఆ తర్వాత డిగ్రీ వరంగల్ లోని సికెఎం కాలేజీలో పూర్తిచేశాను. డిగ్రీ అయిపోయిన తర్వాత పెండ్లి కావడం.. ఇల్లు, పిల్లల బాధ్యతలు పెరగ డంతో పై చదువులకు ఫుల్‌స్టాప్ పడింది. మా ఆయన బిజినెస్‌మ్యాన్ కావడంతో ఇంటి బాధ్యతంతా నాపైనే. వారికి కావల్సిన ఆటబొమ్మలు నేనే చేసేదాన్ని. ఆ తర్వాత డిజైన్ డిజైన్ డ్రస్సులు కుట్టేదాన్ని. చిన్నప్పటి నుంచి తెల్లవారుజామున లేవడం అలవాటు. పిల్లలు బడికి వెళ్లే సమయంలో పని ఉండేది. వాళ్లు బడికి వెళ్లిన తర్వాత మధ్యాహ్నం ఖాళీ టైం ఉండేది. ఆ టైంను సద్వినియోగం చేసుకుంటూ డ్రాయింగ్ చేసేదాన్ని. పిల్లలు పెద్దవాళ్లైన తర్వాత తెల్లవారుజామున కూడా ఖాళీ సమయం ఉండేది. మంచిమంచి డిజైన్లు స్ఫురణలోకి వస్తాయి. మొదట్లో డ్రాయింగ్ చేసేదాన్ని. అక్క, అన్న, చెల్లీ నన్ను ఎంతో ప్రోత్సహించేవారు. నేను వేసిన డ్రాయింగ్స్, చేసిన బొమ్మలు చూసి మా ఆయన మెచ్చుకునేవారు. చిన్నప్పుడు పిల్లలకు అంతగా నా కళల గురించి తెలిసేది కాదు.. ఇప్పుడు మాత్రం ఇలా ఉంటే బాగుంటుంది అంటూ సూచనలు ఇస్తున్నారు.











ఖాళీ సమయం కళల కోసం..

ప్రతిమనిషి ఎంత బిజీగా ఉన్న ఖాళీ సమయం అంటూ కొంత ఉంటుంది. ఇక గృహిణిల విషయానికి వస్తే వారికి కాస్త ఎక్కువే ఖాళీ సమయం దొరుకుతుంది. ఈ సమయాన్ని టీవీసీరియల్స్‌కు, టైం పాస్ కబుర్లకు పరిమితం చేయకుండా సృజనాత్మకతకు పదునుపె ట్టేవారు కొంతమంది ఉంటారు. వాళ్లకు అగ్గిపుల్ల, కుక్కపిల్ల, సబ్బుబిల్ల కాదేది కవితకు అనర్హం అని శ్రీశ్రీ అన్నట్లు బట్టముక్క, కాగితం ముక్క, చాక్‌ముక్క కాదేది అలంకరణకు అనర్హం అంటారు. ఇలాంటి వారే కొత్తపల్లి శ్రీలక్ష్మి. ఖాళీ సమయాన్ని కళత్మాకంగా మార్చుకుంటూ.. తాను రూపొందించిన వస్తువులతో ఇంటికి అందమైన షోకేస్‌గా తీర్చిదిద్దు తున్నారు. ఇంటి అలంకరణకే కాదు.. స్నేహితులకు, బంధువులకు బహు మతులుగా ఇస్తూ.. ఔరా అనిపిస్తున్నారు. సరదాగా ప్రారంభమై.. సృజనాత్మకతకు చిరునామై సాగుతున్న ఆమె పరిచయం..





అమ్మ పిల్లలకు తొలిగురువు అంటారు. నిజంగా మా అమ్మ సుగుణ నాలోని సృజనాత్మకత పెంచిన తొలి గురువు. మేం పదిమంది పిల్లలం. ఆరుగురు అమ్మాయి లు. నలుగురు అబ్బాయిలు. మమ్మల్ని పెంచడంతో పాటు కుట్లు, అల్లికలతో ఇంటిని అందంగా తీర్చిదిద్దేవారు. క్షణం తీరిక లేకుండా గడిపే ఆమె ఎంతో ప్లాన్డ్‌గా అన్ని పనులు చేసుకునేవారు. నాన్న అప్పారావు మా చదువుల గురించి ఎంతో శ్రద్ధతీసుకునేవారు. ఆడపిల్లలు, మగపిల్లలు అన్న వివక్ష లేకుండా అందరినీ చదివించారు. మా అభిరుచుల ను గుర్తించి ప్రోత్సహించారు. మా పెద్దక్క డాక్టర్ అంజనీ వరంగల్‌లో పనిచేస్తున్నారు. ఆమె మంచి ఆర్టిస్ట్. అన్నయ్య కూడా ఆర్టిస్ట్. మా చెల్లాయ్ భార్గవి ఆర్టిస్ట్. ఆమె ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఎంతో మంది చిన్నారులకు పెయింటింగ్ నేర్పిస్తున్నారు. దాదాపు మా అందరికీ ఏదో ఒక కళల్లో ప్రవేశం ఉంది.

అప్పుడప్పుడు ఇంటర్నెట్ లో వెరైటీ డిజైన్స్ తయారు చేసే వీడియోలు చూపిస్తున్నా రు. కొత్తకొత్త ఐడియాలు ఇస్తున్నారు.

ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం డ్రాయింగ్‌తో ప్రారంభించాను. ఆ తర్వాత పేపర్ ఆర్ట్ నేర్చుకున్నాను. అందమైన బొమ్మలు ఎన్నో చేశాను. మా ఇంట్లో షోకేస్ అంతా నేను చేసిన బొమ్మలతో నిండి పోయింది. ఇంటికి వచ్చిన అతిథులు, స్నేహితులు వాటిని చూసి మెచ్చుకుంటుంటే ఎంతో గర్వంగా ఉండేది. ఆ ఉత్సాహంతో మరిన్ని బొమ్మలు తయారుచేసేదాన్ని. చాక్‌పీస్ కార్వింగ్ చేయడం ప్రారంభించిన తర్వాత ఎన్నో రకరకాల బొమ్మలు తయారుచేశాను. ఇప్పుడు బంధువులు తమకు కావల్సిన బొమ్మలు చేసివ్వమని అడుగుతున్నారు. వచ్చేనెలలో మా బంధువుల పెండ్లి అమెరికాలో ఉంది. వాళ్లు కొన్ని బొమ్మలు కావాలన్నారు.

సమాచారం తెలుసుకోవడానికి తప్ప కాలక్షేపం కోసం నేను టీవీ చూడను. అంత తీరిక సమయం నాకు లేదు. నాకున్న తీరిక సమయంలో చాక్‌పీస్ కార్వింగ్, పేపర్ ఆర్ట్, డ్రాయింగ్‌లతో బిజీగా ఉంటాను. ఇంకా టైం ఉండే మంచి నవలను చదువుతాను. ఉద్యోగాలు చేసే వారైనా.. ఇంట్లో ఉండేవారైనా ఖాళీసమయాన్ని సృతనాత్మ కత పెంచుకోవడానికి, కొత్త కళలు నేర్చుకోవ డానికి, కొత్త భాషలు తెలుసుకోవడానికి వినియోగిస్తే వారిలో పాజిటివ్ నెస్ పెరుగుతుంది. ఇది శారీరక ఆరోగ్యానికే కాదు మాన సికారోగ్యానికి ఎంతో మంచిది.

వి. యశోద

బిడ్డ ఎదుగుదలకు...



గర్భిణీలలో శిశువు తొమ్మిది నెలల పాటు ఆరోగ్యంగా పెరగాలంటే, తల్లి నుంచి సరైన పోషక పదార్థాలు బిడ్డకు చేరాలి. అలాగే తల్లి శరీరంలో జరిగే మార్పులకు కూడా ఇవి అవసరం. తల్లీ బిడ్డ అవసరాలకు కూడా ఐరన్, జింక్, క్యాల్షియం, పొటాషియం మొదలైన మినరల్స్ ఎంతో అవసరం. ఇవి కొద్ది మోతాదులో రోజూ అవసరం కాబట్టి వాటిని మైక్రోన్యూట్రియంట్స్ అంటారు. ఐరన్ తల్లిలో రక్తం సమృద్ధిగా పెరగడానికి తోడ్పడు తుంది. ఇది రక్తంలోని హిమోగ్లోబిన్‌ను పెంచుతుంది. తద్వారా శరీరంలోని అన్ని కణాలకు ఆక్సిజన్‌ను అంద జేస్తుంది. ఐరన్ లోపం వల్ల రక్తహీనత ఏర్పడుతుంది. క్యాల్షియం, ఎముకలు, దృఢంగా బలంగా ఉండటానికి తోడ్పడుతుంది. జింక్, కణాలలోని డీఎన్ఏ, ప్రొటీన్స్ పనితీరును మెరుగుపరుస్తుంది. పొటాషియం, కండరాల నాడీ వ్యవస్థను ఉత్తేజపరుస్తుంది. ఈ మినరల్స్‌తో పాటు ఐయోడిన్, ఫాస్పరస్, మెగ్నీషియం వంటివి బిడ్డలోని అన్ని అవయవాల ఎదుగుదలకు ఎంతో అవసరం.

ఆహారంలో తాజా ఆకుకూరలు, అన్ని రకాల కూరగాయలు, పండ్లు, పప్పులు, తృణధాన్యాలు, పాలు, పెరుగు, కొద్దిగా డ్రైఫ్రూట్స్, మాంసాహారులు అయితే గుడ్లు, మాంసం, చేపలు మితంగా తీసుకోవడం వల్ల అన్ని రకాల పోషకపదార్థాలు తల్లి నుంచి బిడ్డకు చేరి, బిడ్డ మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. పిండిపదార్థాలలో ఎక్కువగా కార్బోహైడ్రేట్స్ ఉంటాయి. ఇవి ఎక్కువగా తీసుకోవడం వల్ల బరువు పెరగటం, ఒక్కొక్కరి శరీరతత్వాన్ని బట్టి షుగర్ శాతం పెరిగి మధుమేహవ్యాధి వచ్చి ఇబ్బంది పడే అవకాశాలు ఉంటాయి. కాబట్టి ఉన్న బరువును బట్టి, ఫ్యామిలీ హిస్టరీ షుగర్ ఉన్నప్పుడు వీలైనంత వరకు తక్కువ తీసుకుంటే మంచిది. అలాగే డాక్టర్ సలహా మేరకు పోషక ఆహారంతో పాటు అవసరమైతే ఐరన్, క్యాల్షియం, మినరల్స్ విటమిన్స్‌తో కూడిన మందులు తీసుకోవడం కూడా మంచిది. ❄

మెరుపులాంటి ఛాయకు.. !

చాలామందికి ముఖం లేదా శరీరం అంతా ఒకే రంగులో ఉండదు. ముఖాన్నే తీసుకుంటే నోటిచుట్టూనో నుదుటిమీదనో, చెంపలపక్కనో మెడమీదో మిగిలిన భాగాలకన్నా నల్లగా ఉంటుంది. ఆయా భాగాలకు ఎక్కువ గా సూర్యరశ్మి సోకడమో లేదా హైపర్ పిగ్మెంటేషనో హార్మోన్ల అసమతుల్యత దీనికి కారణమవుతాయి. అలాంట ప్పుడు కొన్ని చిట్కాలు పాటిస్తే సరి.



- ఒక చెంచా కొబ్బరినూనె, ఒక చెంచా చక్కెర, అర చెంచా నిమ్మరసం బాగా కలిపి ముఖానికి మాస్క్‌లా వేసి మృదువుగా రుద్దాలి. ఓ అరగంట తరవాత గోరువెచ్చని నీళ్లతో కడిగేస్తే ముఖంమీద ఉన్న మచ్చల్నీ, పిగ్మెంటేషన్‌నీ మృతకణాల్నీ తొలిగించి ముఖమంతా తెల్లగా మెరిసేలా చేస్తుంది.
- రెండు చెంచాల పెరుగు, ఒక చెంచా పసుపు, చిటికెడు నిమ్మరసం కలిపి మిశ్రమంలా చేసి ముఖానికి పట్టించి ఆరాక చల్లని నీటితో కడిగేస్తే సరి.
- రెండు చెంచాల పాలపొడిలో ఒక చెంచా నారింజ రసం కలిపి ముఖానికి పట్టించి గోరువెచ్చని నీటితో కడిగేసినా మంచిదే.
- ఒక చెంచా ముల్తానీ మట్టి, ఒక చెంచా తులసి ఆకుల పొడి, ఒక చెంచా వేపాకు పొడి, ఒక చెంచా రోజ్ వాటర్ కలిపి పేస్టులా చేసి ముఖానికి పట్టించి ఆరాక చల్లని నీటితో కడిగేయాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ❄





శ్రావణి

రంగ వల్లులు




నరహరి శ్రావణి,
నల్లకుంట, హైదరాబాద్.

మా చిరునామా
మానవి,
నవతెలంగాణదినపత్రిక,
ఎం.హెచ్. భవన్,
21/1, అజామాబాద్,
హైదరాబాద్-20.
ఇ-మెయిల్:
manavi@navatelangana.com



ఇది తగ్గితే.. !



ఎక్కువగా నలభై దాటిన మహిళల్లోనూ సరిగ్గా ఆహారం తీసుకోని వాళ్లలోనూ కనిపించే సమస్య క్యాల్షియం లోపించడం. మాటిమాటికీ కాళ్ల నొప్పులనీ, మెడ నొప్పులనీ ఏదో ఒకటి చెబుతుంటారు. అసలు శరీరంలో క్యాల్షియం పాత్ర ఏమిటో తెలుసుకుంటే మంచిదని చెబుతున్నారు నిపుణులు.

ఎముకల్నీ, దంతాల్నీ, ఆరోగ్యంగా ఉంచి, ఆస్టియోపొరోసిస్‌ను నియంత్రిస్తుంది. రక్త సరఫరాని మెరుగుపరుస్తుంది. హార్మోన్ల పనితీరుని ప్రభావితం చేస్తుంది. కండరాల్లో సాగుదలను పెంచుతుంది. రక్తం గడ్డకట్టడానికీ క్యాల్షియం అవసరం. సంతానోత్పత్తికీ ఇది దోహదపడుతుంది. గుండె వేగాన్నీ, బీపీనీ నియంత్రిస్తుంది. కొలెస్ట్రాల్ పెరగకుండానూ చూస్తుంది. అందుకే శరీరానికి క్యాల్షియంను సమృద్ధిగా అందించే ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటుండాలి. అవేటంటే.. కాలీఫ్లవర్, క్యాబేజీ, ముల్లంగి ల్లోనూ రాజ్మా, సెనగలు, పెసలు, సోయా బీన్స్‌లోనూ కూడా కాల్షియం సమృద్ధిగా దొరుకుతుంది. పాలకూర, గోంగూర, తోటకూర వంటి ఆకుకూరలన్నీ క్యాల్షియం వనరులే. నారింజల్లోనూ ఇది ఎక్కువగా లభిస్తుంది. బాదం, ఎండుద్రాక్ష, ఖర్జూరం, అంజీర్, అప్రికాట్ల వంటి డ్రైఫ్రూట్స్‌లోనూ.. నువ్వులు, క్వినోవా వంటి ధాన్యాల్లోనూ క్యాల్షియం లభిస్తుంది. ఇక, పాలు పెరుగుతో పాటు చేపలు, గుడ్లలోనూ క్యాల్షియం పుష్కలంగా ఉంటుంది. కాబట్టి సప్లిమెంట్లతో పోలిస్తే ఈ ఆహారపదార్థాలను వీలైనంత ఎక్కువగా తినాలి. క్యాల్షియం లోపం లేకుండా జీవించొచ్చు. ❄

ఒక వాహనం ముందుకు సాగాలంటే ఇంధనం ఎంత అవసరమో మన శరీరం ఎదుగుదలకు ఆహారం కూడా అంతే అవసరం. ఆహారం తీసుకోవాలంటే ఆకలి వేయాలి కదా! కొందరికీ ఆకలి అనిపించదు. ఇది కూడా ఒక సమస్యే. శరీరానికి చక్కని ఆకృతి కోసమే కాదు శరీరధర్మప్రక్రియలన్నీ సజావుగా సాగడానికి కొన్ని ఆసనాలు ఉపయోగపడుతాయి. చక్కీచాలన్ ప్రక్రియ వాటిలో ఒకటి ..

ఆకలి పెరిగేలా..



చక్కీచాలన్ ప్రక్రియ..

వెన్నెముక, తల నిటారుగా పెట్టి కూర్చొవాలి. కాళ్ళను ముందుకు చాపి మెల్లగా రెండు కాళ్ల మధ్య దూరం పెంచాలి. ఇప్పుడు చేతులు చాచి కాలివేళ్లను పట్టుకోవాలి. శ్వాస నెమ్మదిగా వదులుతూ ముందుకు వంగి చేతులను కాళ్ల పై నుండి తిప్పుతూ వెనుకకు రావాలి. అంతే తిరగలి తిప్పలా తిప్పాలి. ఇది ఒక ప్రక్రియ. ఇలా సవ్యదిశలో 20సార్లు, అపసవ్య దిశలో 20సార్లు చేయాలి.

ఉరయోగాలు..

- ఆకలి పెరుగుతుంది.
- జీర్ణక్రియ మెరుగవుతుంది.
- అంతర్గత అవయవాలు ఉత్తేజం అవుతాయి.
- పొట్ట తగ్గుతుంది

జాగ్రత్తలు..

-నడుము నొప్పి, హెర్నియా సమస్యలు ఉన్నవారు ఎక్కువగా ముందుకు వంగరాదు. అల్సర్, గుండె సమస్యలు ఉన్నవారు ఈ ఆసనం వేయరాదు.



ఆరోగ్యానికి యోగ



శ్రీచందన
డిజి ఫిట్‌నెస్ హబ్
9666665458

నవతెలంగాణ

గిన్నిస్‌లోకి పోలవరం

- రికార్డు స్థాయిలో స్పిల్ ఛానల్ కాంక్రీటు పనులకు శ్రీకారం
- 24 గంటల్లో 32 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్
- నేడు ముఖ్యమంత్రికి రికార్డుల పత్రాల అందజేత

పోలవరం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో సోమవారం చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ప్రపంచంలోనే అత్యధిక పరిమాణంలో కాంక్రీటు నింపిన నిర్మాణంగా గిన్నిస్ బుక్‌లో స్థానం పొందనుంది. న్యూఢిల్లీ నుంచి వచ్చిన గిన్నిస్ బుక్ రికార్డుల పరిశీలకుల సమక్షంలో పోలవరం ప్రాజెక్టు స్పిల్ ఛానల్‌లో కాంక్రీట్ పనులు ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యాయి. 24 గంటల పాటు నిర్విరామంగా సాగే ఈ పనులు సోమవారం ఉదయం 8 గంటలకు కొనసాగుతుంది. నవయుగ కంపెనీకి చెందిన నాలుగు వేల మంది కార్మికులు మూడు షిఫ్టులుగా షిఫ్టుకి తొమ్మిది వందల మంది చొప్పున కాంక్రీట్ పనుల్లో పాల్గొంటున్నారు. 76 మంది జలవనరుల శాఖ ఇంజినీర్ల పర్యవేక్షణలో ఈ పనులు సాగుతున్నాయి. స్పిల్‌ఛానల్‌లో 310 బ్లాకుల్లో బ్లాక్‌కు 100 క్యూబిక్ మీటర్ల చొప్పున కాంక్రీట్ పనులు సాగుతున్నాయి. ఈ కాంక్రీట్ పనుల్లో జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న అత్యాధునిక యంత్రాలు ఆరు టెలీ బెల్టులు, 80 సిమెంట్ మిక్సర్ యంత్రాలు, ఏడు క్రషర్లు, పది బ్లాచింగ్ ప్లాంట్ల నుండి కాంక్రీట్ వేగవంతంగా సరఫరా అవుతుంది.

అతిపెద్ద ప్రజాస్వామిక దేశంలో మూడోవంతు ఓటింగ్‌కు దూరం

- 2014లో ఓటు హక్కును వినియోగించనివారు 28 కోట్లమంది
- 20 (ఆర్థికంగా) బలమైన దేశాల ఓటర్లకన్నా ఇది అధికం

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్య దేశాల్లో అత్యధిక జనాభా, ఓటర్లు ఉన్నది భారత్‌లోనే. 2014 ఎన్నికల్లో దేశంలోని మొత్తం ఓటర్ల సంఖ్య 83 కోట్ల 40 లక్షలు. ఓటింగ్‌కు దూరంగా ఉన్నవారి సంఖ్య 27 కోట్ల 99 లక్షలు. అంటే మూడోవంతు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదని అర్థం. 2014 ఎన్నికల్లో బీజేపీకి పోలైన ఓట్లు 17 కోట్ల 17 లక్షలు. కాంగ్రెస్‌కు 10 కోట్ల 69 లక్షలు, ఆ తర్వాత 8 అతిపెద్ద పార్టీలకు పోలైంది 13 కోట్ల 3 లక్షలు. పోలింగ్‌కు దూరంగా ఉన్నవారి సంఖ్యే అధికారం చేపట్టిన బీజేపీకన్నా అధికంగా ఉండటం గమనార్హం.

ఇండియా తర్వాత అత్యధిక ఓటర్లున్నది అమెరికాలోనే. ఆ దేశంలో 2016లో రిజిస్టరైన ఓటర్ల సంఖ్య 18 కోట్ల 30 లక్షలు. ఆర్థికంగా బలంగా ఉన్న జర్మనీ,యూకే,స్పెయిన్,దక్షిణ కొరియాలాంటి 20 ప్రజాస్వామిక దేశాల మొత్తం ఓటర్ల సంఖ్య 28 కోట్ల 20 లక్షలు. ఇది మన దేశంలో గత ఎన్నికల్లో ఓటింగ్‌కు దూరంగా ఉన్నవారి సంఖ్యకు దాదాపు సమానం. అంటే..20 దేశాల ఓటర్లకు సమానమైన సంఖ్యలో మన దేశ పౌరులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారని అర్థం.

2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశంలోని కార్మిక శక్తి 48 కోట్ల 20 లక్షలు. 2016కల్లా వీరి సంఖ్య 50 కోట్ల వరకూ ఉన్నది. వీరిలో 20 శాతం వలస కార్మికులన్నది లెక్క. అంటే..దాదాపు 10 కోట్లమంది వలస కార్మికులు. 2011 లెక్కల ప్రకారం తాము పుట్టిన ప్రాంతాన్ని విడిచి దేశంలోని వేరే ప్రాంతాల్లో నివాసముంటున్నవారి సంఖ్య 45 కోట్ల 40 లక్షలు. వీరిలో 2 కోట్ల 10 లక్షలమంది వలస వెళ్లింది ఏడాది లోపు కాగా, 7 కోట్ల 20 లక్షలమంది వలస వెళ్లింది నాలుగేండ్లలోపు. వీరిలో చాలామంది తాము వలస వెళ్లిన ప్రాంతంలో ఓటు నమోదు చేసుకొని ఉండరు. దాంతో, ఇలాంటి వారంతా ఓటింగ్‌కు దూరంగా ఉండే అవకాశమున్నది. 2014 ఎన్నికల సమయంలో సైనిక విభాగాల్లో పని చేస్తున్నవారి సంఖ్య 12 లక్షలు. వీరితోపాటు ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని ఎన్నికల సంఘం కల్పిస్తున్నది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన దశలో వలస కార్మికులు, పౌరులకూ అలాంటి సౌకర్యం ఎందుకు కల్పించరని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి సదుపాయాల వల్ల ఓటింగ్ శాతాన్ని ఓమేరకైనా పెంచగలమని వారు సూచిస్తున్నారు. అయితే, పోలింగ్ కేంద్రానికి అందుబాటులోనే ఉండి ఓటింగ్‌లో పాల్గొనకపోవడమనేది పౌరుల ఇష్టానికి వదిలేయాల్సిందే.

శంకరన్ అకాడమీలో సీశాట్ ఉచిత శిక్షణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సీశాట్ ఉచిత శిక్షణా తరగతులు అందిస్తున్నారు. సివిల్ సర్వీసెస్, ఏపీపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ, గ్రూప్-1 సర్వీసులకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులూ ఈ శిక్షణా తరగతులకు అర్హులేనని ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె సతీష్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతులు హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఉన్న ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమీలో నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాలతో తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 9491064570 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పంచాయతీ ఎన్నికల ఫిర్యాదులకు ప్రత్యేక సెల్ : ఎస్ఈసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామ పంచాయతీ ఎన్నికల ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా "గ్రీవెన్స్ కంప్లెయింట్ సెల్" ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఆశోక్‌కుమార్ తెలిపారు.ఏసీ గార్డ్స్‌లోని ఎన్నికల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ ద్వారా ఎన్నికలకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సెల్ ఆఫీసు సమయంతో పాటు, రాత్రి 9 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు కూడా ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. ఫిర్యాదులను నేరుగా ఫిర్యాదు చేయవచ్చని వీలుకాని పక్షంలో 040- 29802895 అనే నంబర్‌కు కూడా ఫోన్ ద్వారా కూడా నమోదు చేసుకోవాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

వీడీసీ పెత్తందార్లను కఠినంగా శిక్షించాలి

కేవీపీఎస్ డిమాండ్

- పెత్తందార్ల దిష్టిబొమ్మ దహనం




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం మారంపల్లి గ్రామంలోని 80 మాల కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేసిన విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (వీడీసీ) పెత్తందార్లను కఠినంగా శిక్షించాలని, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వద్ద వీడీసీల దిష్టిబొమ్మను దహనం చేసి పెత్తందార్లను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. అనంతరం కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన పంచాయతీ పాలనను అపహాస్యం చేస్తూ అగ్రకుల పెత్తందార్లు ప్రశాంతంగా ఉన్న గ్రామాలపై పెత్తనం చేయడానికి వీడీసీల ముసుగు ధరించారని విమర్శించారు. నిజామాబాద్ జిల్లాలో ఇప్పటికే సుమారు 30 గ్రామాల్లో మాల, మాదిగలను సాంఘిక బహిష్కరణ చేశారని తెలిపారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాజ్యాంగేతర శక్తిగా పేదలపై దౌర్జన్యం చేస్తున్న వీడీసీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మారంపల్లిలో మాలల సాంఘిక బహిష్కరణను ప్రజలు, ప్రజాతంత్ర వాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం కృపాసాగర్, నందిపాటి మనోహర్, పాలడుగు నాగార్జున, అరూరి కుమార్, టీ సురేశ్‌కుమార్, కె విజయకుమార్, మహిపాల్, రాధాకృష్ణ, గోపి, నాగరాజు, శివ, అశోక్, బాలు, ఎల్లయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

నాలుగేండ్లుగా వెర్రితనం రాజ్యమేలుతోంది

ఆవును వధించారని మనుషుల్ని చంపేస్తున్నారు

మనల్ని చూసి లోకం నవ్వుతోంది : 'సుప్రీం' మాజీ న్యాయమూర్తి మార్కండేయ ఖట్జూ



ఫైల్

నాలుగేండ్లుగా దేశంలో వెర్రితనం రాజ్యమేలుతోందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మార్కండేయ ఖట్జూ వ్యాఖ్యానించారు. మనుషుల కంటే దేశంలో ఆవుకే ప్రాధాన్యత పెరుగుతోందని, ఆవును వధించాడని మనుషులనే చంపేస్తున్నారని తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆయన ఆవేదనను వ్యక్తం చేశారు. మూకదాడులు, గో హత్యలు దేశ పరువుతీస్తున్నాయని అన్నారు. గోవును వధిస్తే.. మనుషులను చంపుతున్నారని లోకం నవ్వుతోందని తెలిపారు. తాను శాస్త్రీయతను నమ్ముతారని చెబుతూ.. కుక్క, గుర్రంలాగే ఆవును కూడా ఒక జంతువుగానే చూస్తారని అన్నారు. పాలు ఇస్తుందని గోవును దేవతగా, మాతగా కొలుస్తారని చెబుతున్నారని.. అట్లా అయితే బర్రెలు, మేకలు కూడా పాలిస్తాయి కదా అని ప్రశ్నించారు.

కాగా, నోయిడాలో బహిరంగ నమాజ్ బహిష్కరణపై స్పందిస్తూ.. ఏ మతం వారైనా ఇతరులకు హానీ కలగకుండా తమ మత కార్యకలాపాలను ఆచరించేందుకు రాజ్యాంగం అనుమతిస్తుందని చెప్పారు. మరి ఆర్ఎస్ఎస్ శాఖలు ఎక్కడ పడితే అక్కడ ఉంటున్నాయి కదా అని ప్రశ్నించారు. వారికి ఏ అనుమతి అక్కర్లేదు కానీ నమాజ్ చేయడానికి తీసుకోవాలా? అని అన్నారు. ఇందుకు విరుద్ధంగా ముస్లింలే డిమాండ్ చేస్తే.. ప్రభుత్వం ఎలా స్పందించేదని అడగ్గా.. సర్కారు గురించి మాట్లాడటం దండగా అనే తరహాలో సమాధానమిచ్చారు. నేతలంతా పిచ్చి కూతలు కూస్తున్నారని అన్నారు. నాయకులంతా డబ్బు గురించే పరితపిస్తున్నారని, ఎవ్వరికీ ప్రజలపై ప్రేమ లేదని చెప్పారు. మూకదాడుల గురించి మాట్లాడుతూ.. 'బీజేపీపై విమర్శలు సంధించారు. బీజేపీ ఓటు బ్యాంకు అగ్రవర్ణాలే. వారి మొత్తం ఓట్లు ఇంచుమించు 20శాతం ఉంటుంది. ప్రభుత్వం ఏర్పడాలంటే ఈ ఓట్లు సరిపోవు. కనీసం 30శాతం దాటాల్సిందే. అందుకే ఇతర వర్గాల ఓట్లూ రాబట్టడానికి ఈ మతకలహాలకు తెరలేపుతున్నది. ఇందులో ముస్లిం యువకులు బాధితులవుతున్నారు'ని అన్నారు. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల్లో హింస చెలరేగే అవకాశమున్నదని హెచ్చరించారు.

రాజేశ్వరరెడ్డి లేదా ప్రశాంత్‌రెడ్డి...?

ఇద్దరిలో ఒకరికి బెర్తు ఖాయం

- పాలమూరు నుంచి నిరంజన్‌రెడ్డికి పక్కా
- ప్రస్తుతానికి రంగారెడ్డి, ఖమ్మం ఖాళీ
- మంత్రివర్గ కూర్పుపై అధికార పార్టీలో చర్చ
- 18న ప్రమాణ స్వీకారం




ఫైల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి లేదా బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి (మిషన్ భగీరథ వైఎస్ చైర్మెన్).. వీరిద్దరిలో ఎవరికో ఒకరికి కేసీఆర్ మంత్రివర్గంలో బెర్తు ఖాయమంటున్నాయి అధికార పార్టీ వర్గాలు. ఇద్దరూ సీఎం అత్యంత సన్నిహితులు, పార్టీ వ్యవహారాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు కాబట్టి వీరికి తొలిదఫాలోనే ఛాన్స్ దక్కే అవకాశాలున్నాయని తెలుస్తున్నది. శాసనసభ సమావేశాలు, ప్రొటెం స్పీకర్, స్పీకర్ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ ఖరారు కావటంతో ఇప్పుడు అందరి దృష్టి మంత్రివర్గ కూర్పుపై పడింది. ఈనెల 18వ తేదీన్నే నూతన మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి అవకాశముందని టీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో తొలి దఫా మంత్రివర్గానికి సంబంధించి పలువురి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన వీరికి అవకాశం కల్పించనున్నట్టు సమాచారం. ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు హోం మంత్రి మహమూద్ అలీ కూడా ప్రమాణం చేసిన నేపథ్యంలో.. తొలి దఫాలో మరో నలుగురు లేదా ఐదుగురితో ప్రమాణం చేయించనున్నట్టు తెలుస్తున్నది. పల్లా రాజేశ్వరరెడ్డి లేదా వేముల ప్రశాంతరెడ్డిపోను మిగతా వారిలో కొప్పుల ఈశ్వర్ (కరీంనగర్), గంప గోవర్థన్ (నిజామాబాద్), తలసాని శ్రీనివాసయాదవ్ (హైదరాబాద్), నిరంజన్‌రెడ్డి (మహబూబ్‌నగర్), గుత్తా సుఖేందర్‌రెడ్డి (నల్లగొండ) పేర్లు ప్రముఖంగా వినబడుతున్నాయి. ప్రస్తుతానికి రంగారెడ్డి, ఖమ్మం జిల్లాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం దక్కే అవకాశం లేదని సమాచారం. ఆయా జిల్లాలకు రెండో దఫాలో ప్రాతినిధ్యం కల్పించాలని సీఎం భావిస్తున్నట్టు సమాచారం. అయితే ఖమ్మం జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య.. టీఆర్ఎస్‌లో చేరతారనే గుసగుసలు వినబడుతున్నాయి. ఇందుకు సంబంధించి పత్రికల్లో వచ్చిన వార్తలను ఆయన ఖండించకపోవటం గమనార్హం. ఇదే సమయంలో తనకు తొలిదఫా క్యాబినెట్‌లోనే బెర్తు ఖరారు చేయాలని.. అలా అయితేనే తాను టీఆర్ఎస్‌లో చేరతానంటూ ఆయన ఖరాఖండిగా తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలని అధికార పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

నిత్య అధ్యయనంతో మంచి స్కాలర్స్‌గా ఎదగాలి

- ప్రొఫెసర్ కంచ ఐలయ్య



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కంచ ఐలయ్య

నవతెలంగాణ - ఉస్మానియా యూనివర్సిటీ

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు నిత్య అధ్యయనం, పఠనంతో మంచి రీసర్చ్ స్కాలర్స్‌గా ఎదగాలని ప్రొఫెసర్ కంచ ఐలయ్య సూచిం చారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల న్యూ సెమినార్ హాల్‌లో ఆదివారం దళిత మైనార్టీ స్టూడెంట్ అసోసియేషన్(డీఎంఎస్ఏ) ఆధ్వర్యంలో ది హిందూ న్యూస్ కరస్పాండెంట్ నిఖిల హేన్రీ రాసిన 'ది పార్మెంట్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ చిన్న వయసులోనే హేన్రీ దేశం మొత్తం పలు విద్యార్థి ఉద్యమాలపై ఎంతో లోతైన విశ్లేషణతో పుస్తకం రాయడం స్వాగతించాల్సిన అంశమని కొనియాడారు. ఆంగ్లభాషలో రాణించాల్సిన అవసరాన్ని వివరించారు. చెప్పు, డప్పు, కుండతో పాటు మన తల్లిదండ్రులపై పుస్తకాలు రాయాల్సిన అవసరం ఉందని వివరించారు. చదువుల్లో రాణిస్తూ, సమస్యలపై ఉద్యమిస్తూ... జీవితంలో స్థిరపడాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం డీఎంఎస్ఏ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆచార్యులు భుక్యా బంగ్యా, రాజునాయక్, లక్ష్మీనారాయణ, డాక్టర్ రామయ్య, డాక్టర్ జి.శ్రీనివాస్, జి.వెంకట్, ఎన్.శరత్, నిఖిలహేన్రీలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జె.దర్శన్, రంజిత్, స్వరాజ్, మహిపాల్, రాజు, అఫ్రోజ్, మహేందర్‌లు పాల్గొన్నారు.

రుజువు చేస్తారా..రాజీనామా చేస్తారా..?


- హెచ్ఏఎల్ ఆర్డర్లపై రక్షణమంత్రికి రాహుల్ సవాల్



న్యూఢిల్లీ : పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ఇటీవల లోక్‌సభలో రాఫెల్ యుద్ధ విమానాలపై వాడివేడిగా చర్చ సాగింది. హిందూస్థాన్ ఏరోనాటికల్స్ లిమిటెడ్‌కు లక్ష కోట్ల రూపాయల కొనుగోలు ఆర్డర్లను ఇచ్చినట్టు శుక్రవారం లోక్‌సభలో రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఇచ్చామని చెప్పుకుంటున్న కొనుగోలు ఉత్తర్వులను రక్షణ శాఖ మంత్రి పార్లమెంట్‌లో బహిర్గతం చేయాలని లేని పక్షంలో రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ వ్యాఖ్యా నించారు. 'ఒక అబద్ధం చెబితే, దాన్ని కప్పిపుచ్చడానికి మరిన్ని అబద్ధాలు చెప్పాల్సి ఉంటుంది. రాఫెల్ కుంభకోణం నుండి మోడీని రక్షించడానికి, రక్షణ శాఖ మంత్రి పార్లమెంట్‌లో అవాస్తవాలను వల్లేవేశారు. హాల్‌కు ఇచ్చిన లక్ష కోట్ల రూపాయల కొనుగోలు ఉత్తర్వుల పత్రాలను సోమవారం పార్లమెంట్‌లో బహిర్గతం చేయాలి లేదా ఆ పదవికి రాజీనామా చేయండి' అని నిర్మలాసీతారామన్ ఉద్దేశించి రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు. హాల్‌ను నిర్వీర్యం చేసి..అనిల్ అంబానీకి కంపెనీకి మేలు కలిగేవిధంగా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ మండిపడుతోంది.

లోకేశ్ కోసమే బాబు ఆరాటం

- వీడియో కాన్ఫరెన్స్‌లో మోడీ



అమరావతి : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరాట మంతా ప్రజల కోసం కాదని, తన కుమారుడు లోకేష్ కోసమేనని ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం విమర్శిం చారు. పదవులు ఇచ్చే నాయకుడిలా కుమారుణ్ణి ప్రమోట్ చేసే పనిలో బాబు ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని పార్లమెంట్ నియోజకవర్గాల బూత్ కమిటీలతో మోడీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ, రాష్ట్రాభివృద్ధిని సీఎం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి అంటే పేదలకు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేయడమేనన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు, కాకినాడలో బిజెపి మహిళా కార్యకర్తపై సీఎం దురుసు ప్రవర్తనను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీకి, చంద్రబాబుకు బీజేపీ భయం పట్టుకుందన మోడీ వ్యాఖ్యానించారు. టీడీపీ ప్రభుత్వాన్ని ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో కుల రాజకీయాలు, అవినీతిని అంతమొందించాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కేంద్రం నుంచి నిధులు నేరుగా జిల్లాలకే వస్తున్నాయన్నారు. ఏపీ ప్రభుత్వ తీరు అర్థం కావడం లేదన్నారు.. వెనుకబడిన జిల్లాలకు కేంద్రం నుంచి అధిక నిధులు ఇచ్చామని, ఎప్పుడైనా నిధుల ఎక్కడ వాడారని ప్రశ్నించామా? కొన్ని ఖర్చు చేసిన అనంతరం బిల్లులు పంపినా వాటికి నిధులు చెల్లిస్తున్నామని మోడీ చెప్పారు.

వ్యవసాయానికి పెద్దపీట

అగ్రి డాక్టర్స్ డైరీ ఆవిష్కరణలో ఎంపీ కవిత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం వ్యవసా యానికి పెద్దపీట వేస్తున్నదని నిజామాబాద్ పార్లమెంటు సభ్యురా లు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ (టీఎడిఎ) 2019 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సేవ చేసే అవకాశం వచ్చినందుకు వ్యవసాయ అధికారులు అదృష్టంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోయేషన్ వ్యవస్థాపకు కె. రాములు, రాష్ట్ర అధ్యక్షులు కె. రాజారత్నం, సహాధ్యక్షురాలు నిర్మల, ప్రధాన కార్యదర్శి తిరుపతినాయక్, కోశాధికారి మధన్‌మోహన్, కృష్ణవేణి, మహిత తదితరులున్నారు.

గిరిజనుల హక్కులను పరిరక్షిస్తాం

- కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జుహల్ ఓరమ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజనుల హక్కులను పరిరక్షిస్తామని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జుహల్ ఓరమ్ భరోసానిచ్చారు. హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో పెసాచట్టం-అమలుతీరుపై శని, ఆదివారాల్లో రెండు రోజుల వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఓరమ్ మాట్లాడుతూ.. షెడ్యూల్డ్ ఏరియాల్లో పంచాయతీలు స్థానిక పరిపాలన సంస్థల నిర్వహణకు మరిన్ని అధికారాలను కల్పించాలని, రాష్ట్రాలు మరింత ప్రభావవంతంగా అమలు చేయాలని ఆయన సూచించారు. పెసా చట్టం అమలు కోసం అటవీ, గిరిజన వ్యవహారాల, పంచాయితీ రాజ్ మంత్రిత్వశాఖ మంత్రిత్వశాఖలు కలిసి పనిచేయడం అభినందనీయమన్నారు. గిరిజనుల అభివృద్ధి పట్ల మోడీ నిబద్ధతతో పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఆర్‌డిఆర్ఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డబ్ల్యూ. ఆర్. రెడ్డి, అదనపు కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాసులు, విష్ణుత్, అధ్యక్షులు అబ్బాకా మాట్లాడారు.

ఏయూ వీసీ వ్యాఖ్యలపై సైన్సు సొసైటీ ఆగ్రహం

జలంధర్ : పురాణాలను, సైన్సును కలిపి చూడటం తప్పని బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ తెలిపింది. పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన సైన్స్ కాంగ్రెస్‌లో "కౌరవులు టెస్ట్ ట్యూబ్ బేబీలు" అని చేసిన వ్యాఖ్యలను ఖండించింది. సైన్సును, శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారానికి బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ కృషి చేస్తోంది. ప్రాచీన భారత దేశం గురించి యువతరం ఎదుట అటువంటి అశాస్త్రీయ వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొంది. ఇటువంటి వ్యాఖ్యలు మహోన్నత వ్యక్తులు అందించిన నిజమైన సేవలకు కళంకం తీసుకురావడమేనని సైన్స్ సొసైటీ ఒక ప్రకటనలో పేర్కొంది. "పురాణాలలోని శ్లోకాలు, గాథలు కవితాత్మకమైనవి. ఆనందాన్నిచ్చేవి. నీతికి సంబంధించిన అంశాలు అందులో ఉంటాయి. ఊహించుకోవడానికి ఎంతో ఉన్నతంగా ఉంటాయి. కాని శాస్త్రీయంగా రూపొందిన విలువైన సిద్ధాంతాలు మాత్రం కాదు. యువతకు ప్రాచీన భారత దేశం గురించి గందరగోళపరిచే అంశాలను తెలియచేయడం తప్పు" అని సైన్స్‌సొసైటీ తెలిపింది. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ఒక భాగంగా నిర్వహించిన చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశంలో కౌరవులు టెస్ట్ ట్యూబ్ బేబీలు అని ఆంధ్ర యూనివర్శిటీ వీసీ నాగేశ్వరరావు వ్యాఖ్యానించడం బాధాకరమని తెలిపింది.

వ్యవసాయ శాఖ అధికారుల పనితీరు దేశానికే ఆదర్శం


మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వ్యవసాయ శాఖ అధికారుల పనితీరు దేశానికే ఆదర్శమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం వ్యవసాయ అధికారుల డైరీని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుబీమా పథకం రైతుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను దేశవ్యాప్తంగా అమలవుతున్నాయని చెప్పారు. ఇది మనకు గర్వకారణమన్నారు. రైతు ఆత్మహత్యలు తగ్గాయని, మండలానికో గోదాములు కట్టించి ఎరువులు, విత్తనాల కొరత తీర్చామని మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. రైతులు చనిపోతే వారి కుటుంబ సభ్యుల ఖాతాలో మూడు రోజుల్లోనే రూ. 5లక్షలు జమ అవుతున్నాయని చెప్పారు. రైతులు ధనవంతులుగా మారే రోజులు వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మెన్ బి. కృపాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి. శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ సమావేశం రసాభాస

- ద్రోహులపై తప్పనిసరిగా చర్యలుంటాయి : తుమ్మల



నవతెలంగాణ-అశ్వారావుపేట

భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం వినాయకపురంలో ఆది వారం జరిగిన టీఆర్ఎస్ అశ్వారావుపేట నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం రసా భాసగా మారింది. తొలుత పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ రావు మాట్లాడుతూ ఇటీవల జరి గిన ఎన్నికల్లో పార్టీకి ద్రోహం చేసిన వారికి భవిష్యత్‌లో ఎలాంటి పదవులూ రావ ని చెబుతుండగా.. చంద్రుగొండకు చెందిన ఓ కార్యకర్త లేచి ఖమ్మం జిల్లాలో పార్టీ ఓటమికి కారణమైన వారిని ముందు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశాడు. దీంతో అశ్వారావుపేటకు చెందిన ఎంపీ వర్గం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రతిగా నినాదాలు చేశారు. దీంతో సభ రసాభాసగా మారింది. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు సర్దిచెప్పడంతో గొడవ సర్దుమణిగింది. అనంతరం మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రమంతా ఒక తీర్పు వస్తే... ఖమ్మం జిల్లాలో మరో తీర్పు వచ్చిందనీ, పార్టీ ఓటమి తనను తీవ్రంగా బాధించిం దనీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా కూటమి బలంగా పనిచేయడం, టీఆం ్ఎస్‌లోనే ఉంటూ కొంతమంది వ్యతిరేకంగా పనిచేయడం వల్ల ఖమ్మం జిల్లాలో భిన్నమైన తీర్పు వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ఎవరెవరు పార్టీకి ద్రోహం చేశారో ఆ నివేదికలన్నీ సీఎం వద్ద ఉన్నాయన్నారు. తప్పకుండా చర్యలు తీసుకుం టారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఇంచార్జి నూకల నరేష్‌రెడ్డి, ఐదు మండ లాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నా పేరుతో ఉన్న సంఘాలకు ఎలాంటి గుర్తింపూ లేదు..

కేటీఆర్ స్పష్టీకరణ

- యువసేనలు, అభిమాన సంఘాలను అంగీకరించబోమని వెల్లడి




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తన పేరు మీద ఏర్పాటుచేసిన సంఘాలకు ఎలాంటి గుర్తింపూ లేదని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. యువసేనలు, అభిమాన సంఘాలను అంగీకరించబోమని ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తన పైన అభిమానం ఉంటే టీఆర్ఎస్ పార్టీ లేదా దాని అనుబంధ సంఘాలతో కలిసి పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. తన పేరు మీద ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న పలు సంఘాలను వెంటనే రద్దు చేసుకోవాలంటూ కోరారు. కేటీఆర్ యువసేన, కేటీఆర్ సేవాదళ్, కేటీఆర్ అభిమాన సంఘం వంటి పేర్లతో పలువురు సంఘాలను ఏర్పాటు చేసిన విషయం తన దష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వాటిని తాను ఎంతమాత్రమూ ఆమోదించబోనని తెలిపారు. తన పైనా, పార్టీ పైనా అభిమానంతో ఏర్పాటు చేసే సంఘాలకు సైతం ఆమోదం లేదని అన్నారు. దీంతోపాటు ఫేస్ బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లోనూ కేటిఆర్ యువసేన, కేటియార్ అభిమాన సంఘం వంటి వివిధ పేర్లతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారు సైతం వాటిని వెంటనే ఆపేయాలని కోరారు.

హార్వర్డ్ వార్షిక సదస్సుకు కేటీఆర్

హార్వర్డ్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే 'హార్వర్డ్ ఇండియా వార్షిక సదస్సు'కి హాజరుకావాలంటూ కేటీఆర్‌ను సదరు వర్సిటీ ఆహ్వానించింది. ఫిబ్రవరి 16, 17 తేదీల్లో అమెరికాలోని మసాచుసెట్స్ లో జరగనున్న ఈ సమావేశంలో వివిధ దేశాలకు చెందిన ప్రముఖ వ్యక్తులు హాజరుకానున్నారు. సమకాలీన భారత దేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లు, అభివద్ధికి సంబంధించిన వివిధ అంశాలపైన రెండు రోజులపాటు ఈ సమావేశంలో చర్చించనున్నారు. సుమారు వెయ్యి మంది విద్యావేత్తలు, విద్యార్థులు, యువ వత్తి నిపుణులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు.

తెలంగాణ అండా-ఉద్యమాల 'కొండా'



భూపతి వెంకటేశ్వర్లు

కొండా లక్ష్మణ్ బాపూజీ తన ఆస్తిపాస్తులను స్వాతంత్ర్య ఉద్యమం కోసం వదులుకున్నాడు. నిజాం పాలనపై పోరాటం, భారత స్వాతంత్ర్య ఉద్యమం ఇలా ఆయన పోరాటాలు 5 రకాలుగా విడదీయవచ్చు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంటూనే తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన సమస్యలపైన దృష్టి సారించారు. ఆ సమయంలో దక్కన్ ప్రాంతంలో ప్రజలు పడుతున్న బాధలను చూసి చలించిపోయాడు. బాధల నుండి విముక్తి దొరకాలంటే పోరాటాలు తప్ప మరో మార్గం లేదనుకున్నాడు. పోరాటాల్లో ఉన్నా, చట్ట సభల్లో ఉన్నా అనుక్షణం ప్రజలవైపే నిలబడ్డారు. నమ్ముకున్న బాటను వీడలేదు. అందుకే బాపూజీగా మూడు తరాల వారికి వారధిగా నిలబడ్డాడు.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వెనుకబడిన (చేనేత) ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో అమ్మమ్మ గారింట 1915 సెప్టెంబర్ 27న కొండా పోశెట్టి, అమ్మక్క దంపతులకు ఐదవ సంతానం. తండ్రి పోశెట్టి పోస్ట్‌మ్యాన్‌గా పని చేసేవాడు. కొండా లక్ష్మణ్ రెండున్నరేండ్లప్పుడే తల్లి మరణించింది. కనీస సౌకర్యాలు లేని గిరిజన ప్రాంతంలో జన్మించిన లక్ష్మణ్ 25వ ఏట 3వ దర్జా వకీలు పరీక్ష పాసై న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. మరోవైపు యువకులను వెంటేసుకొని మూఢనమ్మకాలు, కులాచారాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ, వివక్ష, అణిచివేత, దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాలు చేశాడు. దేశభక్తి, జాతీయ భావాలు పెంపొందించేందుకు పేద, మధ్య తరగతి యువతను సంఘటితం చేశాడు. గాంధీజీని కలవాలని అనుకున్నాడు. చాందకు గాంధీజీ వస్తున్నారని సమాచారం అందింది. గాంధీజీని కలువరాదని నిజాం ప్రభుత్వం, పాఠశాల అధికారుల ఆదేశాలున్నా, వాటిని ధిక్కరించి కొండా లక్ష్మణ్ ఆయన స్నేహితులు చాందాకు వెళ్లి గాంధీజీని కలిశారు. వారి మాటలు విన్న తర్వాత వీరిలో కొత్త చైతన్యం వెల్లి విరిసింది. గాంధీ మార్గదర్శకాలు అమలు పరుచాలని 1933 నుండి పాత తెల్ల ప్యాంట్ కత్తిరించి స్వహస్తాలతో గాంధీ టోపీ కుట్టుకొని ధరించడం మొదలుపెట్టారు. తెల్లటోపీ ధరించడాన్ని నిజాం ప్రభుత్వం వ్యతిరేకించింది. టోపీ ధరించడం అంటే నిజాం ప్రభుత్వాన్ని వ్యతిరేకించడమే అని బెదిరించారు. బయపడకుండా మొదలుపెట్టిన తెల్ల టోపీ ధరించడాన్ని తన జీవితాంతం కొనసాగించాడు.





1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నిర్వహించిన సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు నిర్వహించిన వందేమాతరం ఉద్యమం, హైదరాబాద్ రాజ్య స్వాతంత్ర్య సంగ్రామంలో చదువులు పక్కనబెట్టి, పాఠశాలలు బహిష్కరించి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వందేమాతరం ఆలాపనను నిషేధించడాన్ని నిరసించాడు. ఆ ఉద్యమంలో పాల్గొని జైలుపాలయ్యారు. జైల్లో ఖైదీలందరితో వందేమాతరం గీతాలాపన చేయించారు. ఇది అపూర్వ ఐక్యమత్యానికి దారి తీసింది. రాజకీయ ఖైదీలకు సరైన సదుపాయాలు కల్పించాలని జైలు అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారు. మరోవైపు నిజాం అరాచకపాలనలో మతతత్వం, పెత్తందారితనం ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. నిషేధం ఉన్నప్పటికీ నిజాం ఆరాచక పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభమైంది. పౌర, రాజకీయ హక్కుల సాధన కోసం ప్రజలు ఉద్యమిస్తున్నారు. కొండ లక్ష్మణ్‌కు ఆంధ్ర మహాసభలతో అనుబంధం 1942 నుండి ఏర్పడింది. ఉద్యమకారులకు, పేద ప్రజలకు ఉచితంగా వాధించే వకిల్ పని చేస్తూనే కాంగ్రెస్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చాడు.

1943లో చేనేత సంక్షేమ సంఘం ఏర్పాటుకు కృషి చేశాడు. ఆ సంఘానికి కొండా లక్ష్మణ్ అధ్యక్షుడిగా, బద్దం ఎల్లారెడ్డి ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 1948న రహస్య ఉద్యమ కాలంలో మద్రాసులో డాక్టర్ శకుంతలాదేవితో వివాహం జరిగింది. ఒకపక్క జాతి స్వాతంత్ర్యానికి సమరం చేస్తూ మరోపక్క చేతివృత్తిదారుల కోసం ఉద్యమించసాగారు. వారిలో ఆత్మస్థైర్యాన్ని సంఘటిత శక్తి చైతన్యాన్ని పెంపొందించడానికి హైదరాబాద్ స్టేట్‌లో సహకార ఉద్యమాన్ని చేపట్టి గ్రామగ్రామాన సహకార సంఘాలను నెలకొల్పారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో సహకార ఉద్యమాన్ని బలోపేతం చేశారు. గ్రామీణ కుటీర పరిశ్రమల కోసం కార్మికుల సంక్షేమానికి కూడా కృషి చేశారు. 1950లో వెనుకబడిన తరగతుల సంఘాన్ని స్థాపించి బలహీనవర్గాల హక్కుల కోసం పోరాడారు. కాకా కాలేల్కర్ కమిషన్ రాష్ట్ర పర్యటన సందర్భంలో వెనుకబడిన తరగతుల స్థితిగతులను మెరుగుపరచడానికి ప్రణాళిక సమర్పించారు. అనంతరామన్ కమిషన్ మురళీధర్ కమిషన్ బీసీల కోసం చేసిన సిఫార్సుల అమలు కోసం గణనీయమైన కృషి చేశారు. ప్రదేశ్ కమిటీపై ప్రభుత్వం విధించిన నిర్బంధం తొలగించిన తర్వాత 1945లో లక్ష్మణ్ కాంగ్రెస్‌లో చేరారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1952లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికల్లో గెలుపొందారు. 23 ఏండ్లు క్రియాశీల శాసనసభ్యునిగా కొనసాగి, ప్రజా హక్కుల పరిరక్షణకు బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి నిరంతరం కృషి సల్పారు. తొలుత 1957-60 కాలంలో నీలం సంజీవరెడ్డి హయాంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఆ తర్వాత 1960-62 కాలంలో డి.సంజీవయ్య హయాంలో ఎక్సైజ్, లఘు పరిశ్రమలు, టెక్స్‌టైల్స్, హ్యాండ్లూమ్ శాఖ మంత్రిగా పని చేశారు. కాసు బ్రహ్మానందరెడ్డి హయాంలో కార్మిక, పౌర సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎంపిక సమస్య వచ్చినప్పుడు దామోదరం సంజీవయ్య అభ్యర్థిగా నిర్ణయించడం బాపూజీ స్వగృహం జల దృశ్యంలో జరిగింది. కేవలం వెనుకబడిన తరగతి అన్న కారణంగానే తిరస్కరించారని బాపూజీ అనుచరులు చెబుతుంటారు. దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్య వేదిక 1992లో ఏర్పాటు చేసి ఆహ్వానసంఘం అధ్యక్షుడిగా పని చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించారు.

తన ఆస్తులను జీవితాన్ని జనం కోసం ధారపోసిన కొండా లక్ష్మణ్‌ను మన ప్రభుత్వాలు నిలువునా మోసం చేశాయి. తన సొంత డబ్బుతో కొనుకున్న ఇల్లు భూమిని చంద్రబాబు ప్రభుత్వం ధ్వంసం చేసింది. కానీ కోర్టు అండగా బాపూజీకి న్యాయం చేసింది. ఆయన ఆస్తుల్లో జలదృశ్యం ఒకటి. హుసేన్‌సాగర్ ఒడ్డున ఆయన నిర్మించుకున్న జలదృశ్యం తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువైంది. టీఆర్ఎస్ పుట్టింది కూడా అక్కడే అంటారు. ఆయన చివరి వరకు జనం కోసం బతికారు. సామాజిక న్యాయం కోసం ఉద్యమాలు చేయడంతో సహకార రత్న బిరుదుతో గౌరవించబడ్డారు. స్వాతంత్ర్య సమరయోధుల స్క్రీనింగ్ కమిటీకి ఛైర్మన్‌గా ఉన్నారు. పద్మశాలీ విద్యార్థుల కోసం హైదరాబాద్‌లో హాస్టల్ అవసరమని, సంఘ భవనం, చేనేత సహకార భవనం పద్మశాలీ సంఘం నిర్మాణంలో తన పాత్ర కీలకం. చేనేత కార్మికులకు సబ్సిడీపై నూలు ఇవ్వడానికి హైకో, ఆప్కో నిర్మాణం చేయడంలో చేనేత బట్టలకు ఆ మాత్రం రిబేటు ఇవ్వడానికి కృషి చేశారు. దళిత, బహుజనులు రాజకీయ అధికారంలోకి రావాలని అనేక కుల సంఘాలను కలుపుకొని బస్సుయాత్ర చేశారు.

97ఏండ్లు జీవించిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఒక చక్కని చిత్రకారుడు కూడా. మనిషి పుట్టుక నుండి మరణించేదాకా వివిధ దశలను తన కుంచెతో చిత్రించిన తాత్విక దృష్టి వారిది. ఆరోగ్యం విషయంలో ఆయన జీవితం ఓ ఉదాహరణ. ఉదయం యోగాసనాలు, ధ్యానం చేయడం, మిత ఆహారం ప్రతి పనిని క్రమశిక్షణగా చేయడం ప్రతిదీ ఫైల్ చేసి రికార్డుగా భద్రపరచడం ఆయన అలవాటు. అన్ని దిన పత్రికలు తెప్పించి గ్రంథాలయం నడిపేవారు. జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రీ, సర్వేపల్లి రాధాకృష్ణన్, ఇందిరాగాంధీ, కామరాజ్ నాడార్ నుండి మన్మోహన్‌సింగ్‌తో మొదలుకొని జాతీయ నాయకులందరితో అలవోకగా మాట్లాడేవారు. బడుగు బలహీన నాయకత్వాన్ని ఉత్సాహపరిచేవారు. స్ఫూర్తినిచ్చేవారు. వ్యక్తిత్వం, సౌశీల్యం, సంకల్ప బలం, త్యాగశీలత ఆదర్శనీయం. అట్టడుగు వర్గాల నుండి స్వయం కృషితో ఎదిగిన జాతీయ నాయకుడు, ప్రజల మనిషి స్వాతంత్ర్య సమర యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ. సామాజిక మార్పు కోసం చివరి వరకు బతికారు.

సెల్ : 9490098343

బీసీ జనాభా అంచనాలు పంచాయతీ రిజర్వేషన్లు



దుర్గం రవిందర్

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో బీసీల జనాభా దాదాపు 53 శాతంగా ఉందని సర్కారు అంచనాకు వచ్చినట్టు వార్తలు వచ్చాయి. రాష్ట్రంలో మొత్తం 2.02 కోట్ల గ్రామీణ జనాభాలో 38.58 లక్షల ఎస్సీలు, 28.11 లక్షలు ఎస్టీలు ఉన్నారనీ, ఇతరులు 1.36 కోట్లు ఉన్నారని అధికారులు తేల్చారు. ఈ ప్రకారమే రిజర్వేషన్లు ఖరారు చేశారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల ముందు జారీ చేసిన ఓటర్ల జాబితా ఆధారంగా 12,751 పంచాయతీల్లో చేసిన జనగణనలో బీసీ జనాభాను అంచనా వేశారు. దాదాపు 20 లక్షల ఓట్లు గల్లంతయ్యాయన్న ఆరోపణను ఏ మాత్రం పట్టించుకోకుండా ఆ ఓటర్ లిస్ట్ ఆధారంగా బీసీ జనాభాను తూతూ మంత్రంగా అంచనా వేశారు. 'అసలు అంచనా వేయడం ఏమిటి, శాస్త్రబద్ధంగా బీసీ జనాభాను ఎందుకు లెక్కించరు' అన్న ప్రశ్నను పట్టించుకోవడం లేదు.

రాష్ట్రంలోని 30 గ్రామీణ జిల్లాలకు గాను 10 జిల్లాల్లో బీసీలు 50 శాతానికిపైగా ఉన్నారనీ, అత్యధికంగా యాదాద్రి-భువనగిరి జిల్లాలో, అత్యల్పంగా భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో ఉన్నారనీ అధికారులు తేల్చారు. ఈ అంచనాల ఆధారంగా రాష్ట్రంలో బీసీలకు 2,345 గ్రామ పంచాయతీలను కేటాయించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు జిల్లాలు, మండలాల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం దాటరాదన్న నిబంధనను పాటిస్తుండడంతో బీసీలకు కోటా, సీట్ల కేటాయింపుల్లో భిన్నమైన లెక్కలు, కథనాలు వినిపించాయి. అయితే ఇవన్నీ అశాస్త్రీయమైన అంచనాలే. జిల్లా కలెక్టర్ల విచక్షణ, అంతిమ నిర్ణయం మీద ఈ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. దీనిపై పలు కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండగా ప్రభుత్వం ఏకపక్షంగా రిజర్వేషన్లను ఖరారు చేయడం అన్యాయమే. ప్రతిసారి ఇలాగే జరగడం ఆనవాయితీగా మారింది. ఎన్నికల ముందు కొంత హడావుడి జరుగుతుంది, తర్వాత అందరు మరిచిపోతారు. చివరికి పాలక పార్టీ వారి అభీష్టం మేరకు రిజర్వేషన్లు ఫైనల్ అవుతున్నాయి. రాష్ట్రస్థాయిలో బీసీలకు 22.78 శాతం కోటా లభిస్తే.. కొన్ని జిల్లాల్లో ఈ సగటును మించి సీట్లు రాగా.. కొన్నిచోట్ల తక్కువ వచ్చాయి. ఆయా జిల్లాల్లోని సీట్లలో వంద శాతం ఎస్టీ పంచాయతీలు మినహాయించి మిగతా వాటిలో సగం స్థానాలను రిజర్వ్ చేయడంతో ఈ వైరుధ్యం కనిపిస్తోంది. అందుకే, 20.51 శాతం బీసీ జనాభా ఉన్న భద్రాద్రి- కొత్తగూడెం జిల్లాలో బీసీలకు కనీసం ఒక్కస్థానం కూడా దక్కలేదు. రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న నిబంధనే ఇందుకు కారణమని అధికార వర్గాలు అంటున్నాయి. మల్కాజిగిరి జిల్లాలో 12, వరంగల్ అర్బన్‌లో 19, మహబూబ్‌నగర్‌లో 170, నల్లగొండలో 165, సిద్దిపేటలో 143 స్థానాలు మాత్రమే బీసీలకు దక్కాయి.

మొక్కుబడి నిరసన కార్యక్రమాలతో బీసీ సంఘాల నాయకులు తమ ఉనికిని మాత్రం చాటుకుంటున్నారు. నిజానికి వారు ఉనికిని చాటుకోవడానికి మాత్రమే ఈ నిరసన కార్యక్రమాలు చేస్తున్నారా? అని అనిపిస్తున్నది. వారి నిరసనల వల్ల, కోర్టు కేసుల వల్ల ఏం ప్రభావం ఉండడం లేదు. చివరికి ప్రభుత్వం అనగా పాలక పార్టీ వారు అనుకున్నట్టే రిజర్వేషన్లు ఖాయం అవుతున్నాయి. ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ సారి ఇంతకన్నా భిన్నంగా ఏమీ జరిగే అవకాశం కనిపించడం లేదు.

సెల్ : 7093136640

బీజేపీని ఎదుర్కొనే ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అవసరం



శ్రీకాంత్ అంబీర్

మనది ప్రజాస్వామ్య దేశం. ప్రజా ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఏలికలు, ప్రజా అభిప్రాయాన్ని తెలుసుకుని, వారి ఎజెండాను తెలుసుకుని వారి సౌకర్యార్థం పనిచేయాలి. నేడు పాలకుల్లో ఏకపక్షధోరణి పెరుగుతోంది. ప్రజల శ్రేయస్సు కాదు, ప్రయోజన రాజకీయాలే పరమావధిగా రాజకీయం సాగుతోంది. ఇటువంటి సమయంలో ప్రత్యామ్నాయ శక్తులు ఏర్పడి, ఏకపక్ష ధోరణులకు అడ్డుకట్ట వేయాల్సిన ఆవశ్యకత ఉన్నది. ముఖ్యంగా బీజేపీ ఏకపక్ష నిర్ణయాలను ఎండగట్టాల్సిన అవసరం ఉంది.

ఏకపక్ష ధోరణిలో వ్యవహరించడం లేదని, తమది ప్రజాస్వామ్య పార్టీ అని బీజేపీ పెద్దలు చెబుతున్నారు. కాని నాలుగున్నరేండ్ల కాలంలో బీజేపీ ప్రజావ్యతిరేక, ఏకపక్ష నిర్ణయాలు తేటతెల్లంగా కనిపిస్తున్నాయి. మొదటిది, వివాదస్పదమైన రాఫెల్ డీల్. ప్రధాని తన క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ ఎఫైర్స్‌కు తెలియకుండా ఫ్రాన్స్‌కు వెళ్లి హాల్‌ను కాదని అనిల్ అంబానీని ఎందుకు రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో భాగస్వామిని చేశారు? ప్రస్తుతం ఈ విషయం 'సుప్రీం' విచారణలో ఉంది. ఒకవేళ ఇది(రాఫెల్ నిర్ణయాలు) ప్రజాస్వామ్య బద్ధమే అయినప్పుడు, బీజేపీ నాయకులు రాఫెల్ మీద జేపీసీ (జాయింట్ పార్లమెంటరీ కమిటీ) ఏర్పాటుకు ఎందుకు సంసిద్ధత వ్యక్తం చేయడం లేదు? వీటన్నిటిని సునిశితంగా గమనిస్తే 'రాఫెల్‌మే కుచ్ కాలా హై' అన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఇక బీజేపీ పాలసీ నిర్ణయాలు ఏకపక్షమే అనడానికి మరో పెద్ద ఉదాహరణ పెద్దనోట్ల రద్దు. పూర్వ ఆర్‌బీఐ గవర్నర్ రఘురామ్‌రాజన్ ఇందుకు అనుకూలంగా లేడని ఆయనను తొలగించి, తమ అనుయాయుడైన ఉర్జిత్‌పటేల్‌ను నియమించి నవంబర్8, 2016న పెద్దనోట్లను రద్దు చేశారు. అయితే సెప్టెంబర్ 2016లోనే మోడీ యూఎస్ఏఐడీ యూనైటెడ్ స్టేట్స్ ఏజెంట్ ఫర్ ఇంటర్‌నేషనల్ డెవలప్‌మెంట్‌తో, భారత ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, వారి అవసరాల మేరకే క్యాష్‌లెస్ ఎకానమీ కోసం ఆ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు ఈ పని చేశారని వార్తలొచ్చాయి. ఇది నిజం కాదా? జవాబివ్వాలి. పైగా అప్పటి అటర్నీ జనరల్ సుప్రీంలో భాజాప్తా చెప్పారు. ఏమని 'సుమారు రూ.3లక్షల కోట్ల నల్లధనం బ్యాంకింగ్ వ్యవస్థలోకి రావు, తద్వారా నల్లధనాన్ని అరికట్టొచ్చు' అన్నారు. పైగా దీని ద్వారా నక్సలైట్లు, ఉగ్రవాదుల ఆగడాలకు అడ్డుకట్ట వేయొచ్చని, సుస్పష్టంగా ప్రచారం చేశారు. కాని వాస్తవికంగా ఏం జరిగింది? ఆర్బీఐ నివేదిక ప్రకారం.. రూ.15.41 లక్షల కోట్ల పెద్దనోట్లు రద్దు కాగా, 15.31 లక్షలు బ్యాంకింగ్ వ్యవస్థలో చేరాయని, అంటే కేవలం రూ.10,720 కోట్లు మాత్రమే నల్లధనమని తేల్చారు. ఇందుకోసమేనా పెద్దనోట్ల రద్దు? కొండను తవ్వి ఎలుకను తీసినట్టు పదివేలకోట్లేనా నల్లధనం? దీంతో ప్రతి భారతీయుడీ అకౌంట్‌లో రూ.15లక్షలు వేస్తారా? అసంఘటితరంగ కుదుపునకు కారణం బీజేపీ ఏకపక్ష ధోరణి కాదా? ఇప్పటికైనా ఈ నిర్ణయం పట్ల విమర్శనాత్మకంగా పరిశీలించుకుంటామని చెప్పారా? క్యూలో నిలబడి చనిపోయిన 125 మంది సామాన్య ప్రాణుల బాధ్యత ఎవరిది? ఇగ జీఎస్టీ గురించి చెబుతూ ఒకే దేశం-ఒకే పన్ను- ఒకే ప్రజా- ఒకే పాలన అన్నారు. కాని ఇది మౌలికంగా సబబేనా? భారత రాజ్యాంగం అధికరణ 1(1) ప్రకారం 'ఇండియా అనగా భారత్ రాష్ట్రాల యూనియన్' అని చెప్పింది. అంటే భిన్న రాష్ట్రాలు, భిన్న భాషాలు ఉన్నాయనే కదా. కాని కేవలం ఒకటే విధానం ఉండాలనడం సరియేనా? హిందూత్వమే భారతీయ తత్వమా? కాదు భిన్నత్వంలో ఏకత్వం భారత వారసత్వం. చార్వాకం, లోకాయుతం, బౌద్ధం, ప్రాచీన సంస్కృతులు ఉన్నాయి. పైగా జీఎస్టీతో రాష్ట్రాల ఆదాయాలు తగ్గాయి. హక్కులు హరించబడ్డాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.3878 కోట్లు నష్టపోయాయి.

పెట్రోల్, డీజిల్ ధరలు అంబరాన్ని అంటుతున్నాయి. రూపాయి పతనమవుతోంది. వెరసి సామాన్యుడి నడ్డీ విరుగుతోంది. పెట్రోల్, డీజిల్ ధరలు ఎందుకు పెరుగుతున్నాయని అడిగితే బీజేపీ చేస్తున్న వాదనలు ఏమిటీ? అంతర్జాతీయ చమురుధరలు పెరుగుతున్నాయంటున్నారు? మోడీ అధికారంలోకొచ్చినప్పుడు బ్యారల్ చమురు ధర 107 డాలర్లు, నేడు 86 డాలర్లు. ఆయిల్ బాండ్లు చెల్లించామంటున్నారు. అందువల్ల పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయంటున్నారు. రూ.2లక్షల కోట్లు ఆయిల్ బాండ్లకు చెల్లించామని బీజేపీ అధికార ప్రతినిధులు టీవీ చానెల్ చర్చల్లో చెబుతున్నారు. ఇది పచ్చిఅబద్ధం. ఒకవేళ నిజమే అయితే ఆధారాలు చూపాలి. అబద్ధం అనడానికి ఆధారాలు ఉన్నాయి. 2014-15 బడ్జెట్ అనెక్స్చర్ 6-ఈలో ఆయిల్ బాండ్ల కమిట్‌మెంట్ రూ. 1,34,423కోట్లు, మొన్నటి బడ్జెట్ 2018-19 బడ్జెట్‌లో అనెక్స్చర్ 2-ఈలో ఆయిల్ బాండ్ల కమిట్‌మెంట్ రూ. 1,30,923 కోట్లు. అంటే ఎన్డీఏ-2 ప్రభుత్వం చెల్లించింది కేవలం రూ.3500 కోట్లు మాత్రమే. వడ్డీ (రూ. 40,225 కోట్లు) తో కలిపితే మొత్తం రూ.43,725 కోట్లు మాత్రమే. మోడీ ప్రభుత్వం సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ పెంచడం వలన పెట్రోలియం ఉత్పత్తులు (పెట్రోల్, డీజిల్) కేంద్రానికి వచ్చిన ఆదాయం రూ.7,49,485కోట్లు. అంటే కేవలం ఇందులో 6శాతం మాత్రమే ఆయల్‌బాండ్ల మెచూరిటీ అయిన సందర్భంగా చెల్లించింది. ఇకపోతే పెట్రోల్, డీజిల్‌పై రూ.2.50పైసలు తగ్గించి మిగతా కొంత రాష్ట్రాలు తగ్గించుకోవాలని సూచిస్తుంది. ఇక్కడే కేంద్రం అసలు మతలబు దాచిపెట్టుకుంది. కేంద్రం విధించే అన్ని పన్నులలో వాటా వచ్చిన ఆదాయంలో వాటా కేంద్రం రాష్ట్రాల మధ్య పంపిణీ కావు. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రాలకు కేంద్ర ఆదాయ వాటా కేవలం 42 శాతం మాత్రమే. అంతేగాక సెంట్రల్ ఎక్సైజ్‌డ్యూటీ ఆన్ పెట్రోల్ రూ.72.93, డీజిల్ రూ.39.58 కేంద్రం విధించే పన్ను మాత్రమే. ఈ ఆదాయం రాష్ట్రాలకు పంపిణీ కాదు. కేంద్రం పెద్దన్న పాత్ర ఇక్కడ పక్షపాతం తెలుస్తోంది. ఆదాయం తనకు కావాలట కాని, అప్పులు మాత్రం రాష్ట్రాలు భరించాలట. ఇదేనా సమాఖ్య స్ఫూర్తి, సహకార భావన, టీమ్‌ఇండియా భావన? భారత్‌లో లీటరు పెట్రోల్ ధర నేడు రూ.84కు చేరుకుంది. కాని ఇదే భారతదేశం లీటరు పెట్రోల్ రూ.34కు, డీజిల్ రూ.37కు 29 దేశాలకు ఎగుమతి చేస్తోంది. మరి సామాన్య దేశ పౌరునికి రూ.84కు అమ్మడం దేశభక్తినా? ఆలోచించుకోవాలి. ఆత్మ విమర్శ చేసుకోవాలి. పైగా జీఎస్టీ వలన రాష్ట్రాలు దాదాపు రూ.48,178 కోట్లు నష్టపోయాయి. ఇక తిండి మీద ఆంక్షలు విధించేందుకు ప్రయత్నిస్తోంది. అసలు ప్రభుత్వం ఉన్నది తిండి లేని వాళ్లకు తిండి పెట్టేందుకు. కాని తినే తిండి మీద ఆంక్షలు విధించేందుకు ప్రయత్నించడం సరియేనా? ఏ విషయంలో చూసినా భారతం సంక్షోభం దిశగా పయనిస్తోంది. రైతాంగం, పరిశ్రమలు, యువతకు ఉద్యోగాలు ఏ అంశమైనా బీజేపీ మాటల గారడీ చేస్తోంది. అందుకే ఈదేశంలో ప్రత్యామ్నాయ శక్తుల, వ్యక్తుల కలయిక జరగాలి. ప్రత్యామ్నాయ వేదిక నేడు ఆవశ్యకం. యూపీలో ఎస్పీ, బీఎస్పీ కలిసి సీఎం, డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహించిన స్థానాలను ఉప ఎన్నికల్లో కైవసం చేసుకున్నాయి. అట్లాగే దేశంలో లాల్ జెండాలు, నీల్ అంబేద్కరిస్టులు, పూలే వారసులు, పార్టీలు సామాజికంగా సాంస్కృతికంగా ముందుకు వచ్చి బీజేపీని ఎదుర్కొనే ప్రయత్నం చేయాలి.

సెల్: 81859 68059

నూతన సాంకేతిక విప్లవానికి యువత సన్నద్ధం కావాలి



సి.కనకదుర్గ

నాలుగో పారిశ్రామిక విప్లవం దిశగా ప్రపంచం శాస్త్ర సాంకేతిక రంగాలలో విప్లవాత్మక మార్పులకు బాటలు వేయడం ఆనందకరమైన విషయం. నూతన ఆవిష్కరణలైన ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్, ఆటోమేషన్, కతిమ మేధ, వాణిజ్య కార్యకలాపాలలో డిజిటల్ పద్ధతుల ప్రవేశం యంత్ర యుగం వైపు ప్రపంచాన్ని అడుగులు వేయిస్తోంది. ఇప్పుడు పరిశ్రమలలోనే గాక అనేక రంగాలలో రోబోలు ప్రవేశించాయి. కొత్త సాంకేతిక విప్లవం మానవాళికి పుష్కలమైన అవకాశాలనే గాక పెను సవాళ్లను విసురుతోంది. 2025 సంవత్సరం నాటికి ప్రపంచ వ్యాప్తంగా 52 శాతం వరకు యంత్రాలు లేదా రోబోలు ఆక్రమించుకోవడంతో 52 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదముందని వివిధ అధ్యయన నివేదికలు తెలుపడం ఆందోళన కలిగించే విషయం. ఒక ద్వారం మూసుకుపోతే మరో ద్వారం తెరుచుకుంటుందన్న చందాన కొత్త శాస్త్ర పరిజ్ఞానంతో 13.3 కోట్ల ఉద్యోగాలు అందుబాటులోకి రావడం శుభ పరిణామం. ముఖ్యంగా మన దేశ జనాభాలో ఎక్కువ శాతం యువత ఉన్నందున ప్రభుత్వాలు మారుతున్నా ఈ శాస్త్ర పరిజ్ఞానానికి సంబంధించిన కోర్సులు, విద్యాలయాలలో ప్రవేశపెట్టడం ద్వారా మన దేశ యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడే అవకాశం వుంది. మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా, ఐవోటీ, క్లౌడ్ కంప్యూటింగ్, వెబ్ ఆధారిత మార్కెట్, ఈ కామర్స్ రంగాలలో అవకాశాలు ఎక్కువగా వున్నందున డిజిటల్ నైపుణ్యత, డిజిటల్ అక్షరాస్యత వున్నవారికే ఉద్యోగాలు లభించే అవకాశం ఎక్కువగా వున్నందున వాటి పట్ల అవగాహన కల్పించే వర్కుషాపులు, కాల పరిమితి తక్కువ వున్న కోర్సులు నిర్వహించడం ద్వారా గ్రామీణ యువతకు కూడా ఉద్యోగాలు పొందే అవకాశం మెరుగ్గా వుంటుంది. పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు ప్రయోగాత్మకమైన శిక్షణ ద్వారా ఈ నూతన రంగాలలో నైపుణ్యత అలవడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రస్తుతం నగర, గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల మధ్య నెలకొన్న అంతరాలను తగ్గించే బాధ్యతను విద్యాశాఖ చేపట్టాలి. మన దేశంలో మూస విధానంతో వున్న చదువులతో విద్యార్థులలో కొత్తదనాన్ని స్వీకరించి, నేర్చుకొనే చొరవ కోరవడటం, సేవలలో నాణ్యతాలోపం, నాయకత్వ లక్షణాలు లోపించడం, ఉద్యోగాలు పొందడానికి పెద్ద అవరోధాలుగా నిలుస్తున్నాయి. 2022 సంవత్సరం నాటికి అనేక పరిశ్రమలు తమ సేవలను ఆధునిక ఆవిష్కరణలతో అనుసంధానం చేయడానికి ప్రయత్నాలు మొదలు పెట్టడంతో ఆయా సంస్థలలో పని చేసే ఉద్యోగస్తులు ఆ విధానాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోకపోతే ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం పొంచి వుంది. దేశంలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న నూతన ఒరవడులు, ఆవిష్కరణలను సులభశైలిలో గ్రామీణ యువతకు అందుబాటులోకి తేగలిగితే, వారు కూడా ఆధునిక రంగాలలో ప్రవేశం, అవగాహన, నైపుణ్యం సాధించుకోగలిగి మెరుగైన ఉద్యోగ అవకాశాలను స్వంతం చేసుకునే పరిస్థితులు ఏర్పడతాయి. ఆధునిక ఆవిష్కరణలైన మొబైల్, ఇంటర్నెట్లతో విమానయానం, పర్యాటకం, ఆర్థిక సేవల రంగంలో క్లౌడ్ కంప్యూటింగ్ ద్వారా సమాచార సాంకేతిక రంగంలో బిగ్‌డేటా ద్వారా ఆర్థిక సేవలు, పెట్టుబడి రంగాలలో మార్పులు రావడంతో ఎన్నో ఉపాధి మార్గాలకు తలుపులు తెరుచుకుంటున్నాయి. 2022 నాటికి మనదేశంలో అత్యధిక వేగంతో కూడిన మొబైల్ ఇంటర్నెట్ 5జి సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. కాబట్టి యువత మూస చదువులు వదిలి ఈ నూతన ఒరవడికి అలవాటుపడితే ఉపాధి మార్గాలు సత్వరం లభిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రభుత్వం కూడా ఆటోమేటివ్ ఇండియా, మేకిన్ ఇండియా ద్వారా డిజిటల్, కతిమ మేధా రంగాలలో నూతన పరిశోధనలకు సహాయ సహకారాలు అందిస్తున్నప్పటికీ రోజురోజుకూ మారుతున్న శాస్త్ర, సాంకేతిక మార్పులు చాలా మంది యువతకు చేరవేయడంలో ప్రభుత్వం ఇంకా చొరవ తీసుకోవాలి.

సెల్ : 7674887456

వామపక్షాలపై అ 'శోకం' ఆపేదెన్నడు?



మన్నారం నాగరాజు

ఇటీవల బంగాళాఖాతంలో లేచిన తిత్లి తుఫాను కారణంగా తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున వర్షాలు కురిశాయి. బంగాళాఖాతం తీర రేఖను కల్గియున్న ఆంధ్రప్రదేశ్‌లో పంటలు ఎంతగానో దెబ్బతిన్నాయి. దాంతోపాటు తెలంగాణలో కూడా పంట చేతికి వచ్చిన రైతుల నోట్లో మట్టికొట్టిన దారుణ పరిస్థితి ఏర్పడింది. ఇదే క్రమంలో నా వాటాప్‌కి ఒక మిత్రుడు పంపిన సందేశంతో నాలో ఆలోచన రేకెత్తించింది. అందులో సారాంశం ఏంటంటే... ఇటీవల తెలంగాణలో వె లువడిన అసెంబ్లీ ఫలితాలలో ఒక్క కమ్యూనిస్టు గెలవ కపోవడంతో ప్రకతి కన్నెర్ర జేసింది. అందుకే తిత్లి తుపాను రూపంలో రెండు రాష్ట్రాల్లో ముంచెత్తింది. ఇదివరకే ఆం ధ్రప్రదేశ్‌లో (2014 ఎన్నికల్లోనే) ఒక్క కమ్యూనిస్టు కూడా గెలవలేదు. తాజాగా తెలంగాణలోనూ గెలవకపోవడమే ప్రకతి ప్రకోపానికి దారితీసిందన్నది ఆ మెసేజ్ సారాంశం. ఈ మెసేజ్‌లో ఏ మాత్రం శాస్త్రీయత లేదని నాకు అర్థమైంది. ఈ రెండు విషయాలకు లింకు పెట్టి నమ్మడం సముచితం కాదు. కానీ ఆ సందేశంలో ఉన్న నిగూఢత మాత్రం చాలా ఉందని స్పష్టంగా చెప్పవచ్చు.

ఎప్పుడూ కమ్యూనిస్టు పార్టీలపై అక్కసు వెల్లగక్కే ప్రముఖ జర్నలిస్టు టంకశాల అశోక్ ఈ సారి కూడా తన అహంకారపు అక్షరాలను వామపక్షాలపై ఎక్కు పెట్టారు. కమ్యూనిస్టులు కకావికలమయ్యారని ఆయన రాతలతో అధికారపక్షం ఆశీర్వచనాల కోసం తహతహలాడుతూ పూతలు పూసారు. సీపీఐ, సీపీఐ(ఎం), విప్లవ గ్రూపులు కలిపి ఒకే పార్టీగా ఉండినప్పుడు అరువైఏండ్ల కిందట మహోదత్తమైన రీతిలో రైతాంగ సాయుధ పోరాటం చేశాయని చెప్పుకొచ్చారు. అటు తర్వాత జరిగిన మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం ముంగిట నిలిచాయనీ, అప్పటి నుంచి అరువైఏండ్ల అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడగా, గత కాలపు రైతాంగ పోరాట ప్రతిష్ఠపై చాలా ఆశలు పెట్టుకున్నాయంటున్నారు. అప్పటి చరిత్ర ఇప్పటి తరాల ఓటర్లకు ఇంకా గుర్తుంటుందని, కనుక వారు తమకు ఓటు వేయగలరని అనుకుంటున్నట్టు చెబుతున్నారు. ఇదే సూత్రాన్ని ఆయన అధికార టీఆర్ఎస్‌కు ఎందుకు అన్వయించడం లేదో నాకు బోధపడటం లేదు. 2001లో తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించిన టీఆర్ఎస్ ఎన్నికల్లో ఎందుకు పదేపదే చెప్పుకున్నది. తెలంగాణవాదాన్ని ఎందుకు సజీవంగా ఉంచుతున్నారని ఆత్మవిమర్శ చేసుకోవడంలేదు. గత ఉద్యమాన్ని చెప్పుకొని ఇప్పుడు యువతను తమవైపు ఉత్తేజ పరుచుకోవాల్సిన అగత్యం ఏం పట్టింది ఆ పార్టీకి. ఈవిషయాన్ని ఆయన అసలే స్పృషించలేదు. ఎందుకంటే ఆయనకు అధికార పార్టీ ఆశీర్వచనాలు కావాలి. తెలంగాణ సాయుధ పోరాటం గురించి తెలిసిన వారేవరైనా అప్పటి కమ్యూనిస్టు పార్టీ పోరాటాలను మెచ్చుకోకుండా ఉండరు. దాన్ని చూపి సీపీఐ(ఎం) నేతలు ఎక్కడ ఓట్లు అడిగారో కమ్యూనిస్టులపై ఎప్పుడూ శోకం పెట్టే అశోక్కే తెలియాలి. గత నాలుగు సంవత్సరాల్లో సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ చేసిన ఉద్యమాలు ఆయనకు తెలియదా? రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల కోసం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం నేతృత్వంలో ఓ బందమే పాదయాత్ర చేసిన విషయం మరిచారా? మంథని మధుకర్, మిర్యాలగూడ ప్రణయ్ హత్యలపై అశోక్ ఎందుకు నోరు మెదపలేదు. అటువంటి కుల దురహంకార హత్యల గురించి మాట్లాడిన ఏకైక పార్టీ సీపీఐ(ఎం) మాత్రమే అన్న విషయం గుర్తెరగాలి. బీసీ సబ్‌ప్లాన్, అంగన్వాడీ జీతాల పెంపు, మున్సిపల్ కార్మికుల వేతనాలపై ఎన్ని సార్లు కమ్యూనిస్టులు పోరాటాలు చేశారో ప్రజలకు తెలుసు. అటువంటి పార్టీపై గత ఉద్యమాల ఆధారంగా ఓట్లు అడిగారని ఆరోపణలు చేయడం ఆయన విజ్ఞతకే చెల్లింది. ఇక ఆయన చేసిన మరో వింత ఆరోపణ ఏమిటంటే... తెలంగాణ ప్రజల్లో 85 శాతం మంది బడుగుబలహీన వర్గాల వారు గనుక, వారు ఆటోమేటిక్‌గా కమ్యూనిస్టు సిద్ధాంతపు పార్టీలకు ఓటు వేస్తారనుకున్నారని చెప్పారు. ఎవరి కోసమైతే పోరాటం చేశారో... వాళ్ళనుంచి ఓట్లు అడగడం లేదు. రాజకీయంగా చైతన్యం చేసేందుకు వామపక్షాలు ప్రయత్నించాయి. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఎందుకు దివాళా తీశాయని ఆయన ప్రధానంగా మాట్లాడారు. సీపీఐ(ఎం) తన పార్టీ మహాసభ విధానానికి అనుగుణంగా కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీఆర్ఎస్ (పాలక పార్టీలకు) వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ కార్యక్రమంతో కలసి వచ్చే పార్టీలు, సామాజిక శక్తులతో కలసి వెళ్ళాలని నిర్ణయించుకున్నాయి. అందుకు అనుగుణంగా తెలంగాణలో బీఎల్ఎఫ్‌గా ముందుకువెళ్ళాయి. అయితే, ఫలితాలు వ్యతిరేకంగా రావచ్చు. ఎన్నికలన్నాక పార్టీలు వేసే ఎత్తుగడలు ఒక్కోసారి సఫలం అవ్వచ్చు... మరికొన్ని సార్లు విఫలం అవ్వచ్చు. అంతమాత్రన ఎందుకు పనికిరాని వారని భావించడం విజ్ఞుడి లక్షణం కాదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ఇవ్వక సీపీఎం తప్పు చేసిందని ఎప్పుడూ వాదించే అశోక్... ఒక్క మాట తన మదిలో ఉంచుకోవాలి. సీపీఎంపై ఏ ఒక్కరోజు కూడా టీఆర్ఎస్ మాటల దాడి చేయలేదు. టీడీపీని నిందించిన మాదిరిగా కనీసం ఒక్కసారి కూడా ఆరోపించలేదు. ఎందుకంటే, ఆంధ్రప్రదేశ్‌లో అవకాశవాదంగా చేసిన సమైక్యాంధ్ర ఉద్యమంతో సీపీఎం ఏనాడూ చేతులు కలపలేదు. ఈ విషయం టీఆర్ఎస్ నాయకత్వానికి కూడా తెలుసు. ఇవన్నీ చరిత్రలో నిక్షిప్తమైన వాస్తవాలు.

సీపీఎం నాయకత్వం బీఎల్ఎఫ్ పేరిట కొత్త భ్రమలను సష్టించుకోసాగిందని వ్యాఖ్యానించారు. బహుజనుల గురించి మాట్లాడటం, కొట్లాడటం తప్పా? 70 సంవత్సరాల స్వాతంత్రంలో బీసీలు ఇంకా బిచ్చగాళ్ళుగా ఉండాలని అశోక్ కోరుకుంటున్నారా? పూలే, అంబేద్కర్ల పేరిట ప్రత్యేక సంఘాలుగా ఏర్పడుతున్న వారిలోనే సైద్ధాంతిక నిష్ఠ, ఐక్యత లేక దశాబ్దాలు గడిచినా పురోగతి లేకుండా ఉన్నదని అన్నారు. ఇది మాత్రం అక్షర సత్యం. వారి మధ్య ఐక్యత లేకపోవడం వల్లే ఇంకా బ్రాహ్మణవాదం మన రాష్ట్రంలో, దేశంలో చలామణి అవుతున్నది. అటువంటి వర్గాలు ఇటీవల ఎన్నికల్లో కొంత మేర ఏకం అయ్యేందుకు ఒక వేదిక దొరికింది. దాన్ని ఎన్నికల ఎత్తుగడగా ఎంత మేర సాధ్యం అయిందన్న విషయంపై లోతైన అధ్యయనం జరగాల్సి ఉంది. కమ్యూనిస్టుల మధ్య కులం-వర్గం ప్రశ్న నేటికీ తీరకుండా పెచ్చరిల్లుతూనే ఉన్నదని అన్నారు. ఈ దేశంలో సాగుతున్న వివక్ష గురించి పోరాడుతున్నది కమ్యూనిస్టులు. కొన్ని దళిత సంఘాలు కూడా వివక్ష గురించి మాట్లాడటం మానేశాయి. కానీ, వామపక్షాలు మాత్రం కుల వివక్ష వ్యతిరేక సంఘం పేరిట చేపడుతున్న కార్యక్రమాలు నిజంగా అభినందనీయం. ఈ పార్టీలు ఎప్పటికైనా బాగుపడుతాయో లేదో తెలియదుగాని, అందుకు ఒక చిన్న ఆశాకిరణమైనా కన్పించాలంటే అన్నింటికన్న ముందు జరుగవలసింది ఉభయ కమ్యూనిస్టుల కార్యకర్తలు, అభిమానులు, మధ్యమ శ్రేణి వారు ఆనాయకత్వాలపై తిరుగబడి తీవ్రంగా నిలదీయాలన్నారు. అప్పటికీ వారిలో మార్పు లక్షణాలు కన్పించకపోతే నాయకత్వాలను కూలదోయాలని ఉచిత సలహాలిచ్చారు. కొత్త వారిని తెచ్చుకోవాలని... ఇటువంటి తీవ్రమైన పరిణామాలు ఏవో చోటుచేసుకోని పక్షంలో 2023 నాటికి తెలంగాణ వామపక్షాలు మరింత దుర్గతికి చేరేది చెప్పటం కష్టమన్నారు. ఈ వ్యాఖ్యలతో ఆయనకు కమ్యూనిస్టు పార్టీ స్వరూపం, నిర్మాణంపై ఏమాత్రం అవగాహన లేదని పూర్తిగా అర్థమైంది. వామపక్షాలు నాయకులను సొంతంగా తయారు చేసుకుంటాయి. అంతేగానీ, ఇతర బూర్జువా పార్టీల మాదిరి ఎన్నికల సమయంలో నాయకులను అరువు తెచ్చుకోవు. ఈవిషయాన్ని అశోక్ తెలుసుకొని వామపక్షాలపై ఆ శోకం ఆపాలి.

ఇక మొదటి విషయానికి వద్దాం. ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టులు లేకపోవడంతో ప్రస్తుతం అక్కడ ఏం జరుగుతుందో మనమంతా చూస్తున్నాం. ప్రభుత్వం తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిందని అక్కడి ప్రతి పక్షనేత, ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసలు అసెంబ్లీకే వెళ్ళడంలేదు. దీంతో సభ కేవలం అధికారపక్ష సభ్యులతోనే నడుస్తున్నది. వారికి నచ్చిన విధంగా బిల్లులు చేసుకుంటున్నారు. ఇక ప్రజాసమస్యలపై చర్చ జరగడంలేదు. జనం గోస ఎవరు మాట్లాడాలి. మాట్లాడాల్సిన ప్రతిపక్షం గాలికొదిలేసింది. ఇక వామపక్షాలు గెలవకపోవడంతో సభలోలేరు. దీనితో అంతిమంగా ప్రజా సమస్యలు చర్చకు రావడంలేదు. అందుకారణంగా తుదిగా నష్టపోయేది కేవలం సామాన్య ప్రజలన్న విషయం మేధావిగా చెప్పుకొనే అశోక్ లాంటి పెద్దమనుషులు తెలుసుకోవాలి. కేవలం కమ్యూనిస్టులు మాత్రమే ప్రజాసమస్యలను అసెంబ్లీలో చర్చించి వాటి పరిష్కారానికి కషి చేయగలరన్న విషయం జగమెరిగిన సత్యం. ఈనాలుగున్నరేండ్లు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి పట్టిన దుర్గతి తెలంగాణ శాసనసభకు పట్టే ప్రమాదం ఉందని ఆయన ఎన్నడు అర్థం చేసుకుంటారన్నది ప్రస్తుతం మిలియన్ డాలర్ల ప్రశ్న.

సెల్ : 9550844433

రచయితలకు సూచనలు

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి. ప్రత్యేక సందర్భానికి సంబంధించిన వ్యాసమైతే దానిని గురించి కవరింగ్ లెటర్ రాయండి. వ్యాసం మొదటి పేజీ మీద పంపిస్తున్న తేదీ వేయండి.

వ్యాస రచయితలు తమ వ్యాసంతోపాటు పూర్తి పోస్టల్ చిరునామా కూడా పంపించాలని కోరుతున్నాం. ఇప్పటికే వ్యాసాలు పంపినవారు కూడా తమ అడ్రెస్‌లు పోస్టల్ ద్వారా గానీ, మెయిల్ ద్వారా గానీ పంపించాలని మనవి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228




సల్మా హయక్


షో


సల్మా హయక్


అందం,అభినయంతో
అత్యద్భుత భిన్న పాత్రలకు కేరాఫ్‌గా నిలిచి
ప్రేక్షకుల్ని ఫిదా చేసిన హాలీవుడ్
స్టార్ హీరోయిన్.
కమర్షియల్ సినిమాలతోపాటు
సమాంతర (పార్లల్) చిత్రాల్లోనూ
నటించి సత్తా చాటిన నాయిక.
నటిగానే కాకుండా నిర్మాతగా,
దర్శకురాలిగా, గాయనిగా,
రచయితగానూ ప్రేక్షకుల్ని,
శ్రోతల్ని, పాఠకుల్ని అలరించిన
బహుముఖ ప్రజ్ఞాశాలి.
మహిళల పై హింస, వలస దారులపై
వివక్షపై స్ఫూర్తిదాయక పోరాటం
చేసిన సల్మా హయక్ గురించి
ఈ వారం అందిస్తున్న
స్పెషల్ షో..

రీల్ అండ్ రియల్ లైఫ్‌లోనూ కథానాయికే..











సినిమా అవకాశాల కోసం ఎన్నో ప్రయత్నాలు..

సల్మా వర్గార్మ హయక్ జిమ్‌నెజ్‌గా మెక్సికోలోని వెరాక్రుజ్ పట్టణానికి చెందిన కోట్జాకోల్కస్‌లో 1966 సెప్టెంబర్ 2న జన్మించారు. సోదరుడు సమి ఫర్నీచర్ డిజైనర్. తల్లి డియానా మెడీనా గాయకురాలు, టాలెంట్ స్కౌట్ (ప్రతిభా అన్వేషకురాలు). తండ్రి సమీ హయక్ ఆయిల్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పని చేసేవారు. ఆయనకు ఇండస్ట్రీయల్ ఎక్విప్‌మెంట్ ఫామ్ కూడా ఉంది. లౌయిసియానాలోని ఆకాడమీ ఆఫ్ ది సాక్రెడ్ హార్ట్ స్కూల్, రాంథాస్ స్కూల్ ఆఫ్ ఎన్‌లైటెన్‌మెంట్‌లో పాఠశాల విద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత 12 ఏండ్ల వయసులో అమెరికాలోని క్యాథలిక్ స్కూల్‌కి వెళ్ళారు. ఆ తర్వాత మెక్సికోలోని ఓ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో ఉన్నత విద్య పూర్తి చేశారు. చిన్నప్పట్నుంచి ఆమె డైస్లెక్సియా డిజార్డర్‌తో బాధపడేవారు. దీని వల్ల చదవడం, రాయడంలో ఆమెకు చాలా ఇబ్బంది ఏర్పడింది. జిమ్నాస్టిక్స్ ద్వారా దాన్ని అధిగమించారు. అలాగే యోగా సాధన చేశారు. సినిమా హీరోయిన్ కావాలనేది సల్మా చిన్ననాటి కోరిక. 'విల్లీ వాంకా అండ్ ది చాకోలేట్ ఫ్యాక్టరీ' సినిమాలో గెనె విల్డర్ నటనకు మంత్రముగ్ధురాలైన ఆమె సినిమాల్లోకి రావాలని నిర్ణయించుకున్నారట. ఎన్నో స్ట్రగుల్స్ అనంతరం 23వ ఏట 1989లో 'టెరెసా' చిత్రంలో నటించే ఛాన్స్ వచ్చింది. దీని తర్వాత చాలా గ్యాప్ వచ్చింది. దీంతో లాస్ ఏంజెల్స్‌కి వెళ్ళి అక్కడ నటిగా ప్రయత్నాలు ప్రారంభించారు.

మలుపు తిప్పిన మెక్సికన్ చిత్రం మిరాకిల్ అల్లే..

1991లో అమెరికన్ నటి, యాక్టింగ్ టీచర్ స్టెల్లా అడ్లర్ సమక్షంలో నటనలో శిక్షణ తీసుకున్నారు. అప్పటికీ ఆమెకి అంతగా ఇంగ్లీష్ రాదు. పైగా తడబాటు. కష్టపడి ఇంగ్లీష్‌పై పట్టు సాధించారు. 1994లో 'మై క్రేజీ లైఫ్' చిత్రంలో చిన్న పాత్రలో మెరిశారు. అదే ఏడాది టెలివిజన్ ఫిల్మ్ 'రోడ్ రేసర్స్'లో హీరోయిన్‌గా నటించే అవకాశాన్ని అందుకున్నారు. ఆ వెంటనే మెక్సికోలో 'మిడాక్ అల్లే' (మిరాకిల్ అల్లే) చిత్రంలో మెయిన్ హీరోయిన్‌గా నటించే ఛాన్స్ దక్కించుకున్నారు. ఇది సంచలన విజయం సాధించి అనేక అవార్డులను తెచ్చిపెట్టింది. దీంతో సల్మాకు మంచి గుర్తింపు వచ్చింది. అంతేకాదు హాలీవుడ్‌లో ఓ భారీ బంపర్ ఆఫర్‌ని కూడా తెచ్చిపెట్టింది. ప్రముఖ నటుడు ఆంటోనియో బండెరాస్ హీరోగా దర్శకుడు రాబర్ట్ రోడ్రిగ్జ్ రూపొందిన కాంటెంపరరీ వెస్టర్న్ యాక్షన్ చిత్రం 'డెస్పెరాడో'లో హీరోయిన్‌గా నటించారు. ఇది మంచి పేరు తెచ్చిపెట్టింది. అదే సంవత్సరం 'ఫెయిర్ గేమ్', 'ఫోర్ రూమ్స్' చిత్రాల్లో పెద్దగా గుర్తింపు లేని పాత్రలు పోషించారు. ఆ వెంటనే 1996లో వాంపైర్ క్రైమ్ థ్రిల్లర్ 'ఫ్రమ్ డస్క్ టిల్ డాన్' చిత్రంతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు.

జయాపజయాలకు అతీతంగా..

ఇక వరుసగా 'ఫాలో మి హోమ్', 'ఫ్లెడ్', 'ఫూల్స్ రష్ ఇన్', 'బ్రేకింగ్ అప్', 'సిస్టోలె డియస్టోలె' వంటి ఫెయిల్యూర్ చిత్రాల్లో నటించడంతో ఆమె కెరీర్ డౌన్‌ఫాల్ అయ్యింది. 1998లో మార్క్ క్రిస్టోఫర్ దర్శకత్వంలో ర్యాన్ ఫిలిప్పె హీరోగా వచ్చిన '54' చిత్ర విజయం ఆమెకు కొంత రిలీఫ్‌నిచ్చింది. అదే ఏడాది రాబర్ట్ రోడ్రిగ్జ్ రూపొందించిన 'ది ఫ్యాకల్టీ'తో మరో విజయాన్ని అందుకున్నారు. 1999లో వచ్చిన 'ది వెలసిటీ ఆఫ్ గ్యారీ' పరాజయం చెందగా, కెవిన్ స్మిత్ దర్శకత్వంలో బెన్ అఫ్లెక్, మాట్ డామన్ హీరోలుగా రూపొందిన 'డోగ్మా', విల్ స్మిత్, కెవిన్ క్లినె హీరోగా వచ్చిన 'వైల్డ్ వైల్డ్ వెస్ట్' చిత్రాలు భారీ విజయాలను సాధించి సల్మా కెరీర్‌ని మరో మెట్టు ఎక్కించాయి. ఇదే ఏడాది నటించిన మెక్సికన్ చిత్రం 'నో వన్ రైట్స్ టు ది కోలోనెల్' మిశ్రమ స్పందన రాబట్టుకుంది. 2000లో ఆమె నటించిన 'టైమ్‌కోడ్', 'లివింగ్ ఇట్ అప్', 'చైన్ ఆఫ్ ఫూల్స్', 'హోటల్', 'ఇన్ ది టైమ్ ఆఫ్ ది బట్టర్‌ఫ్లైస్' వంటి వివిధ దేశాల ప్రయోగాత్మక చిత్రాలు బాక్సాఫీసు వద్ద ఆశించిన ఫలితాన్ని రాబట్టలేకపోయినప్పటికీ నటన పరంగా సల్మాకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి.

అగ్రనటిగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు..

2002 సల్మా కెరీర్‌లో మరుపురాని సంవత్సరం. మెక్సికన్ పెయింటర్ ఫ్రిదా కాలో జీవితం ఆధారంగా రూపొందిన 'ఫ్రిదా' చిత్రంలో టైటిల్ రోల్ పోషించారు. జులియా టామోర్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా సంచలన విజయం సాధించింది. ముఖ్యంగా ఇందులో ఆమె ఫ్రిదా పాత్రలో అద్భుత నటనతో ప్రపంచ ప్రేక్షకుల్ని మెప్పించారు. అనేక అవార్డులను అందుకున్నారు. ఆస్కార్‌కి కూడా నామినేట్ అయ్యారు. అంతర్జాతీయంగా నటిగా మంచి గుర్తింపు పొందారు.
ఆ తర్వాత వరుసగా 'స్పై కిడ్స్ 3డి: గేమ్ ఓవర్', 'వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ మెక్సికో', 'ఆఫ్టర్ ది సన్‌సెట్', 'ఆస్క్ ది డస్ట్', 'బండిడాస్', 'లోన్లీ హార్ట్స్', 'ఎక్రాస్ ది యూనివర్స్', 'సర్క్యూడు ఫ్రీక్: ది వాంపైర్స్ అసిస్టెంట్', 'గ్రోన్ అప్స్', 'అమెరికానో', 'లా చిస్పా డె లా విడా', 'సావేజెస్', 'హియర్ కమ్స్ ది బూమ్', 'గ్రోన్ అప్స్ 2', 'ఎవిర్లీ', 'సమ్ కైండ్ ఆఫ్ బ్యూటిఫుల్', 'టేల్ ఆఫ్ టేల్స్', 'సెప్టెంబర్స్ ఆఫ్ షిరాజ్', 'బీట్రిజ్ ఎట్ డిన్నర్', 'హౌ టు బి ఏ లాటిన్ లవర్', 'ది హిట్‌మ్యాన్స్ బాడీగార్డ్', 'ది హమ్మింగ్‌బర్డ్ ప్రాజెక్ట్' చిత్రాలో విభిన్న పాత్రలు పోషించారు.
ఇందులో 'స్పై కిడ్స్ 3డీ: గేమ్‌ఓవర్', రాబర్డ్ రోడ్రిగ్జ్ దర్శకత్వంలో వచ్చిన 'వన్స్ ఆపాన్ ఏ టైమ్ ఇన్ మెక్సికో', 'గ్రోన్ అప్స్', ఒలివర్ స్టోన్ 'సేవేజెస్', 'హియర్ కమ్స్ ది బూమ్', 'గ్రోన్ అప్స్ 2', 'హౌ టు బి ఏ లాటిన్ లవర్', 'ది హిట్‌మాన్స్ బాడీగార్డ్' చిత్రాలు ఘన విజయం సాధించి సాల్మాని హాలీవుడ్‌లో అగ్రనటిగా నిలబెట్టాయి.
అంతేకాదు వివిధ దేశాల సమాంతర సినిమాల్లోనూ నటించి ఆకట్టుకున్నారు.
దీంతోపాటు 'ముప్పెట్స్ మోస్ట్ వాంటెడ్'లో గెస్ట్‌గా, 'ది పైరేట్స్! ఇన్ యాన్ అడ్వెంచర్ విత్ సైంటిస్ట్స్', 'పస్ ఇన్ బూట్స్', 'కహ్లిల్ గిబ్రాన్ ది ప్రొఫెట్', 'సౌసేజ్ పార్టీ' సినిమాలకు వాయిస్ ఓవర్ అందించారు. 'వి-డే: అంటిల్ ది వాయిలెన్స్ స్టాప్స్' అనే డాక్యుమెంటరీలో మెరిశారు. ప్రస్తుతం 'డ్రంక్ పేరెంట్స్', 'లిమిట్ పేరెంట్స్' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.

నిర్మాత.. దర్శకురాలు..సింగర్..

మంచి కథలను ప్రోత్సహించడం సల్మాకు ఇంట్రెస్ట్. ఇందులో భాగంగా 1999లో 'వెంటానరోసా' పేరుతో ఓ ప్రొడక్షన్ కంపెనీని ప్రారంభించారు. మెక్సికన్ చిత్రం 'నో వన్ రైట్స్ టు ది కోలోనెల్'ని నిర్మించారు. 2002లో అద్భుత విజయం సాధించిన 'ఫ్రిదా' చిత్ర నిర్మాణంలోనూ భాగమయ్యారు. 2001లో 'ఇన్ ది టైమ్ ఆఫ్ ది బట్టర్‌ఫ్లైస్'ని నిర్మించి విజయాన్ని అందుకున్నారు. 2003లో దర్శకురాలిగానూ మారి 'ది మాల్డోనాడో మిరాకిల్' అనే షోటైమ్ మూవీని రూపొందించారు. దీనికిగానూ డే టైమ్ ఎమ్మీ అవార్డునందుకున్నారు. 2005లో మ్యూజిక్ వీడియో 'ప్రిన్స్'ను రూపొందించారు. 'అగ్లీ బెట్టీ' అనే టెలివిజన్ సిరీస్‌కి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత 'కహ్లిల్ గిబ్రాన్స్ ది ప్రొఫెట్' చిత్రాన్ని నిర్మించారు. 'సెప్టెంబర్స్ ఆఫ్ షిరాజ్'కి ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు. సల్మా నిర్మాత, దర్శకురాలే కాదు మంచి సింగర్ కూడా. 'డెస్పెరాడో' చిత్రంలో ఒక పాట కూడా పాడి శ్రోతల్ని ఆకట్టుకున్నారు. 'ఫ్రిదా', 'వన్స్ ఆపాన్ ఏ టైమ్ ఇన్ మెక్సికో', 'ఎక్రాస్ ది యూనివర్స్' చిత్రాల్లో పాటలు పాడి తన అద్భుతమైన గానంతో అందరినీ మంత్రముగ్ధుల్ని చేశారు. అలాగే 'టెరెసా', 'డ్రీమ్ ఆన్', 'ది సింబాడ్ షో', 'రోడ్‌రేసర్స్', 'ది హంచ్‌బ్యాక్', 'ఇన్ ది టైమ్ ఆఫ్ ది బట్టర్‌ఫ్లైస్', 'అగ్లీ బెట్టీ', '30రాక్' వంటి టెలివిజన్స్‌లోనూ నటించి బుల్లితెర ప్రేక్షకులకూ దగ్గరయ్యారు.

స్ఫూర్తిదాయక సమాజ సేవకురాలు..


ఫ్రెంచ్ బిలియనీర్ ఫ్రాన్స్‌యిస్ హెన్రీ పినాల్ట్‌ని పెళ్ళి చేసుకున్న హయక్ యూనిసెఫ్ తరఫున పనిచేశారు. పుట్టబోయే పిల్లలు ఎలాంటి అనారోగ్యంతో పుట్టకుండా తీసుకోవాల్సిన వాక్సిన్లపై అవగాహన కల్పించారు. ఫండ్ రైజింగ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహిళలపై హింసకు, వలసదారుల వివక్షపై అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. దీని కోసమై 25 వేల డాలర్లు డోనేట్ చేశారు. యాంటి డొమెస్టిక్ వయిలెన్స్ గ్రూప్స్‌కి యాభై వేల డాలర్లు విరాళంగా అందించారు. మహిళా హింసకు వ్యతిరేకంగా ఏర్పడ్డ 'వీడే' సంస్థలో బోర్డ్ మెంబర్‌గా ఉన్నారు. శిశువులకు అమ్మ పాలను ప్రోత్సహించారు. సల్మా చేస్తున్న సేవలకుగానూ వీహెచ్ 1 డు సమ్‌థింగ్ అవార్డును 2010లో అందుకున్నారు. 2014లో అఫ్ఘనిస్తాన్‌లో, 2015లో లెబనాన్‌లో మహిళా హక్కుల కోసం పోరాడారు. 'ఫ్రిదా' సినిమా టైమ్‌లో తనను నిర్మాత హార్వే వీన్‌స్టీన్ వేధించినట్టు గతేడాది హయక్ ఆరోపించారు. దీంతోపాటు పలు కాస్మోటిక్, బ్యూటీకి సంబంధించిన ప్రొడక్ట్‌లకు అధికార ప్రతినిధిగా, బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేశారు. జ్యూస్ కంపెనీని స్థాపించారు. జ్యూస్‌కి సంబంధించి 'ది జ్యూస్ జనరేషన్: 100 రిసిప్స్ ఫర్ ఫ్రెష్ జ్యూసెస్, అండ్ సూపర్ ఫుడ్ స్మూథీస్' అనే పుస్తకాన్ని రాశారు. సల్మా నటనకు అనేక అవార్డులు వరించాయి. 2007లో హాలీవుడ్‌లో అత్యంత శక్తివంతమైన లాటిన్ కమ్యూనిటీకి చెందిన వ్యక్తుల్లో నాలుగో స్థానం దక్కించుకున్నారు. అత్యంత సెక్సీయెస్ట్ కథానాయికగానూ నిలిచారు. 2008లో ఉమెన్ ఇన్ ఫిల్మ్ ల్యూసీ అవార్డునందుకున్నారు. 2011లో నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది లీజన్ ఆఫ్ హోనర్ పురస్కారంతోపాటు ఈ ఏడాది వెనిస్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఫ్రాన్స్ జోజ్జాని అవార్డునందుకున్నారు.





సల్మా హయక్


అద్భుత పాత్రలకు ప్రేక్షకులు ఫిదా..


నటిగా సల్మా హయక్ అనేక విభిన్న పాత్రల్లో నవ్యమైన నటనతో మెప్పించారు. అయితే ఎక్కుగా గ్లామర్, యాక్షన్ తరహా పాత్రలతో బాగా పాపులర్ అయ్యారు. తొలిసారి మెయిన్ స్ట్రీమ్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'డెస్పరాడో'. ఇందులో కమర్షియల్ హీరోకి లవ్ ఇంట్రెస్ట్‌గా గ్లామర్ తరహా పాత్రలో మెప్పించారు. వాంపైర్ క్రైమ్ థ్రిల్లర్ 'ఫ్రమ్ డస్క్ టిల్ డాన్'లో వాంపైర్ క్వీన్‌గా మంత్రముగ్ధుల్ని చేసి, అద్భుతమైన యాక్షన్‌తో అలరించారు. రొమాంటిక్ కామెడీ డ్రామా'ఫూల్స్ రష్ ఇన్' చిత్రంలో ఆర్చిటెక్చర్ లవ్ ఇంట్రెస్ట్‌గా, ఫొటోగ్రాఫర్‌గా మెప్పించారు. రొమాంటిక్ కామెడీ 'బ్రేకింగ్ అప్' చిత్రంలో భార్య పాత్రలో విభిన్న భావోద్వేగాలను పలికించారు. మ్యూజికల్ డ్రామా'54' సినిమాలో పాప్ సింగర్‌గా అభినయంతో మెస్మరైజ్ చేశారు. రొమాంటిక్ కామెడీ డ్రామా 'ది వెలసిటీ ఆఫ్ గ్యారీ'లో ఓ స్నాక్స్ అమ్మే షాప్‌లో వర్కర్‌గా, అడల్ట్ ఫిల్మ్ స్టార్‌కి ప్రియురాలిగా మైమరపించారు. ఫాంటసీ కామెడీ 'డోగ్మా'లో క్రియేటివ్ పర్సన్‌గా, క్లబ్‌లో పనిచేసే అమ్మాయిగా శక్తివంతమైన పాత్రలో అలరించారు. సైన్స్ ఫిక్షన్ యాక్షన్ కామెడీ 'వైల్డ్ వైల్డ్ వెస్ట్' చిత్రంలో గన్‌ఫైటర్ విల్ స్మిత్‌కి ప్రియురాలిగా, యాక్షన్ తరహా పాత్రలో ప్రేక్షకుల్ని అలరించారు. ప్రయోగాత్మక చిత్రం 'టైమ్ కోడ్'లో వెండితెర సినీ నటిగానూ మంత్రముగ్ధుల్ని చేశారు. 'చైన్ ఆఫ్ ఫూల్స్' చిత్రంలో పోలీస్‌గా, ప్లేబాయ్ గర్ల్‌గా, 'ఇన్ ది టైమ్ ఆఫ్ ది బట్టర్‌ఫ్లైస్' చిత్రంలో సోదరి మినర్వాగా అత్యంత సాహసవంతమైన నటనతో, డిక్టేటర్ బాధితురాలిగా ప్రేక్షకుల్ని మెప్పించారు. మెక్సికన్ పెయింటర్ ఫ్రిదా కలో జీవితంలో వృత్తి గత, వ్యక్తిగత అంశాలను ప్రధానంగా చేసుకుని తెరకెక్కిన బయోపిక్ 'ఫ్రిదా'లో పెయింటర్ పాత్రలో అద్భుత నటించారు. వెస్టర్న్ యాక్షన్ చిత్రం 'వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ మెక్సికో'లో సీఐఏ ఏజెంట్‌కి ముద్దుల భార్యగా, యాక్షన్ కామెడీ 'ఆఫ్టర్ ది సన్‌సెట్'లో దొంగగా, రొమాంటిక్ డ్రామా 'ఆస్క్ ది డస్క్' చిత్రంలో వెయిట్రెస్‌గా, వెస్టర్న్ యాక్షన్ కామెడీ 'బాండిడాస్'లో బందిపోటుగా, క్రైమ్ చిత్రం 'లోన్లీ హార్ట్స్'లో సీరియల్ కిల్లర్‌గా, కామెడీ చిత్రం 'గ్రోన్ అప్స్'లో టాలెంట్ ఏజెంట్ భార్యగా, ఫ్యాషన్‌డిజైనర్‌గా, డ్రామా ప్రధానంగా తెరకెక్కిన 'అమెరికానో'లో కీలక పాత్రలో, క్రైమ్ థ్రిల్లర్ 'సేవేజెస్'లో కిడ్నాపర్ల లీడర్‌గా నెగటివ్ పాత్రలో, రొమాంటిక్ కామెడీ 'సమ్ కైండ్ ఆఫ్ బ్యూటీఫుల్' చిత్రంలో తన అక్క ప్రియుడితో ప్రేమాయణం సాగించే అమ్మాయిగా, యాక్షన్ థ్రిల్లర్ కామెడీ 'ది హిట్‌మ్యాన్ బాడీ గార్డ్'లో హిట్‌మ్యాన్ భార్యగా యాక్షన్ పాత్రలో మంత్రముగ్ధుల్ని చేశారు.











పర్మినెంటు కాక.. అరకొర జీతాలతో..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 12,751 గ్రామపంచాయతీల్లో 40వేల మందికిపైగా, మున్సిపాలిటీల్లో 62 వేల మంది కార్మికులు స్వీపర్లు, స్ట్రీట్‌లైట్ ఆపరేటర్లు, వాటర్‌మెన్లు, కారోబార్లు, బిల్‌కలెక్టర్లుగా పనిచేస్తున్నారు. ఈ కార్మికుల్లో ఎక్కువగా దళిత, అట్టడుగు సామాజిక తరగతి వారే ఉన్నారు. గ్రామపంచాయతీల్లో పనిచేసేవారిలో నేటికీ 90 శాతం కాంట్రాక్టు కార్మికులే. వీరికి కనీసవేతనాలు కాదు కదా నెలకు ఓ బియ్యం బస్తా కూడా రాని జీతంతోనే బతుకులీడుస్తున్నారు. జీపీ కార్మికులకు రూ.600 నుంచి గరిష్టంగా రూ.6 వేల వరకు వేతనం పొందుతున్నారు. మున్సిపాలిటీల్లో పనిచేసేవారిలో నూటికి 70 శాతం మంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోనే పనిచేస్తున్నారు. పాత మున్సిపాలిటీల్లో రూ.12వేలు, కొత్త మున్సిపాలిటీల్లో రూ.3 వేల నుంచి 4 వేల జీతాలతో సంసారాలను నెట్టుకొస్తున్నారు. మున్సిపాలిటీల్లో, జీపీలో ఒకే రకమైన పనిచేస్తున్నప్పటికీ వివిధ కేటగిరీల పేర్ల ముసుగు కప్పి జీతాల చెల్లింపులో భారీ వ్యత్యాసాలను చూపుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం వీరికి కనీస వేతనంగానీ, సమాన పనికి సమాన వేతనంగానీ దక్కట్లేదు. వచ్చే అరకొర వేతనాల్లోనూ కాంట్రాకర్లకు కొంత సొమ్ము చెల్లిస్తేగానీ పని కల్పించని దౌర్భాగ్య స్థితి నెలకొంది. ఇంకోవైపు ఈ రంగంలో పనిచేసేవాళ్లు ఎక్కువగా మహిళా కార్మికులే ఉండటం గమనార్హం. వీరంతా పైస్థాయి అధికారుల నుంచీ, కాంట్రాక్టర్ల నుంచీ లైంగిక వేధింపులను, ఇతరత్రా సమస్యలను ఎదుర్కొంటున్నారు. వీరికి సామాజిక భద్రతా స్కీములేవీ అమలుకావట్లేదు. పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర బెనిఫిట్స్ దక్కట్లేదు. ఇంత గొడ్డుచాకిరీ చేస్తున్నా పండగ, వారాంత సెలవులు కూడా వర్తించట్లేదు. ఒకవేళ కార్మికురాలు గనుక ప్రసూతి సెలవులు తీసుకుంటే ఉద్యోగం కోల్పోవాల్సిందే. వారికి ఎలాంటి సెలవులు కూడా ఇవ్వట్లేదు.

అందరూ హామీలిచ్చేవారే..పర్మినెంట్ చేసేవారేరీ...

టీడీపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలన్నీ ఎన్నికల సందర్భంగా పర్మినెంట్, తదితర హామీలను గుప్పిస్తూ వస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను సీఎంలుగానీ, మంత్రులుగానీ పరిష్కరించట్లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకనైనా తమ బతుకులు బాగుపడతాయని జీపీ, మున్సిపల్ కార్మికులు ఆశపడ్డారు. కానీ, వారి ఆశలు అడియాశలే అయ్యాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక 2015లో జీపీ కార్మికులు 42 రోజుల పాటు సమ్మె చేశారు. సమస్యలన్నీ పరిష్కరిస్తామనీ ఆ సందర్భంగా అప్పటి మంత్రి కేటీఆర్ హామీనిచ్చారు. అది బుట్టదాఖలైంది. 2018లో 33 రోజుల పాటు సమ్మె చేస్తే 8,500 వేతనం ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. నేటి వరకు కూడా దానిపై జీవో విడుదల కాలేదు.

హామీలను నెరవేర్చకపోవడంతోనే సమ్మెలో పాల్గొంటున్నాం : పాలడుగు భాస్కర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి

ఇది రాజకీయ సమ్మె కాదు. మోడీ సర్కారు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సమ్మె జరుగుతున్నది. సమ్మె డిమాండ్లలోని కనీస వేతనం, కాంట్రాక్టు వ్యవస్థ రద్దు, సామాజిక భద్రత కల్పన, నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ, తదితర డిమాండ్లన్నీ మున్సిపల్, జీపీ కార్మికులకు వర్తిస్తాయి. అందుకే ఈ సమ్మెలో గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ కార్మికులు 8,9 తేదీల్లో జరిగే సమ్మెలో పాల్గొనబోతున్నారు. వెంటనే కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి.

కాంగ్రెస్‌లో బాహాబాహి



(మొదటిపేజీ తరువాయి)

సమీక్షలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉత్తమ్, కుంతియాల వల్ల తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎంపీ సీటు కూడా గెలవలేదని అన్నారు. పొత్తులు, సీట్ల పంపకం ఆలస్యం వల్లే పార్టీ ఓడిపోయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదేసందర్భంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రకుంతియాపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలపై కుంతియాకు సీరియస్‌నెస్‌లేదని, కేంద్ర మాజీ మంత్రిగా పని చేసిన తాను ఫోన్ చేస్తే కూడా ఎత్తలేదని ఆరోపించారు. 'మిస్టర్ కుంతియా ఢిల్లీలో నీకంటే నాకే హోల్డింగ్ ఎక్కువగా ఉంది. నీస్థాయి ఏంది? ఇక్కడి నుంచి వెళ్లిపోకుండా ఇంకెందుకు ఉన్నావు' అంటూ పరుషపదజాలంతో దూషించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు బొల్లు కిషన్, మహేశ్‌కుమార్‌గౌడ్ జోక్యం చేసుకుని సర్వేను శాంతింప చేసే ప్రయత్నం చేశారు. నన్నేఆపుతావా? నీవెంత, నీబతుకెంత అంటూ బొల్లుకిషన్, మహేశ్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం పెరిగిపోవడంతో గల్లాలు పట్టుకుని కొట్టుకున్నారు.

సర్వే సస్పెన్షన్

సర్వే సత్యనారాయణ అనుచిత వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుని పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసింది. ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు టీపీసీసీ క్రమశిక్షణ విభాగం చైర్మెన్ కోదండరెడ్డి ప్రకటించారు. జాతీయ, రాష్ట్ర నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు బొల్లు కిషన్‌పై వాటర్ బాటిల్ విసిరారు. దీంతోపాటు అసభ్యకరంగా మాట్లాడారని, అందుకే వెంటనే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని నేతలు అంటున్నారు.

గాంధీభవన్‌లో రౌడీలను పెట్టుకున్నారు : సర్వే

నాయకుల అసమర్థతను ప్రశ్నిస్తే దాడులు చేయించడానికి గాంధీభవన్‌లో రౌడీలను పెట్టుకున్నారని సర్వే సత్యనారాయణ తీవ్ర స్థాయిలో ఖండించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కారణాలు చెబుతుంటే మహేశ్ గౌడ్, బొల్లు కిషన్‌లతో తనపై ఉత్తమ్ దాడి చేయించినట్టు ఆరోపించారు. పార్టీలో కొందరు రౌడీ మూకలు ఉన్నారని.. ఒకరిద్దరు దద్దమ్మలు తనపై దాడి చేశారని చెప్పారు. పార్టీ గెలుపొందడానికి తాను సలహాలు ఇస్తుంటే...ఇది నచ్చని వారు తనపై దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో ఏం జరుగుతుందో సోమవారం మరిన్ని వివరాలు వెల్లడిస్తానని చెప్పారు. అర్హత లేని ఉత్తమ్‌కు పీసీసీ అధ్యక్ష బాధ్యతలు ఇచ్చారని, ఆయన్ను పదవి నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

సర్వే వీధి రౌడీలా ప్రవర్తించారు : బొల్లు కిషన్

సర్వే సత్యనారాయణ వీధిరౌడీలా ప్రవర్తించారని, పార్టీ నేతలను తీవ్ర పదజాలంతో దూషించారని కిషన్ ఆరోపించారు. తెలంగాణ ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడానికి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి కుంతియాలే కారణమంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. మల్కాజ్‌గిరి సమీక్షా సమావేశంతో సర్వే కుంతియాను ఉద్దేశించి అసభ్యపదజాలంతో దూషించారని అన్నారు. ఇది సరికాదని చెప్పినందుకే తనను బూతులు తిట్టారన్నారు. తనపై వాటర్ బాటిల్‌తో దాడిచేశారని, వెంటనే ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించారన్నారు.

తమిళనాడులో ఘోర ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

ఢీకొట్టింది. దీంతో వ్యాన్‌లో ఉన్న నాగరాజు(40), శ్యాంసుందర్ గౌడ్(22), ఆంజనేయులు (42), కిష్టాగౌడ్(35), మహేష్ (26), కుమార్ (26), సాయి(22), సురేష్(30), ప్రవీణ్‌గౌడ్(25), వ్యాన్ డ్రైవర్ (40) మృతిచెందారు. రాజు, వెంకటేష్, నరేష్‌గౌడ్, భూమాగౌడ్, శ్రీశైలం తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉండగా చికిత్స నిమిత్తం స్థానికులు అక్కడి ఆస్పత్రికి తరలించారు. ప్రమాద వార్త తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ కలెక్టర్ ధర్మారెడ్డి అక్కడి కలెక్టర్‌తో మాట్లాడారు. గాయాలపాలైన వారికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

నర్సాపూర్ మండలంలో విషాదఛాయలు

అయ్యప్పమాల ధరించి దైవదర్శనం కోసం వెళ్లిన తమవారు ఇక రాలేరని కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఈ ఘటనతో నర్సాపూర్ మండల పరిధిలోని గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఖాజిపేట్, మంతూర్, రెడ్డిపల్లి, చిన్న చింతకుంట గ్రామాల్లో ప్రతి ఒక్కరూ శోకసంద్రంలో మునిగిపోయారు. 'మా ఆలనా పాలనా చూసే ఇంటి పెద్దదిక్కే చనిపోయాడు. నాకు కొడుకు, కూతురు చిన్నపిల్లలున్నారు. ఇక మాకు దిక్కెవరు?.' అని ఖాజిపేట గ్రామానికి చెందిన మృతుడు నాగరాజుగౌడ్ భార్య లక్ష్మి రోదనలతో అక్కడున్నవారు కంటతడి పెట్టారు.

సమాచారం సేకరించని పోలీసులు

ప్రమాదం మధ్యాహ్నం జరిగినా మృతులకు సంబంధించిన సమాచారం మెదక్ జిల్లా పోలీసుల వద్ద లేకపోవడం వారి నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తున్నది. వివరాలు సేకరించి మీడియాకు బాధ్యతగా తెలపాల్సిన అధికారులు సకాలంలో స్పందించలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పుడు ఫోన్ చేసి వివరాల కోసం ప్రయత్నించినా 'మళ్లీ చెబుతాం..' అనే మాటే వారి నోట వినిపించింది.

సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి

పుదుకొట్టై ఘటనపై సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. మృతిచెందిన అయ్యప్ప భక్తుల కుటుంబాలకు ఆయన సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు.

పొలంలో విషాదం

నవతెలంగాణ-వేమనపల్లి

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలుగాల్లో కలిసిపో యాయి. పంట పొలాలకు కొత్తలైన్ వేసేందుకు కరెంట్ సరఫరా నిలిపి వేయాలని సమాచారమిచ్చినా అధికా రులు జాగ్రత్త వహించలేకపోయారు. దీంతో విద్యుద్ఘాతానికి గురై ఇద్దరు రైతులు, విద్యుత్‌శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగి అక్కడికక్కడే విలవిలలాడి ఊపిరి విడిచారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. భారీ ప్రాణ నష్టం జరిగినా అధికారులు రాకపోవడంతో బంధువులు, గ్రామస్తులు పొలంలోనే ఆందోళనకు దిగారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం ముల్కాలపేటలో ఆదివారం జరిగింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముల్కాలపేట గ్రామానికి చెందిన టేగరి లచ్చన్న, రామగిరి పున్నం, గొడే వెంకటస్వామి, బోరుకుంటి పరిదేశి, గొడే రమేష్‌లు అదే గ్రామానికి చెందిన రాజన్న పొలం నుంచి విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ పంట పొలాలకు నీల్వాయి గ్రామం నుంచి 11కేవీ విద్యుత్ లైన్ ఉంది. కానీ కొత్తగా మరో స్తంభాన్ని ఏర్పాటు చేసుకోవాలనుకున్నారు. అందుకోసం కరెంటు సరఫరా నిలిపివేయాలని కాంట్రాక్టు ఉద్యోగి పై అధికారులకు చెప్పాడు. కానీ విద్యుత్ సరఫరా నిలిపివేయలేదు. ఈ క్రమంలో పనులు చేస్తుండగా స్తంభాన్ని వేసేందుకు యత్నించారు. సిమెంట్ స్తంభం పైభాగంలో తేలిన ఇనుపరాడ్‌కు అప్పటికే పాసింగ్‌లో ఉన్న విద్యుత్ వైర్లు తగిలాయి. కింద పొలంలో నీరు ఉండడంతో వారంతా విద్యుద్ఘాతానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో రైతులు రామయ్య(65), సురేందర్(20), విద్యుత్ శాఖ కాంట్రాక్టు ఉద్యోగి భీమ్‌రాం(35) అక్కడికక్కడే మృతిచెందారు. టేలకరి లచ్చన్న, రామగిరి పున్నం, వెంకటస్వామిలకు గాయాలయ్యాయి. క్షతగ్రాతులను మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసినా విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలానికి రాలేదు. దీన్ని నిరసిస్తూ మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పొలంలోనే ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలనీ, ఏఈని వెంటనే సస్పెండ్ చేయాలనీ డిమాండ్ చేశారు. ఘటనా స్థలాన్ని చెన్నూర్ సీఐ జగదీశ్వర్, నీల్వాయి ఎస్సై భూమేశ్, కోటపల్లి ఎస్సై వెంకన్నలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ శాఖ ఏడీ నాగేశ్వర్ అక్కడికి చేరుకుని బాధితులను పరామర్శించారు. పరిహారం వచ్చేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

కుల వివక్ష..?

(మొదటిపేజీ తరువాయి)

ఎదుర్కొంటున్నవారితోపాటు శిక్షలు పడినవారి లెక్కలు చూసినా ఈ వ్యత్యాసం కనిపిస్తుంది. 2014 ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం జైళ్లలో ఉన్న ఎస్సీలు 21.6 శాతం కాగా, ఎస్టీలు 12.4శాతం. వీరి జనాభా మొత్తం 24.4 శాతం(ఎస్సీలు 16.2 శాతం, ఎస్టీలు 8.2 శాతం) కాగా జైళ్లలో ఉన్నది 34 శాతం(21.2+12.4). ఆదివాసీల జనాభా 8.2 శాతం కాగా, జైళ్లలో ఉన్నది 12.4 శాతం. ఎస్సీ,ఎస్టీల జనాభాతో పోలిస్తే జైళ్లలో ఖైదీలుగా ఉన్న ఆ వర్గాల శాతం అత్యధికంగా ఉన్న రాష్ట్రాలు అస్సాం, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్. తమిళనాడులో ఎస్సీ,ఎస్టీల జనాభా 21.2 శాతం కాగా, ఆ వర్గాలు ఖైదీలుగా ఉన్నది 38.6 శాతం. అంటే వ్యత్యాసం 17.4 శాతం.

ఈ వర్గాలవారు అత్యధిక సంఖ్యలో జైళ్లలో మగ్గడానికి కారణాలేమిటో నివేదిక వెల్లడించింది. వీరికి సంబంధించిన కేసుల్లో పోలీస్ దర్యాప్తు ఆలస్యం కావడం, నిర్ణీత సమయంలో ఛార్జిషీట్లు దాఖలు చేయకపోవడం, విచారణ న్యాయస్థానాల సంఖ్య లేదా జడ్జిల సంఖ్య తక్కువగా ఉండటం కారణాలని నివేదికలో పేర్కొన్నారు. దళితులు,ఆదివాసీలపై నేరాలు మోపిన ఆధిపత్య కులాలు తమకున్న పలుకుబడితో పోలీస్ దర్యాప్తును ప్రభావితం చేయడం కూడా మరో కారణంగా నివేదిక స్పష్టం చేసింది. అకారణంగా అరెస్టులు, తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులపాలు చేయడం కూడా కుల వివక్షతో కూడిన మన సమాజంలో జరుగుతున్న సాధారణ పరిణామంగా అర్థం చేసుకోవాలి.

వ్యవస్థాగత లోపాలు

తగిన సంఖ్యలో జైలు అధికారులు లేకపోవడం వల్ల విచారణ ఖైదీలపై ఎప్పటికపుడు సమీక్షలు నిర్వహించలేకపోతున్నారు. నేర శిక్షాస్మృతిలోని సెక్షన్ 436 ఏ ప్రకారం జైళ్లలో విచారణ ఖైదీలుగా నిర్ణీత గడువు వరకే ఉంచాల్సి ఉంటుంది. ఛార్జిషీట్ వేయడంలో ఆలస్యమైతే వారిని బెయిల్‌పై విడుదల చేయాల్సి ఉంటుంది. అయితే, ఖైదీలపై సమీక్షలు జరిపే యంత్రాంగం తగినంతగా లేకపోవడం వల్ల వారు జైళ్లలోనే మగ్గాల్సి వస్తోంది. మంజూరైన జైలు అధికారుల పోస్టుల్లో 66.3 శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. ఆదివాసీలు, దళితుల్లో పేదరికం, నిరక్షరాస్యత, న్యాయ వ్యవస్థ పట్ల అవగాహన లేకపోవడం మరో కారణం. ఆయా కేసుల్లో బెయిల్ ఎలా పొందాలో తెలియకపోవడం, వారికి న్యాయ సహాయం అందించేవారు లేకపోవడం కూడా కారణాలు. వీరిపై నేరాలు మోపినవారు రాజకీయ పలుకుబడి ఉన్న ఆధిపత్య కులాల వారైనపుడు సాక్ష్యులు కూడా బెదిరింపులకు గురై తప్పుడు సాక్ష్యాలిచ్చే అవకాశాలు ఉండనే ఉన్నాయి. సమాజంలోని కుల వ్యవస్థ ప్రభావం అన్ని వ్యవస్థలపైనా సహజంగానే ఉంటుందనేది శాస్త్రీయమైన అవగాహన. వాస్తవ పరిశీలనలోనూ అదే నిజమని స్పష్టమవుతోంది.

పలు పంచాయతీలు ఏకగ్రీవం

- ప్రోత్సాహకంతో అభివృద్ధి సాధ్యమని గ్రామాల్లో తీర్మానం
- మొదట మౌలిక వసతులు కల్పించాలని ప్రజల విన్నపం

నవతెలంగాణ-యంత్రాంగం



పంచాయతీ పాలకవర్గాలను ఏకగ్రీవం చేస్తే వచ్చే ప్రోత్సాహకంతో మరింత అభివృద్ధి చేసుకోవచ్చని పలు గ్రామాలు ఏకగ్రీవ తీర్మానానికి సుముఖత చూపుతున్నాయి. అయితే గ్రామాల్లో మొట్టమొదట మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఆదివారం మహబూబాబాద్, వరంగల్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో పలు గ్రామాల్లో సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల పరిధి మొట్లతిమ్మాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా బిజ్జ స్వరూప, ఉప సర్పంచ్‌గా పాయం వీరస్వామి, మరో 8 మంది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్టు గ్రామస్తులు తెలిపారు. మండల కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో పూర్తి అటవీ ప్రాంతంలో ఉన్న గ్రామానికి రోడ్డుపై వంతెన సౌకర్యం కూడా లేదని తెలిపారు. వరంగల్ అర్బన్ జిల్లా ఎల్కతుర్తి మండలం శాంతి నగర్ సర్పంచ్‌గా బాసాని మేరీతో పాటు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే ఒడితెల సతీష్‌కుమార్, వ్యవసాయ సమన్వయ సమితి జిల్లా డైరెక్టర్ శ్రీపతి రవీందర్ గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం లోని సేవాలాల్ ఊరుతండా, వీర్నపల్లి మండలం లోని భూక్య తండా గ్రామపంచాయతీలకు సర్పంచ్‌ల ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవమైతే ప్రభుత్వం రూ.10లక్షలు, ఎమ్మెల్యే సొంత నిధుల నుంచి రూ.15లక్షల నిధులను కేటాయిస్తున్నారనీ, దీంతో తండాలు అభివృద్ధి చెందుతాయనే ఉద్దేశంత ఏకగ్రీవమైనట్టు గ్రామస్తులు తెలిపారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో నూతన పంచాయతీగా ఏర్పడ్డ హిమ్మత్‌రావుపేటకు సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనరల్ సర్పంచ్‌గా కొడిమ్యాల జడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి భర్త, సింగిల్ విండో చైర్మెన్ పునుగోటి కష్ణారావును ఏకగ్రీవం చేస్తూ గ్రామస్తులంతా ఆదివారం మూకు మ్మడిగా తీర్మానం చేశారు. అనంతరం గ్రామంలో 8 వార్డు సభ్యులను ఏకగ్రీవం చేశారు. అదేవిధంగా, మెట్‌పల్లి మండలంలో ఇటీవల ఆత్మకూరు గ్రామం నుంచి నూతన పంచాయతీగా విడిపోయిన పాటి మీద తండా ఎస్టీ మహిళకు రిజర్వ్‌కాగా గ్రామపంచాయతీ ఎన్నిక ఏకగ్రీవమైంది. సర్పంచ్‌గా జరుపుల బుజ్జి, ఉప సర్పంచ్‌గా బానవత్ మంతుతో పాటు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు గ్రామస్తుల తీర్మానించారు.

కాంగ్రెస్ నేతల 'విందు' భేటీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాజీ మంత్రి డికె అరుణ విందు ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిన నేపథ్యంలో నాయకులు, అభ్యర్థులను కలిసి మాట్లాడేందుకు విందు ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ పరిసర ప్రాంతంలోని ఓ రిసార్టులో విందు ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కె జానారెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, రాజగోపాల్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, పద్మావతి, మధుయాష్కీ, రేవంత్‌రెడ్డి, అద్దంకి దయాకర్, వంశీకృష్ణ, సర్వేసత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో డికె అరుణ మాట్లాడారు. ఇది విందు సమావేశం కాదన్నారు. అందరిని కలిసి మాట్లాడాలనుకుని సమావేశం పెట్టామన్నారు. 'ఎక్కడివాళ్ళు అక్కడే ఉండటం కంటే అందరం కలుద్దాం అనుకున్నాం' అని చెప్పారు. అన్ని జిల్లాలో పొత్తుతో లాభం ఉండదని ముందే చెప్పానన్నారు. టీడీపీ బలంగా ఉన్న చోట మాత్రమే లాభం జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తు లాభం లేదన్నారు.

పార్లమెంట్ ఎన్నికలో పొత్తులతో లాభం ఉండదని అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ అంశంపై చర్చ జరగలేదన్నారు. పొత్తుల వల్లే ఓడిపోయామని కాదు...ఎన్నో కారణాలు ఉన్నాయని వివరించారు. టీఆర్ఎస్ ఒక్కోచోట ఒక్కో లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ను ఓడించిందన్నారు. కంచుకోట లాంటి పాలమూరు జిల్లాలో కూడా కాంగ్రెస్ ఓటమి చూస్తేనే...ఏదో జరిగిందనే అనుమానం కలుగుతున్నదన్నారు. పార్టీ ప్రక్షాళనపై అధిష్టానం ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలన్నారు.

కాంగ్రెస్‌లో టీఆర్ఎస్ కోవర్టులు ఉన్నారు : సర్వే

పార్టీలో జరుగుతున్న విషయాలను ఎప్పటికప్పుడు టీఆర్ఎస్‌కు చేరవేసే కోవర్టులు కాంగ్రెస్‌లో ఉన్నారని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ చెప్పారు. నన్ను సస్పెండ్ చేసే అధికారం టీపీసీసీలో ఎవరికీ లేదన్నారు. డికె అరుణ విందుకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఉత్తమ్, కుంతియాలు టికెట్లు అమ్ముకున్నారని ఆరోపించారు. పూర్తి ఆధారాలతో ఒకటి రెండు రోజుల్లో అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానన్నారు.

కేరళలో 'కాషాయ' కాష్టం

(మొదటిపేజీ తరువాయి)

గాయాలయ్యాయి. దీంతోపాటు మడపీడికాయిల్‌లో ఉంటున్న సీపీఐ(ఎం) ఎమ్మెల్యే ఎ ఎన్. షంషేర్, ఆ పార్టీ కన్నూర్ జిల్లా మాజీ కార్యదర్శి పి. శశి ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు బాంబులు విసిరారు. కాగా, అయ్యప్ప ఆలయంలోకి మహిళలను అనుమతించడంపై గడిచిన ఐదు రోజులుగా ఆరెస్సెస్, బీజేపీలు వరుసగా ఆందోళనలు చేస్తున్నాయి. కన్నూరులో శుక్రవారం ఆరెస్సెస్ చేపట్టిన ర్యాలీ ఉద్రిక్తంగా మారిన సంగతి తెలిసిందే. ఈ ర్యాలీలో పలువురు దుండగులు పోలీసులపై రాళ్లు విసిరారు. దీంతో, ర్యాలీలకు అనుమతి నిరాకరిస్తూ రాష్ట్ర పోలీసు చీఫ్ లోక్‌నాథ్ బెహ్రా ఆదేశాలు జారీ చేశారు. ఇదిలాఉండగా, గత కొన్ని రోజులుగా కేరళలో హిందూత్వ శక్తుల అల్లర్ల నేపథ్యంలో.. ఇక్కడకు వెళ్లే పర్యాటకులు ఒకసారి మీడియా రిపోర్టులు చూసి వెళ్లాలని యూకే ట్రావెల్ అడ్వైజరీ బోర్డు తమ దేశ పర్యాటకులకు సూచించింది.

ఆలయంలోకి పదిమంది మహిళలు..!

అన్ని వయస్కుల మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతింపజేయాలన్న సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఇప్పటివరకు పదిమంది మహిళలు ఆలయ ప్రవేశం చేశారని కేరళ పోలీసులు వెల్లడించారు. వీరిలో ముగ్గురు మలేషియాకు చెందిన మహిళలు కాగా శ్రీలంకకు చెందిన ఒక మహిళ ఉన్నారు. గతేడాది సెప్టెంబర్ 28న సర్వోన్నత న్యాయస్థానం తీర్పు తర్వాత పలు హిందూత్వ సంఘాలు, బీజేపీ కలిసి ఈ అంశాన్ని వివాదం చేస్తున్నాయి. దీనిపై కేరళలో ఇప్పటికీ ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్రానికి చెందిన బిందు (42), కనకదుర్గ (41)లు కలిసి ఈనెల 2 తెల్లవారుజామున అయ్యప్పను దర్శించుకున్న విషయం తెలిసిందే. అయితే, వీరి కంటే ముందే జనవరి 1 ఉదయం మలేషియాలో ఉంటున్న ముగ్గురు తమిళనాడుకు చెందిన మహిళలు ఆలయాన్ని దర్శించుకున్నారని పోలీసులు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియో ఫుటేజీ కూడా లభ్యమైనట్టు వారు తెలిపారు. దర్శనం ముగించుకుని వస్తుండగా ఉదయం 10 గంటలకు పంబ సమీపంలో వీరు వెళ్తుండగా కెమెరాలలో రికార్డైనట్టు పోలీసులు చెబుతున్నారు.

శబరిమల ఉద్రిక్తతలపై నివేదిక ఇవ్వండి
– కేరళను కోరిన కేంద్ర హోంశాఖ

శబరిమలలో ఉద్రిక్తతలపై నివేదిక ఇవ్వాలని కేరళను కేంద్ర హోంశాఖ కోరింది. ఈనెల 2న అయ్యప్ప ఆలయంలో వెళ్లి ఇద్దరు మహిళలు దర్శనం చేసుకున్న తరువాత రాష్ట్రంలో పలుచోట్ల ఘర్షణలు తలెత్తాయి. ఇవికాస్తా హింసకు దారితీశాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జరిగిన అల్లర్లపై నివేదిక ఇవ్వాలని కేరళ ప్రభుత్వాన్ని కేంద్ర హోంశాఖ కోరింది. కాగా, రెండు రోజుల క్రితం ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన పి. సదాశివం.. రాష్ట్రంలో పరిస్థితిని ఆయనకు వివరించారు. హింసను అరికట్టడంలో కేరళ పోలీసులు విఫలమయ్యారన్న బీజేపీ వ్యాఖ్యలను ముఖ్యమంత్రి పినరయి విజయన్ కొట్టిపారేశారు. ఈ ఉద్రిక్తతలన్నీ ఆరెస్సెస్, బీజేపీలు సృష్టించినవేనని స్పష్టం చేశారు. అల్లర్లను పోలీసులు సమర్థవంతంగా ఎదుర్కొన్నారని.. శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా చూడటంలో పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారని ఆయన తెలిపారు. మోడీ పర్యటనకు ముందు కేంద్రం నివేదిక కోరడం వెనుక రాజకీయం దాగి ఉన్నదని వామపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఢిల్లీలోని కేరళ భవన్ ముందు హిందూత్వ శక్తులు ఆందోళనకు దిగాయి. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

భూమికోసం బెదిరిస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

మండల కేంద్రానికి చెందిన మేడికాల ముత్తవ్వ భర్త లింగయ్య 20 ఏండ్ల క్రితం అదే గ్రామానికి చెందిన భావ భూమయ్యతో కలిసి సర్వే నెంబర్ 582/ఆలో రెండెకరాల భూమి కొనుగోలు చేశారు. రెండకరాల భూమిని లింగయ్య అప్పట్నుంచి సాగు చేసుకుంటున్నాడు. ఆ భూమిని ఇటీవల భూమయ్య తన పేరు మీద పట్టాచేసుకున్నాడు. పదేండ్ల క్రితం భూమయ్య మరణించాడు. మూడేండ్ల కిందట భూమయ్య కుమారుడు తిరుపతి తన పేరుతో పట్టా చేయించుకున్నాడు. తిరుపతి స్థానిక పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భూమిని సాగు చేసుకుంటున్న ముత్తవ్వను 'ఈ భూమి నాది.. నువ్వెలా సాగు చేస్తున్నావ్..' అని ఆమెపట్ల సంవత్సర కాలంగా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. పలుమార్లు ముత్తవ్వను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించాడు. ఈ నేపథ్యంలో బాధితురాలు ముత్తవ్వను మళ్లీ ఆదివారం పోలీస్ స్టేషన్ పిలిపించాడు. ఆవేదనకు గురైన ఆమె తన వెంట తెచ్చుకున్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అక్కడే ఉన్న పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. ముత్తవ్వ ఫిర్యాదు మేరకు విచారణ జరిపించి న్యాయం చేస్తామని ఎస్ఐ రవి బాదితురాలికి హామీ ఇచ్చారు.

'కస్తూర్బా'లో ఫుడ్ పాయిజన్

నవతెలంగాణ- చేవెళ్ల

హాస్టల్‌లో భోజనం చేసిన విద్యార్థినులు ఉన్నట్టుండి అస్వస్థతకు గురయ్యారు. 67 మంది విద్యార్థినులు వాంతులు, వీరేచనాలు చేసుకుంటూ విలవిల్లాడారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని కస్తూర్బా వసతిగృహంలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ గురవయ్య, ఎస్సై రేణుక తెలిపిన వివరాల ప్రకారం... కస్తూర్బాగాంధీ పాఠశాలలో 200 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఎప్పటిలాగే శనివారం రాత్రి హస్టల్లో భోజనం చేశారు. తర్వాత సాలడ్ ఇచ్చారు. అయితే ఆదివారం ఉదయం ఒక్కసారిగా 67 మంది విద్యార్థినులకు వాంతులు, వీరేచనాలయ్యాయి. దీంతో కంగారుపడ్డ హాస్టల్ సిబ్బంది వారిని చేవెళ్లలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు 37 మందిని నగరంలోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థినుల పరిస్థితి నిలకడగా ఉందని, ఎలాంటి ప్రమాదమూ లేదని వైద్యులు తెలిపారు. విద్యార్థినుల వైద్య పరీక్షల నివేదికను ల్యాబ్‌కు పంపినట్టు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న బాలల హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు నర్సింహులు, శంకర్ చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు.

న్యాయం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎదుర్కొంటున్నవారితోపాటు శిక్షలు పడినవారి లెక్కలు చూసినా ఈ వ్యత్యాసం కనిపిస్తుంది. 2014 ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం జైళ్లలో ఉన్న ఎస్సీలు 21.6 శాతం కాగా, ఎస్టీలు 12.4 శాతం. వీరి జనాభా మొత్తం 24.4 శాతం(ఎస్సీలు 16.2 శాతం, ఎస్టీలు 8.2 శాతం) కాగా జైళ్లలో ఉన్నది 34 శాతం(21.2+12.4). ఆదివాసీల జనాభా 8.2 శాతం కాగా, జైళ్లలో ఉన్నది 12.4 శాతం. ఎస్సీ,ఎస్టీల జనాభాతో పోలిస్తే జైళ్లలో ఖైదీలుగా ఉన్న ఆ వర్గాల శాతం అత్యధికంగా ఉన్న రాష్ట్రాలు అస్సాం, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్. తమిళనాడులో ఎస్సీ,ఎస్టీల జనాభా 21.2 శాతం కాగా, ఆ వర్గాలు ఖైదీలుగా ఉన్నది 38.6 శాతం. అంటే వ్యత్యాసం 17.4 శాతం. ఈ వర్గాలవారు అత్యధిక సంఖ్యలో జైళ్లలో మగ్గడానికి కారణాలేమిటో నివేదిక వెల్లడించింది. వీరికి సంబంధించిన కేసుల్లో పోలీస్ దర్యాప్తు ఆలస్యం కావడం, నిర్ణీత సమయంలో ఛార్జిషీట్లు దాఖలు చేయకపోవడం, విచారణ న్యాయస్థానాల సంఖ్య లేదా జడ్జిల సంఖ్య తక్కువగా ఉండటం కారణాలని నివేదికలో పేర్కొన్నారు. దళితులు,ఆదివాసీలపై నేరాలు మోపిన ఆధిపత్య కులాలు తమకున్న పలుకుబడితో పోలీస్‌దర్యాప్తును ప్రభావితం చేయడం కూడా మరో కారణంగా నివేదిక స్పష్టం చేసింది. అకారణంగా అరెస్టులు, తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులపాలు చేయడం కూడా కుల వివక్షతో కూడిన మన సమాజంలో జరుగుతున్న సాధారణ పరిణామంగా అర్థం చేసుకోవాలి.

వ్యవస్థాగత లోపాలు

తగిన సంఖ్యలో జైలు అధికారులు లేకపోవడం వల్ల విచారణ ఖైదీలపై ఎప్పటికపుడు సమీక్షలు నిర్వహించలేకపోతున్నారు. నేర శిక్షాస్మృతిలోని సెక్షన్ 436 ఏ ప్రకారం జైళ్లలో విచారణ ఖైదీలుగా నిర్ణీత గడువు వరకే ఉంచాల్సి ఉంటుంది. ఛార్జిషీట్ వేయడంలో ఆలస్యమైతే వారిని బెయిల్‌పై విడుదల చేయాల్సి ఉంటుంది. అయితే, ఖైదీలపై సమీక్షలు జరిపే యంత్రాంగం తగినంతగా లేకపోవడం వల్ల వారు జైళ్లలోనే మగ్గాల్సి వస్తోంది. మంజూరైన జైలు అధికారుల పోస్టుల్లో 66.3 శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. ఆదివాసీలు, దళితుల్లో పేదరికం, నిరక్షరాస్యత, న్యాయ వ్యవస్థ పట్ల అవగాహన లేకపోవడం మరో కారణం. ఆయా కేసుల్లో బెయిల్ ఎలా పొందాలో తెలియకపోవడం, వారికి న్యాయ సహాయం అందించేవారు లేకపోవడం కూడా కారణాలు. వీరిపై నేరాలు మోపినవారు రాజకీయ పలుకుబడి ఉన్న ఆధిపత్య కులాల వారైనపుడు సాక్ష్యులు కూడా బెదిరింపులకు గురై తప్పుడు సాక్ష్యాలిచ్చే అవకాశాలు ఉండనే ఉన్నాయి. సమాజంలోని కుల వ్యవస్థ ప్రభావం అన్ని వ్యవస్థలపైనా సహజంగానే ఉంటుందనేది శాస్త్రీయమైన అవగాహన. వాస్తవ పరిశీలనలోనూ అదే నిజమని స్పష్టమవుతోంది.

మహారాష్ట్ర వాటా 24 శాతానికి పైనే..

(మొదటిపేజీ తరువాయి)

వాటాలో ఇది 24.6శాతం అన్న మాట. బ్యాంకుల నుంచి మహారాష్ట్ర పొందిన మొత్తం రుణాల్లో అధికభాగం 39.6శాతం(8.53 లక్షల కోట్లు)మేర రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కేటాయించింది. ఇక మిగిలిన రంగాలలో నిర్మాణం(9.15శాతం), బేసిక్ మెటల్స్(6.24శాతం), విద్యుత్, గ్యాస్, నీరు(5.44శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కాగా, వ్యవసాయరంగంపై మాత్రం బీజేపీ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఈ రంగంపై కేవలం 4.3శాతం(రూ.92,707 కోట్లు) మాత్రమే ఆ రాష్ట్రం కేటాయించింది. వ్యవసాయ రంగానికి దేశంలో కేటాయించిన సగటు 13.68శాతం కంటే తక్కువగా కేటాయించడం గమనార్హం.

ధాన్యపు కొనుగోళ్లకు 6,291కోట్ల చెల్లింపులు

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఈ ఏడాది ఖరీఫ్‌లో అంచనాలకు మించి 7.25 లక్షల మంది రైతుల నుంచి 37లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇందుకు సంబంధించి రూ.6,291 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ తెలిపారు. రానున్న రోజుల్లో కూడా రాష్ట్రంలో భారీ ఎత్తున ధాన్యం దిగుబడి అవుతున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు, కనీస మద్దతు ధర చెల్లింపుల్లో రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మిల్లర్ల నుంచి సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్)ను త్వరితగతిన తీసుకోవాలని ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్‌లో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్లతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ గారు మాట్లాడుతూ, మిల్లర్లకు చెల్లించే బకాయిలు, ముఖ్యంగా మిల్లింగ్ ఛార్జీల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇదే సమయంలో బియ్యం (సీఎంఆర్) ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సంస్థలో ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో పౌరసరఫరాల శాఖ అధికారులతో మరింత సమన్వయంతో పనిచేసి, గోదాముల్లో నిరుపయో గంగా ఉన్న సరుకులను తక్షణమే టెండర్ ద్వారా విక్రయించాలన్నారు. అలాగే, బియ్యం నిల్వల కోసం తీసుకునే గోదాముల లీజ్ ధరల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని కమిషనర్ అకున్ సబర్వాల్ తెలిపారు.

ఎంఐఎం సభ్యుడు ప్రొటెం స్పీకర్‌గా ఉంటే ప్రమాణస్వీకారం చేయను

- ఎంపికపై కేసీఆర్ ఆలోచించాలి : రాజాసింగ్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ఎప్పుడూ వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తాజాగా మరో వ్యాఖ్య చేశారు. ప్రోటెం స్పీకర్‌గా ఎంఐఎం నేత, చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్‌ఖాన్‌ను నియమించడాన్ని రాజాసింగ్ తప్పుబట్టారు. ఆయన ప్రొటెం స్పీకర్‌గా ఉంటే అసెంబ్లీలో అడుగుపెట్టనని, ప్రమాణ స్వీకారం చేయబోనని ప్రకటించారు. ముంతాజ్‌ఖాన్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించాలన్న తన నిర్ణయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ వెనక్కి తీసుకుంటే తెలంగాణకు మంచిదని సూచించారు. ఈ అంశంపై రాజాసింగ్ మాట్లాడిన ఓ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది.


సెన్సెక్స్ ▲ 181.39 35,695 | నిఫ్టీ ▲ 55 10,727 | డాలరుకు రూపాయి విలువ 69.73




బంగారం(10.గ్రా) రూ. 31,476



వెండి (కేజీ) రూ. 39,201



కోడిగుడ్లు (వందకి)			
హైదరాబాద్	433	విజయవాడ	441
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
వరంగల్	433	ముంబయి	484



మాల్‌వేర్ అటాక్!

'వాట్సాప్ గోల్డ్' పేరిట మెసేజ్ వైరల్

- లింక్ పై క్లిక్ చేస్తే, ఫోన్ డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకే!
- ఆపిల్ వాయిస్ ఫిషింగ్.. కాల్ బ్యాక్ చేయమని మెసేజ్
- ఆపిల్ అధికారిక కస్టమర్ కేర్ ఫోన్ నంబర్ ను వాడుతున్న దుండగులు
- మాల్‌వేర్ పట్ల అప్రమత్తత అవసరం అంటున్న నిపుణులు

సైబర్ నేరస్థుల ఆగడాలు నయా పద్ధతులకు తెరతీస్తూ... మాల్‌వేర్ వైరస్‌ల వ్యాప్తిని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఫోన్ సంస్థల అధికారిక నంబర్ల నుంచి కాల్స్ చేయడం, తాజా అప్‌డేట్ వెర్షన్ అంటూ ఫోన్ డేటాను దొంగిలించడం ఇందులో భాగమే!



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

'వాట్సాప్ గోల్డ్' మళ్ళీ వచ్చింది

'ధనవంతుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన 'వాట్సాప్ గోల్డ్' వెర్షన్ లీక్ అయింది. మీకు కూడా ఆ సేవలు ఉచితంగా కావాలంటే, ఈ లింక్ పై క్లిక్ చేయండి' అంటూ 2016 సంవత్సరంలో 'వాట్సాప్ గోల్డ్' పేరిట వైరల్ అయిన మాల్‌వేర్ మెసేజ్‌లు ప్రస్తుతం మళ్ళీ చక్కర్లు కొడుతున్నాయి. ఐతే, మెసేజ్ సారాంశం మాత్రం మారింది. ఏదో యూజర్ కు మేలు చేస్తున్నట్టు, మరుసటి రోజు విడుదల కాబోతున్న మాల్‌వేర్ వీడియో నుంచి అలర్ట్ చేస్తున్నట్టు పేర్కొంటున్న ఈ భయంకరమైన వైరస్ మెసేజ్ ఇప్పుడు మళ్ళీ పంజా విసురుతోంది. 'వాట్సాప్ గోల్డ్' పేరుతో వచ్చే ఎటువంటి లింక్స్ పై క్లిక్ చేయొద్దని, సైబర్ నేరగాళ్లు సృష్టించిన ఈ వైరస్ ఫోన్ లో చేరితే, ఫోన్ లో నిక్షిప్తమైన వ్యక్తిగత వివరాలు, కాంటాక్ట్స్, బ్యాంక్ అకౌంట్, క్రెడిట్ కార్డు ఇలా ఫోన్ డేటా అంతా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్ళిపోయే ప్రమాదమున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అధికారిక నంబర్ నుంచే!

ఆపిల్ ఐఫోన్ ప్రమాదంబారిన పడటం ఉండదని, మాల్‌వేర్ ప్రభావితం సదరు మొబైల్ పై పనిచేయదని చాలా మంది భావిస్తారు. ఐతే, ఏకంగా ఆపిల్ అఫీషియల్ కస్టమర్ కేర్ ఫోన్ నంబర్ నుంచే వినియోగదారులకు వాయిస్ ఆధారిత మెసేజ్ లు, కాల్స్ వస్తుండటం ఇటీవల ఎక్కువవుతోంది. నిజంగా, అవి కంపెనీ నుంచి వచ్చే కాల్స్, మెసేజ్ లు ఐతే పర్వాలేదు. కానీ, వాటిని చేస్తున్నది సైబర్ నేరగాళ్ళని ఇటీవల తేలింది. వాయిస్ ఫిషింగ్ కాల్ వస్తూనే, కాల్ బ్యాక్ చేయమనే మెసేజ్ కూడా యూజర్ ఫోన్ లోకి వస్తోంది. సదరు నంబర్ కు కాల్ బ్యాక్ చేస్తే, యూజర్ల ఫోన్ డేటా నేరగాళ్ళ చేతుల్లోకి వెళ్తుంది. యూజర్ ఫోన్ డేటా దొంగిలించడంలో భాగంగానే ఈ వాయిస్ ఫిషింగ్ కు దుండగులు పాల్పడుతున్నట్టు సైబర్ నిపుణులు చెబుతున్నారు. కాగా, గత సంవత్సరం వీవీఐపీ ఐఫోన్లే టార్గెట్ గా, ఓ మిస్టరీ మాల్‌వేర్ ఇండియాపై అటాక్ చేసినట్టు సిస్కో టాలోస్ కమర్షియల్ థ్రెట్ ఇంటెలిజెన్స్ గ్రూప్ మాల్‌వేర్ రీసెర్చర్లు, అనాలిస్టులు పేర్కొనడం విదితమే!

చిత్తశుద్ధి ఉంటే, లాభాల పంటే!

ఏఏఐ నిర్వహణలోని 94 విమానాశ్రయాలు నష్టాల్లో..

"రానున్న 10 -15 సంవత్సరాల్లో దేశంలో కొత్తగా మరో వంద విమానాశ్రయాలు నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోందని, ఇందుకు సుమారు రూ. 4.2 లక్షల కోట్లు పెట్టుబడులు అవసరమవుతాయ"ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి సురేశ్ ప్రభు గతంలో ఆర్భాటంగా ప్రకటించారు. ఐతే, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సారథ్యంలో నిర్వహించబడుతూ.. నష్టాల ఊబిలో కూరుకుపోతున్న విమానాశ్రయాలకు జవసత్వాలు నింపకుండా.. ఈ ఆర్భాటపు ప్రకటనలు ఎందుకని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నష్టాలు పూడ్చే అవకాశం ఉన్నప్పటికీ, సర్కారు మొద్దు నిద్ర

- 'అవసరమైన చర్య'ల పేరుతో పీపీపీ విధానంపై ప్రభుత్వం చూపు?
- అంతర్జాతీయ స్థాయిలో పోటీపడలేక చతికిలపడిన పీపీపీ విమానాశ్రయాలు
- కార్గో సేవల పెంపు, ఖాళీ భూముల వినియోగాన్ని పెంచడం తదితరాలపై దృష్టిపెట్టని అధికారులు

'నవతెలంగాణ' ప్రత్యేక పరిశీలనలో వెలుగుచూసిన వాస్తవాలు..





కడవేర్గు

గడచిన ఆర్థిక సంవత్సరం (2017-18)లో దేశంలో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 129 ఎయిర్‌పోర్టులలో 94(72.86%) విమానాశ్రయాలు నష్టాల్లో ఉన్నాయని పౌర విమానయాన శాఖ మంత్రి సురేష్ ప్రభు తాజాగా పేర్కొన్నారు. సంబంధిత విమానాశ్రయాల కోసం వెచ్చించిన మొత్తాలకు అనుగుణంగా రాబడులను ఆర్జించకపోవడమే నష్టాలకు కారణమని.. నష్టాలను తగ్గించుకునేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నట్టు ఈ సందర్భంగా ప్రభు పేర్కొన్నారు. 'అవసరమైన చర్యలు' అంటే విమానాశ్రయాలను ప్రయివేటీకరణ చేస్తారా? అనే సందేహం ఇప్పుడు పలువురిలో కలుగుతోంది. దీనికి కారణం లేకపోలేదు.. గత నవంబర్ నెలలో దేశంలోని ఆరు విమానాశ్రయాలను (అహ్మదాబాద్, జైపూర్, లక్నో, గౌహతి, తిరువనంతపురం, మంగుళూరు ఇవన్నీ లాభాల బాటలో ఉన్నవే) పీపీపీ(పబ్లిక్ ప్రయివేట్ పార్ట్‌నర్‌షిప్)కింద నిర్వహించడానికి ఉద్దేశించిన ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలపడం.. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వందలాది ఏఏఐ(ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఉద్యోగులు నిరసనలు చేపట్టడం తెలిసిందే. కాగా, గత ఏడాది సైతం ఏఏఐ నిర్వహణలోని దాదాపు 90శాతం విమానాశ్రయాలు నష్టాలను చవిచూడటం గమనార్హం.



నష్టాలు ఎందుకు?

ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యం ద్వారా అధిక రెవెన్యూ, విమానాశ్రయాల అభివృద్ధి జరుగుతుందని వాదిస్తోన్న ప్రభుత్వ పెద్దలకు.. అదే పని సర్కారుగా తామెందుకు చేయలేకపోతున్నామోనన్న సోయి మాత్రం ఉండట్లేదు. ఇప్పటి వరకు పీపీపీ పద్ధతిలో నిర్వహించబడుతోన్న ఢిల్లీ, ముంబయ్, బెంగుళూరు, హైదరాబాద్ మరియు కోచి విమానాశ్రయాలు ఎంత మేర లాభాలను ఆర్జించాయో, ప్రపంచ స్థాయి ర్యాంకుల్లో సదరు ఎయిర్‌పోర్టుల స్థాయి ఏమిటో బహిరంగ రహస్యమే! ఇదే విషయంపై 'నవతెలంగాణ' ప్రత్యేక పరిశీలన చేపట్టింది. ప్రస్తుతం.. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధ్వర్యంలో నిర్వహించబడుతోన్న 129 ఎయిర్‌పోర్టులలో సగం కంటే ఎక్కువ విమానాశ్రయాల్లోని ఖాళీ భూములు వినియోగంలో లేక వృథాగా పడి ఉన్నాయి. ఇక, అధిక రాబడినిచ్చే కార్గో సేవలకు ప్రముఖ విమానాశ్రయాల్లో సైతం కావలసినన్ని ప్రత్యేక టర్మినల్స్ లేకపోవడం ప్రస్తావనార్హం. ఇవి గాక, నాన్ ఆపరేషనల్ ఎయిర్ పోర్ట్స్ ను వాడుకలోకి తీసుకురావడంలో విమానయాన శాఖ అలసత్వం , ప్రయివేట్ పార్కింగ్ ఛార్జీలను సవరించడం, టర్మినల్ ఉపయోగాన్ని మరింత వృద్ధి పరచడం, ఖాళీ విమానాశ్రయ భూముల వినియోగం చేపట్టడం, కార్గో సేవలను మరింత పెంచడం వంటి విషయాల్లో మన అధికారులు అంతగా చిత్తశుద్ధి కనబర్చడం లేదనేది సుస్పష్టమవుతోంది. విదేశాల్లోని విమానాశ్రయాలను అభివృద్ధి చేయబోతున్నామని ప్రకటించుకుంటున్న ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులు.. స్వదేశీ ఎయిర్‌పోర్టులను పూర్తి స్థాయిలో వినియోగించుకొని లాభాలబాట పడితే బాగుంటుందని సదరు రంగానికి చెందిన విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఆసక్తికర అంశాలు

- విమాన రాకపోకలకు సంబంధించి విమానాశ్రయాల్లో ఇచ్చే అనౌన్స్‌మెంట్ లను స్థానిక భాషలోనూ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. అంటే, తొలుత స్థానిక భాషలో ప్రకటన ఇచ్చి తర్వాత హిందీ, ఇంగ్లీషులో అనౌన్స్‌మెంట్ ఇస్తారన్న మాట!
- ప్రయివేటు సంస్థల మాదిరి విదేశాల్లో విమానాశ్రయాల అభివృద్ధికి నడుంబిగించిన ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా.. తొలుత మయన్మార్‌లోని కలాయ్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయనున్నట్టు ప్రకటించింది.
- దేశంలో కొత్తగా ఏర్పాటు చేసే 100 విమానాశ్రయాలను ప్రభుత్వ - ప్రయివేట్ పద్ధతి (పీపీపీ)లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉద్యోగ కల్పనలో రిజర్వేషన్లు లేకపోవడం, కార్మిక హక్కులకు భంగం కలిగే అవకాశం తదితరాల నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని ఏఏఐ సిబ్బంది వ్యతిరేకిస్తున్నారు.

పంచాయతీ ఎన్నికలకు నేటి నుంచి మొదటి విడత నామినేషన్లు స్వీకరణ

- తొలి విడతలో 39 రెవెన్యూ డివిజన్లు, 197 మండలాల పరిధిలో ఎన్నికలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామాల్లో "పంచాయతీ" ఎన్నికల కోలాహలం మొదలైంది. ఈ నెల 21న మొదటి విడతలో జరిగే 4,480 గ్రామ పంచాయతీలు, 39,832 వార్డుల ఎన్నికలకు గాను సోమవారం రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటీసు జారీ చేస్తారు. అనంతరం తొలి విడత నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానుంది. ఈ నెల 9వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల పరిశీలన, ఆ తర్వాత అర్హులైన అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల అప్పీళ్లను స్వీకరించి, 12న వాటిని పరిష్కరిస్తారు. 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను ఉపసంహరణతో నామినేషన్ల పర్వం ముగుస్తుంది. అనంతరం బరిలో నిలిచిన అభ్యర్థులను జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటిస్తారు. 21న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తొలి విడత పోలింగ్, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితాలు వెల్లడిస్తారు. ఆ వెంటనే ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి విడతలో 39 రెవెన్యూ డివిజన్లు, 197 మండలాల పరిధిలో ఎన్నికలు జరగనున్నాయి.

సమ్మెకు అన్నదాతల సై..

- రైతు సంఘాల సంపూర్ణ మద్దతు
- కార్మిక సంఘాలకు అన్ని వర్గాల వెన్నుదన్ను..



న్యూఢిల్లీ : కార్మికుల హక్కులను హరించివేసేలా కేంద్రం చేస్తున్న కుట్రలను నిరసిస్తూ ఈనెల 8, 9 తేదీల్లో కార్మిక సంఘాలు చేపట్టనున్న సమ్మెకు అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. బ్యాంకు ఉద్యోగులు కూడా ఇటీవల సమ్మెకు మద్దతు ప్రకటించగా.. తాజాగా రైతు సంఘాలు కూడా ఆ జాబితాలో చేరాయి. కార్మిక సంఘాల రెండు రోజుల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, అంతేకాక.. దేశవ్యాప్తంగా 8, 9 తేదీల్లో రైతులు వివిధ ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలిండియా కిసాన్ సభ(ఏఐకేఎస్), భూమి అధికార్ ఆందోళన్(బీఏఏ) స్పష్టం చేశాయి. సమ్మె రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఆందోళనలు, రైల్‌రోకో, రాస్తారోకోలు నిర్వహించనున్నట్టు ఏఐకేఎస్ జనరల్ సెక్రెటరీ హన్నన్ మొల్లా తెలిపారు. మోడీ సర్కారు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికులు, ఉద్యోగులు, సాధారణ పౌరులు ఆందోళనలు చేస్తున్నారని సీపీఐ అనుబంధ రైతుసంఘం నేత అటుల్ కుమార్ అంజన్ తెలిపారు. 8, 9 తేదీల్లో సమ్మెను జయప్రదం చేసేందుకుగానూ రహదారుల దిగ్బంధం, ఆందోళనలు, నిరసన సభల్లో రైతులు పాల్గొంటారని చెప్పారు. ఆర్థిక సంక్షోభం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, తదితర సమస్యలపై కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన సమ్మెలో భాగంగా ప్రభుత్వరంగ ఉద్యోగులు, అసంఘటితరంగ కార్మికులు, బ్యాంకు, ఇన్సూరెన్స్ కంపెనీల ఉద్యోగులు ఆందోళనలకు సిద్ధమవుతున్నారని సీఐటీయూ జనరల్ సెక్రెటరీ తపన్‌సేన్ తెలిపారు.

12 డిమాండ్లూ న్యాయసమ్మతమైనవే

బీఎంఎస్ అసత్య ప్రచారం సరిగాదు

- మోడీ వచ్చాక పబ్లిక్ సెక్టార్ ప్రయివేటీకరణ వేగవంతం
- అన్ని ట్రేడ్‌యూనియన్లూ సమ్మెలో పాల్గొనాలి : టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'దేశవ్యాప్తంగా ఈ నెల 8,9 తేదీల్లో జరిగే సార్వత్రిక సమ్మెపై బీజేపీ అనుబంధ కార్మిక సంఘం బీఎంఎస్ అసత్య ప్రచారాన్ని మానుకోవాలి. సమ్మె డిమాండ్లలోని 12 న్యాయసమ్మతమైనవే. గతంలో ఇవే డిమాండ్లతో సమ్మె చేపట్టినప్పుడు అన్ని కార్మిక సంఘాలతో కలిసి బీఎంఎస్ కూడా పాల్గొన్న విషయాన్ని మర్చిపోవద్దు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నది కదా అని రాజకీయ కోణంలో కార్మికుల సమ్మెను తప్పుపట్టడం సరిగాదు. అన్ని ట్రేడ్ యూనియన్లూ సమ్మెలో పాల్గొనాలి' అని టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబు యాదవ్ పిలుపునిచ్చారు. 8,9 తేదీల్లో చేపట్టనున్న సమ్మె నేపథ్యంలో నవ తెలంగాణ ప్రతినిధికి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

ములాఖత్

ప్రశ్న : మోడీ సర్కారు వచ్చాక కార్మిక రంగం పరిస్థితి ఏంటి?

మోడీ సర్కారు వచ్చాక కార్మిక రంగంపై దాడి తీవ్రమైంది. పెద్దపెద్ద పరిశ్రమల యాజమాన్యాలకు లబ్ది చేకూర్చేలా కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కుట్రకు పూనుకుంది. పబ్లిక్ సెక్టార్‌ను నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకుంది. అప్పులు చేయడం..ఎగ్గొట్టం...విదేశాలకు చెక్కేయటం వంటి పనులు చేస్తున్న కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నది. కార్మిక సంఘాల కార్యకలాపాలను దెబ్బతీస్తున్నది. కార్మిక సంఘాలతో సమస్యలపై చర్చించే ధోరణిని పక్కన పడేసింది. మరోవైపు పబ్లిక్ సెక్టార్‌ను ప్రయివేటుపరం చేసేందుకు ఓ శాఖనే ప్రత్యేకంగా పెట్టుకుని ముందుకుసాగుతున్నది. ఎఫ్‌డీఐల రాకకు ద్వారాలను బార్లా తెరిచింది. ఈ నిర్ణయాల వల్ల కార్మికులు రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. ఇలాంటి పరిస్థితుల్లో కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి మోడీ సర్కారు విధానాలకు వ్యతిరేకంగా గొంతెత్తి పోరాడాల్సిన అవసరముంది. అందుకే మేం కూడా ఈ సమ్మెలో పాల్గొంటున్నాం.

ప్రశ్న : ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల విషయంలో మీరేమంటారు?

ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, తదితర పథకాలన్నీ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినవి. ప్రారంభంలో హడావుడి చేసే కేంద్రం ఆ తర్వాత వాటిని పక్కనపడేయటం కేంద్రానికి అలవాటుగా మారింది. చాలా పథకాల్లో పనిచేసేవారికి గౌరవ వేతనాలు కూడా ఇవ్వట్లేదు. సాక్షర భారత్‌ను పక్కనపడేసింది. ఇప్పుడు ఆ పథకాలనే నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నది. అందుకే వారు కూడా సమ్మెలో పాల్గొంటున్నారు.

ప్రశ్న : సమ్మె సందర్భంగా ఏయే కార్యక్రమాలు చేపట్టబోతున్నారు?

ఇప్పటికే సమ్మె సన్నాహక సదస్సులో, రౌండ్‌టేబుల్ సమావేశాల్లో పాల్గొన్నాం. రెండు రోజుల సమ్మెలో అన్ని సంఘాలను కలుపుకుని ముందుకెళ్తాం. ప్రదర్శనలు, నిరసన కార్యక్రమాలు చేపడతాం. సింగరేణి, ఆర్టీసీలోని మా అనుబంధ సంఘాలు సమ్మెకు సంఘీభావం తెలుపుతాయి. భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపడతారు.

15లక్షల మంది విద్యుత్ కార్మికులు సమ్మెకు సిద్ధం

- 8, 9న కదం తొక్కనున్న బ్యాంక్ ఉద్యోగులు, రవాణా కార్మికులు



న్యూఢిల్లీ: మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పలురంగాల కార్మికులు ఈ నెల 8, 9న సార్వత్రిక సమ్మెకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే 15లక్షల మంది ప్రభుత్వ విద్యుత్ ఉద్యోగులు(ఇంజనీర్లుసహా) ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్(ఎన్‌సీసీఓఈఈఈ) బ్యానర్ కింద నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పవర్‌మెన్ సమ్మెకు పిలుపునిచ్చింది. కేంద్ర సర్కారు అవలంభిస్తున్న ప్రయివేటీకరణ విధానాలు, ఎలక్ట్రిసిటీ (సవరణ) 2018 బిల్లును వ్యతిరేకించడంతోపాటు కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు వంటి పలుడిమాండ్లతో వారు సమ్మెకు దిగనున్నారు. ఏఐపీఈఎఫ్, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ పవర్ డిప్లొమా ఇంజనీర్స్, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్, ఇండియన్ నేషనల్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఆల్ ఇండియా మెన్ ఫెడరేషన్ సహా పలుసంఘాలు ఎన్‌సీసీఓఈఈఈలో భాగంగా ఉన్నాయి. కాగా, ఈ రెండు రోజులు సార్వత్రిక సమ్మెకు దిగనుండటంతో విద్యుత్ వినియోగదారులు పలుసమస్యలనెదుర్కొనవచ్చని ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ చైర్మెన్ శైలేంద్ర దుబే తెలిపారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎమ్ఎస్, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఏఐసీసీటీయూ, ఎస్ఈడబ్ల్యూఏ, ఎల్‌పీఎస్, యూటీయూసీ తదితర 10 జాతీయ కార్మిక సంఘాలు ఉమ్మడిగా గతేడాది సెప్టెంబర్ 28న నిర్వహించిన జాతీయ కార్మిక సదస్సులో ఈ నెల 8, 9 తేదీల్లో సమ్మెకు పిలుపినిచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగులు ఈ సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నారు. ఈ నిర్ణయాన్ని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్, బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా.. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ తెలిపినట్టు ఐడీబీఐ ఓ రిపోర్టులోపేర్కొంది. కాగా, కర్నాటక స్టేట్ రోడ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (కెఎస్ఆర్టీసీ), బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ సహా బెంగుళూరులో ప్రయివేటు టాక్సీలు, ఆటో కార్మికులు ఈ సమ్మెకు మద్దతినిస్తున్నట్టు తెలిపారు.

10న అన్నదాతల ఆందోళన:

గతేడాది అక్టోబర్ 2న చేపట్టిన పాదయాత్రలో లేవనెత్తిన డిమాండ్లను మోడీ ప్రభుత్వం విస్మరించిందని అన్నదాతలు ఈ నెల 10న మరో ఆందోళనకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా రద్దీగా ఉండే ఢిల్లీ-డెహ్రాడూన్ రహదారిని దిగ్బంధం చేయనున్నట్టు భారతీయ కిసాన్ యూనియన్(బీకేయూ) తెలిపింది. డీజిల్ ధరలు తగ్గించాలని, పదేండ్లకుపైగా వినియోగంలో ఉన్న వాహనాలను నిషేధించాలని ఎన్జీటీ వెలువరించిన ఉత్తర్వుల రద్దు చేయాలని, యూపీలో చెరకు రైతులకు పంట బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నది. అభివృద్ధి పనులకోసం స్వాధీనం చేసుకున్న తమ భూముల పరిహారం ఇంకా అందించలేదని, ఆ మొత్తాలను వెంటనే విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బహిష్కరణలపై పోలీసుల అలసత్వం

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములు ఆగ్రహం

- మారంపల్లిలో ఎట్టకేలకు 25 మంది అదుపులోకి..

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రతినిధి

నిజామాబాద్ జిల్లాలో దళితులపై గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ)ల ఆగడాలు అధికమయ్యాయని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు రాములు ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక బహిష్కరణలపై జిల్లా పోలీసులు సైతం అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిష్కరణపై దళితులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. వీడీసీల రద్దుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని మారంపల్లి గ్రామంలో అంబేద్కర్ భవనం నిర్మించేందుకు యత్నించారని ఇటీవల 80 మంది మాల సామాజిక తరగతికి చెందిన వ్యక్తులను వీడీసీ బహిష్కరించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై 'నవతెలంగాణ' కథనం ప్రచురించిన దరిమిలా ఆదివారం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములు మారంపల్లి గ్రామంలో బాధితులను పరామర్శించారు. బహిష్కరణ మూలంగా నిత్యవసరాలు లేక అలమటిస్తున్న బాధితులకు తక్షణం సరకులు అందజేయాలనీ, పరిహారం కింద బాధిత కుటుంబాలకు రూ.లక్ష చెల్లించాలనీ చెప్పారు. ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామాభివృద్ధి కమిటీలను రద్దు చేయించాలని ఆర్‌డీఓను ఆదేశించారు. ఈ ఘటనలో పోలీసులు అలసత్వంగా వ్యవహరించారని అన్నారు. గ్రామంలో ఇతర కులాలు కమ్యూనిటీ హాళ్లను, కల్యాణ మండపాలను నిర్మించుకుంటున్నప్పటికీ.. దళితుల విషయంలో మాత్రం అడ్డుతగిలారని తెలిపారు. సమస్య పరిష్కారమయ్యే వరకూ అన్ని నిర్మాణాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములు చొరవతో పోలీసులు ఎట్టకేలకు 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. అయితే దీనిపై వీడీసీ సభ్యులు గ్రామస్తులను ఉసిగొల్పి.. కమిషన్ సభ్యుడు రాములు వాహనాన్ని అడ్డుకునే యత్నం చేశారు.

ప్రజల్లో హేతుబద్ధ ఆలోచనలు, శాస్త్రీయ విలువలను పెంపొందించడానికి ప్రయత్నించాల్సిన నాయకులు ప్రజలను వారిలో గల సెంటిమెంట్లతో, ఆచార వ్యవహారాల పేరుతో రెచ్చగొట్టడం తగదు. శబరిమలై ఆలయంలోకి మహిళ ప్రవేశం కేవలం కేరళ రాష్ట్ర ప్రభుత్వ సమస్య కాదు. అది దేశంలోని మహిళలందరి సమస్య. నేడు శబరిమలైకి మహిళలను నిరాకరించినవారు రేపు మన గ్రామంలోని గుళ్లోకి కూడా మన తల్లినో, చెల్లినో నిరాకరించవచ్చు. ఆధునిక యుగంలో జీవిస్తున్న మనం మత విశ్వాసాల మలినాల్లో కూరుకుపోతున్నాం. విశ్వాంతరాల్లోకి ప్రయాణిస్తున్న, శోధిస్తున్న మన ఆలోచనలు మత విశ్వాసాల ముసుగులో మసకబారుతున్నాయి. శాస్త్ర సాంకేతికత సాయంతో విశ్వావిర్భావ మూలకాలను వెతికే మన కనులు అంధ విశ్వాసాలతో మూసుకుపోతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మనుషులందరూ సమానమే అని ఆధునిక ఆలోచనలతో ముందుకు సాగుతున్న తరుణంలో సహజ శారీరక మార్పులకు కారణంగా చూపి మన అక్కని, చెల్లిని ఆలయంలోకి ప్రవేశించకుండా చేయడమనేది మన తిరోగమనాన్ని సూచిస్తుంది. సహజ శారీరక మార్పుల ద్వారా కలిగే చర్యలను మైల, ముట్టు, అపవిత్రం అనే భావనలు మాన విద్యలో గల శాస్త్రీయతను కూడా ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అందుకే విద్యలో శాస్త్రీయ ధృక్పథాన్ని, ఆధునిక ఆలోచనలు సమాజంలో కలిగేలా కృషి చేద్దాం. ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని నిరాకరించడాన్ని ఖండిద్దాం. మనుషులందరూ సమానమేనని మహిళలకు ఆలయం ప్రవేశం రాజ్యాంగం వారికి కల్పించిన హక్కుగా వారికి మద్దతునిద్దాం. 'హీ', 'షీ' సేమ్(అతడు, ఆమె సమానం) అని నినదిద్దాం.

ఆమె అపవిత్రమా?

వనపాకల దిలీప్

దైవం ముందు, చట్టం ముందు అందరూ సమానులే అంటుంటారు. కానీ అబద్ధం. సాక్షాత్ ఆ దేవుడే 'ఆమె' ను అపవిత్రం అన్నాడు. ఆమెకు ఆలయంలోకి ప్రవేశం నిరాక రించాడు. దైవంపై నమ్మకం లేని నా బోటి వాళ్లకు చట్టంపై నమ్మకంతో చట్టం ముందు సమానమవుతారేమో అని ఆశగా చూస్తే, నిరాశే ఎదురైంది. ఎందుకంటే సుప్రీం కోర్టు తీర్పు కూడా అవమానానికి గురై న్యాయ దేవత తలవంచుకుంది. గత కొన్ని నెలలుగా శబరిమలై ఆలయంలోకి మహిళల ప్రవేశంపై నిత్యం ఏదో రకమైన అలజడలు, నిరసనలు చేస్తూనే ఉన్నాం. ఆలయంలోకి మహిళల ప్రవేశం రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులో భాగమని దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పిచ్చినా ఈ నిరసనలు ఇంకా ఆగట్లేదు. మహిళలకు ప్రవేశం కల్పించట్లేదు. 'మతం మనుషుల ఆలోచనలు చంపుతుంద'న్న మహానుభావుడి మాటలకు ఆవల 'ఆమె' మతంలోనే తనపట్ల వివక్షతకు, అవమానాలకు కారణాలను ఆలోచించుకుంటుంది. దైవానికి తాను చేరువకావాలని ప్రయత్నిస్తుంది. కానీ దైవమే 'ఆమె'కు ప్రవేశం నిరాకరించాడని చెబుతున్నారీ 'అ'భక్కులు.('అ'-అయ్యప్ప). ఇటీవల ఇద్దరు మహిళలు శబరిమల అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించారనే కారణంతో ఆలయం మైలపడిందని, అపవిత్రమైందని 12 గంటలు ఆలయ బందుకు పిలుపునిచ్చింది 'శమరిమల కర్మ సమితి'. బీజేపీ కూడా 2 రోజుల నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. దైవానికి 'ఆమె' 'అటరానిది', 'అపవిత్రమైంది' ఎట్లైంది? 'ఆమె'లో రక్తమే అపవిత్రమా? పురుషుల్లో రక్తం కాదా? నిజానికీ 'రుతుక్రమం' లేకుంటే మానవాళి సృష్టికి మూలమైన తల్లి గర్భం ఎక్కడిది? 'అమ్మ' గర్భం కూడా అపవిత్రమైందేనా? హిందూ ధర్మం ప్రకారం 'స్త్రీ' అత్యంత గౌరవ ప్రదమైందని, పవిత్రమైందని ఊదరగొట్టే ఈ అయ్యావార్లకు శబరిమలైకి వచ్చే స్త్రీ మాత్రం మలినమైనది, అపవిత్రమైనదిగా ఎట్లా కనపడింది వారికీ.. 'తల్లి గర్భం' పవిత్రమైంది అంటారు కదా! మరి ఆ గర్భానికి కారణమైన 'రుతుచక్రం'లో ఉన్న మహిళ ఆలయానికి వస్తే అపవిత్రం ఎట్లగును. అసలు రుతుక్రమంలో ఉన్న స్త్రీలు శబరిమలకు పోతే ఏమీ జరుగుతుందో, పాపం ఏంటో ఎవ్వరు చెప్పరు. కేవలం మలినమైంది, అపవిత్రమైంది అంటారు. అయినా ఎంతటి అపవిత్రతనైనా శుద్ధి చేసే మహిమలుగల మంత్రాలుండగా, మహిళలు ప్రవేశిస్తే కలిగే ఇబ్బంది ఏంటీ? ఒకవేళ వారి ప్రవేశం మైలపడేలా చేసిందనుకుంటే మంత్రాలతో శుద్ధి చేసుకోవచ్చు కదా! అయినా మహిళల శబరిమలై ఆలయ ప్రవేశం అయ్యప్పకు కలిగే ఇబ్బందా? లేక కొన్ని రోజులు పాపాలు, పుణ్యాలు, అపచారాలు అనే అంధ విశ్వాసాలతో ప్రజలను మభ్యపెట్టిన ఈ హిందుత్వ వాదుల కుట్రలు భయటపడుతాయని భయమా? ఒకవేళ రుతుచక్రంలో ఉన్న మహిళల ప్రవేశం ఆలయ విశ్వాసాలకు, ఆచారాలకు వ్యతిరేకం అనుకున్నా... మరి దేవుని విశ్వాసాన్ని, ఆయన ప్రత్యక్ష దర్శనాన్ని పొందాలనుకుంటున్న స్త్రీలకు ప్రవేశం లేకపోవటం వారి హక్కులకు, స్త్రీ పురుష సమానత్వానికి అయ్యప్ప లేదా హిందూజం వ్యతిరేకమేనని ఒప్పుకోవాలి. మొన్నటికి మొన్న చీరలు కట్టుకుని, స్త్రీ వస్త్రధారణలో ఆలయంలోకి ప్రవేశించ ప్రయత్నం చేసిన హిజ్రాలను కూడా అడ్డుకున్నారు. అంటే... ఇప్పటి దాకా వీరు చెబుతున్న రుతుచక్రం, మైల, అపవిత్రం అన్నవన్ని కట్టుకథలే అని అర్థం చేసుకోవచ్చు. హిజ్రాలకు రుతుచక్రం, నెలసరి జరుగుతుందా? లేదే.. అయినా అడ్డుకున్నారు. ఎందుకు స్త్రీ వేషధారణలో ఉన్నారని. అంటే వారి ఉద్దేశంలో స్త్రీలు అయ్యప్పను దర్శించుకోవద్దు. దీనికి వీరు చెప్పేవన్ని కేవలం సాకులు మాత్రమే.. మొత్తం హిందూ పురాణాల్లో ఇట్లా స్త్రీల స్థాయిని ఏదోరకంగా తగ్గించడమో, త్యాగం, శీలం పేరుతో అవమానాలకు గురి చేయడమో జరుగుతుంది. రుతుచక్రం ఆధారంగానే గర్భవతై, నాకు జన్మనిచ్చిన తల్లి, నాతోపాటే ఎదిగి సహజ శారీరక మార్పులకు లోనైన అక్క, చెల్లి ఆలయ ప్రవేశం కాడ అపవిత్రం ఎట్లైంది? అని ఆలోచిస్తే తెలుస్తది. ఇది దైవం చెప్పింది కాదు. కావాలని స్త్రీని తక్కువగా చూపే ఈ మనువాదుల కుట్రల ఫలితం అని.

రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువలను కూడా ఈ అభక్తులు పట్టించుకోరు. నిజానికి ఆ లాయరు గారు అన్నట్టు మాట్లాడితే... ఈ దేవుడికి హక్కులుంటాయని అంటే.. ఆ దేవుడు కూడా రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాల్సిందే. మతపరమైన హక్కు, సమానత్వపు హక్కు పౌరులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల్లో భాగం. దీన్ని అనుసరించి అన్నింటా స్త్రీలు, పురుషులు సమానం. కానీ అయ్యప్ప మాత్రం సమానం కాదంటున్నాడు. అయ్యప్ప అనుచరులు గుడిలోకి ప్రవేశం నిరాకరిస్తున్నారు. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించినందుకు గాను 'అయ్యప్ప' భక్కులపై కేసులు పెట్టాలి. ఆలయంలోకి మహిళలకు ప్రవేశం కల్పించాలని తీర్పునిచ్చిన దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పును ఆటంకపరిచినందుకు, అవమానపరిచినందుకు వారిపై కోర్టు ధిక్కరణ కేసులు నమోదు చేయాలి. అయినా ఈ ప్రభుత్వాలు, పాలకులు బలవంతులకు, వారు అనుకున్నవాటికి ఇచ్చే ప్రాధాన్యత బలహీనులకు, వారు అనవసరం అనుకున్నవాటికి ఇవ్వదు. 'ట్రిపుల్ తలాక్' విషయంలో మత విశ్వాసాలకన్నా, మానవతా విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని, రాజ్యాంగ విలువలను, అత్యున్నత న్యాయస్థానం తీర్పును గౌరవించాలని ఊదరగొట్టే ఈ నాయకులు శబరిమలై విషయంలో అంతే శ్రద్ధతో మత విశ్వాసాలకంటే, మానవత విలువలకు, రాజ్యాంగ విలువలకు, సుప్రీం తీర్పును గౌరవించి మహిళలకు ఆలయ ప్రవేశం స్వేచ్ఛగా కలిగేలా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు. ట్రిపుల్ తలాక్ ద్వారా మహిళల హక్కులకు భంగం వాటిల్లుతుందని, ముస్లీం పురుషుల చేత (అవమానాలకు) వివక్షతకు గురవుతున్నారని వారి రక్షణ కోసం పట్టుదలతో చట్టం చేయడానికి ప్రయత్నిస్తున్న బీజేపీ నాయకులు, అదే శబరిమలై ఆలయంలో మహిళల ప్రవేశానికి ఆలయం మైలపడిందని నిరసన కార్యక్రమాలకు పిలుపున్విడంలో అర్థం ఏమిటి? ఈ ద్వంద్వ వైఖరికి గల కారణాలు ఏమిటి? బీజేపీ పాలకులు చెప్పాలి. అక్కడి విజయన్ ప్రభుత్వం సుప్రీం తీర్పును అమలుపరుస్తామంటే కూడా అభ్యంతరం తెలిపారెందుకు. ఎందుకంటే వారి దృష్టిలో హిందూ మత విశ్వాసాల ప్రకారం మహిళలు అసమానులే అనే భావన ఉంది కాబట్టి. ట్రిపుల్ తలాక్ బిల్లును చట్ట సభల్లో ఆమోదం కోసం ప్రయత్నించడం, శబరిమలై ఆలయంలో మహిళల ప్రవేశానికి నిరసనగా రెండు రోజులు నిరసన కార్యక్రమాలకు బీజేపీ నాయకులు పిలుపునివ్వడం యాధృచ్ఛికంగా జరిగినవే అయినా. హిందూ మహిళల ఆలయ ప్రవేశం పట్ల వారి ఆలోచనలు యాధృచ్ఛికమైనవి కావు.

ప్రజల్లో హేతుబద్ధ ఆలోచనలు, శాస్త్రీయ విలువలను పెంపొందించడానికి ప్రయత్నించాల్సిన నాయకులు ప్రజలను వారిలో గల సెంటిమెంట్లతో, ఆచార వ్యవహారాల పేరుతో రెచ్చగొట్టడం తగదు. శబరిమలై ఆలయంలోకి మహిళ ప్రవేశం కేవలం కేరళ రాష్ట్ర ప్రభుత్వ సమస్య కాదు. అది దేశంలోని మహిళలందరి సమస్య. నేడు శబరిమలైకి మహిళలను నిరాకరించినవారు రేపు మన గ్రామంలోని గుళ్ళోకి కూడా మన తల్లినో, చెల్లినో నిరాకరించవచ్చు.

ఆధునిక యుగంలో జీవిస్తున్న మనం మత విశ్వాసాల మలినాల్లో కూరుకుపోతున్నాం. విశ్వాంతరాల్లోకి ప్రయాణిస్తున్న, శోధిస్తున్న మన ఆలోచనలు మత విశ్వాసాల ముసుగులో మసకబారుతున్నాయి. శాస్త్ర సాంకేతికత సాయంతో విశ్వావిర్భావ మూలకాలను వెతికే మన కనులు అంధ విశ్వాసాలతో మూసుకుపోతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మనుషులందరూ సమానమే అని ఆధునిక ఆలోచనలతో ముందుకు సాగుతున్న తరుణంలో సహజ శారీరక మార్పులకు కారణంగా చూపి మన అక్కని, చెల్లిని ఆలయంలోకి ప్రవేశించకుండా చేయడమనేది మన తిరోగమనాన్ని సూచిస్తుంది. సహజ శారీరక మార్పుల ద్వారా కలిగే చర్యలను మైల, ముట్టు, అపవిత్రం అనే భావనలు మాన విద్యలో గల శాస్త్రీయతను కూడా ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అందుకే విద్యలో శాస్త్రీయ ధృక్పథాన్ని, ఆధునిక ఆలోచనలు సమాజంలో కలిగేలా కృషి చేద్దాం. ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని నిరాకరించడాన్ని ఖండిద్దాం. మనుషులందరూ సమానమేనని మహిళలకు ఆలయం ప్రవేశం రాజ్యాంగం వారికి కల్పించిన హక్కుగా వారికి మద్దతునిద్దాం. 'హీ', 'షీ' సేమ్(అతడు, ఆమె సమానం) అని నినదిద్దాం.

సెల్: 8464030808





శబరిమల అయ్యప్పగుడిలోకి ప్రవేశించిన మహిళ

కన్నకూతురును కాటికి పంపిన

కులాంతర ప్రేమపెండ్లి

తిప్పారపు సురేష్

పిండి అనురాధ ప్రేమించిన వ్యక్తి తన కులం కాదని కన్న కుటుంబమే చితికట్టెలు పేర్చి, గొంతు నుమిలి, హత్య చేసి, చితిలో వేసింది. కన్నకుతురు తక్కువ కులం వాడిని ప్రేమించిన పగను ఇలా చల్లార్చుకున్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు గ్రామంలో కన్న బిడ్డనే చంపుకున్న ఘటన ఒక కులదురంకార హత్య. గతంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో స్వాతి -నరేష్‌ను స్వాతి తండ్రి హత్య చేశాడు. పరాయి కులం వారిని ప్రేమించడమే మధుకర్, ప్రణయ్, గడ్డి కుమార్‌ల చావుకు కారణం. ఇలా కుల పట్టింపులకు నవ వధువరులు సైతం బలవుతున్నారు. వారు చదువుకున్న పరిసరాల్లో కులం కంటే మనసు, మంచి అలవాట్లు చూసుకొని ఒకరినొకరు ఇష్టపడుతున్నారు. సమాజంలో వేళ్లూనుకున్న కులం అడ్డు చెబుతూ హత్యలు చేస్తుంది. వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి రక్షణ లేకపోవడంతో పోలీసులు పట్టనట్టుగా ఉండటం మూలంగా రోజురోజుకు కులం మత్తులో ఆవేశం పెంచుకొని హత్యలు చేస్తున్నారు.

ఒకే గ్రామానికి చెందిన అనురాధ (యాదవ) చదువు డీఈడీ. లక్ష్మణ్ బీటెక్ (పద్మశాలి). ఈ యువ జంట హైదరాబాదులో చదువుకుంటూ ఒకరినొకరు ఇష్టపడ్డారు. బీటెక్ చదువుతున్న లక్ష్మణ్, అనురాధ ఇద్దరం కలిసి డీఈడీ చదువుకుంటే ఏదైనా స్కూల్లో ఉద్యోగంలో చేరి ఆనందంగా కాపురం చేసుకోవచ్చని బీటెక్ చదువును రద్దు చేసుకొని డీఈడీలో చేరారు. వీరి ప్రేమ విషయం తెలుసుకున్న అనురాధ తల్లిదండ్రులు ఇంట్లో బంధించారు. అదే సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్ కొడుకు రాజకీయ అధికార పార్టీ అండదండలతో పిండి అనురాధతో బలవంతంగా జన్నారం పోలీస్‌స్టేషన్‌లో లక్ష్మణ్‌పై కేసు నమోదు చేయించారు. అయినప్పటికీ వీరి ప్రేమను విడదీయలేకపోయారు. గత సెప్టెంబర్ 24న అనురాధ తన సొంత ఇంటి నుండి తప్పించుకొని లక్ష్మణ్ వద్దకు చేరింది. ఇంట్లో కుటుంబం వేధించే పరిణామాలు గ్రహించి తనుకు లక్ష్మణ్‌కూ ఎలాంటి ప్రమాదం జరిగినా అందుకు తమ తండ్రి, గ్రామ సర్పంచ్ కొడుకు మల్లేష్‌లదే బాధ్యత అని అర్ధరాత్రి వీడియో రికార్డింగ్ చేసుకొని సెల్‌ఫోన్‌లో మిత్రులకు చేరవేసి తన ప్రేమికుడితో హైదరాబాదుకు వెళ్లి ఆర్య సమాజ్ మందిరంలో వివాహం చేసుకుంది. గత డిసెంబర్ 22న జాతీయ లోక్ అదాలత్‌లో లక్ష్మణ్‌పై పెట్టిన కేసును కొట్టివేయించుకొని జన్నారం మండలం కలమాడుగుకు వచ్చే ముందు పోలీసులకు సమాచారం అందించి గ్రామానికి చేరుకున్నారు. ఇంట్లో నూతన వధూవరులను ఆశీర్వదించే క్రమంలో కుటుంబ ముంది. రాత్రి7:30 గంటలకు గ్రామంలో విద్యుత్ ఆపివేసి 15 మంది అనురాధ కుటుంబీకులు ఒక్కసారిగా లక్ష్మణ్ ఇంట్లోకి వచ్చి కర్రలు పట్టుకొని అనురాధను లక్ష్మణ్‌నూ కొట్టారు. అక్కడే ఉన్న లక్ష్మణ్ పెదనాన్న కొడుకు లక్ష్మణ్‌ను దాడి నుండి విడిపించి ఇంట్లో ఉంచాడు. అనురాధను తీవ్రంగా గాయపరిచి మతిస్థిమితం కోల్పోయేలా కొట్టారు. ఆ తర్వాత బైక్‌పై ఊరవతలికి తీసుకెళ్లారు. లక్ష్మణ్ ఈ ఘటనపై 100కు డయల్ చేసి పోలీసులకు హెల్ప్‌లైన్ ద్వారా సంప్రదించాడు. 9.15 గంటలకు ఊర్లోకి వచ్చిన బ్లూకోర్టు పోలీసులు అనురాధ ఇంట్లోకి వెళ్లి పరిశీలించి ఎవరూ లేరని వెళ్లిపోయారు కానీ పోలీసులు ఊర్లో పరిశీలిస్తే అనురాధ బతికేది. అనురాధ తండ్రి సత్యనారాయణరావును కమిషనర్ ఎన్ని గంటలకు చంపారని అడిగితే తొమ్మిదిన్నర గంటలకు తల్లితో ఫోన్ మాట్లాడి మనసు మార్చుకోవాలని తల్లి చెప్తే "నేను మార్చుకోను. అతడితోనే కాపురం చేస్తా"నని చెప్పింది. అప్పుడే "గొంతు నులిమి చంపేయండి" అని తల్లి చెప్పడంతో "గొంతును నులిమి చంపేశాం" అని చెప్పాడు. మరుసటి రోజు ఉదయం నాలుగు గంటల వరకు చితిమంటల దగ్గర ఉండి కాల్చామని, కాలిన బూడిదను కాలవలో పడేసి వెళ్లిపోయానని చెప్పాడు. కేవలం కులం కాని వాడిని ప్రేమించినందుకు అనురాధను హత్య చేశారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం స్పందించనంతకాలం ఇలాంటి ఘటనలు రోజురోజుకు జరుగుతూనే ఉంటాయి.



ఆర్యసమాజ్‌లో పెండ్లి చేసుకున్న అనురాధ, లక్ష్మణ్ (ఫైల్)

సెల్ : 9490997703

వాటర్ కార్పొరేషన్‌లో కుల వివక్ష

ఓగోటి కిరణ్‌కుమార్

"మీరు కులం తక్కువోళ్లు, ఇక్కడి మంచి నీళ్లు ముట్టుకోవద్దు. కనీసం మా ఆఫీస్ గదిలోకి కూడా రావద్దు" అని వేధించారు. బండ బూతులతో హేలనగా మాట్లాడారు. "మేము ఉచ్చ పోస్తే, మీరు తక్కువ కులపోళ్లు కాబట్టి ఆ బాత్రూమ్‌లో మీరే నీళ్లు పోయాలి" అంటూ నీచమైన పనులన్నీ చేయించుకున్నారు. చివరికి తక్కువ కులం వారు ఎంత వేధించినా సర్దుకుపోతున్నారని, ఉద్యోగం విడిచి పారిపోవడం లేదని మరింత కక్ష గట్టారు. అనేక రకాలుగా హింసించి, వేధింపులకు గురి చేసి, నీచమైన పనులన్నీ చేయించుకొని చివరికి మీరు ఎవరో మాకు తెలియదన్నారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలన్నారు. నిర్దాక్షిణ్యంగా వారిని 12ఏండ్లుగా చేస్తున్న ఉద్యోగం లోనుండే తొలగించారు. ఈ ఘటన ఎక్కడో కాదు, హైదరాబాద్ నడిబొడ్డున లక్డికపూల్‌లోని సెంట్రల్ వాటర్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) ఆఫీసులో చోటు చేసుకుంది.



సెంట్రల్ వాటర్ కార్పొరేషన్ ఆఫీసులో కాంట్రాక్టు పద్ధతిలో గత 12 ఏండ్లుగా హౌస్ కీపింగ్ వర్కర్స్ పని చేస్తున్నారు. జీతమెంత వచ్చినా జాబ్ గ్యారెంటీ అనే ఉద్దేశ్యంతో అణిగిమణిగి ఉంటూ ఇంత కాలం పని చేస్తూ వచ్చారు. కొంతకాలం క్రితం టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ వీరిని తొలగించి కొత్త వారిని నియమించుకునే ఉద్దేశ్యంతో కుట్ర చేయగా కార్మిక జెండా సీఐటీయూను ఆశ్రయించారు. దీంతో ఆ కాంట్రాక్టు వీరికే వచ్చేలా సీఐటీయూ ఆధ్వర్యంలో బిల్డింగ్ హౌస్ కీపింగ్ సర్వీసెస్ పేరుతో సొసైటీ ఏర్పాటు చేసుకున్నారు. టెండర్ దక్కించుకున్నారు. కార్మికులే టెండర్ దక్కించుకోవడంతో విధి నిర్వహణ హాయిగా సాగిపోతోంది. ఇంతలో పై అధికారులైన అగ్రకులాల వారికి వీరిపై కన్నుపడింది. వీరంతా దళితులు కావడంతో వారి చైతన్యాన్ని చూసి ఓర్వలేకపోయారు. ఎలాగైనా ఈ పోస్టుల లో నుంచి వీరిని తొలగించి కొత్త వారిని నియమించుకుంటే పోస్టుకు ఇంత అని అమ్ముకోవచ్చని భావించారు. ఆ విధంగా రూ.లక్షలు సంపాదించుకోవచ్చని కుట్ర పన్నారు. ఆ ఆలోచన వచ్చిందే తడవుగా కులం పేరుతో, అసభ్య పదజాలంతో దూషించడం మొదలు పెట్టారు. ఆ కార్మికులు అక్కడ 12 ఏండ్ల నుంచి పని చేస్తున్నారు. దీంతో వారిని తొలగించేందుకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అయిన వీరవాణి, గంగాభవాణిలు అనేక రకాలుగా కుల వివక్షకు గురిచేశారు. ముందుగా టెండర్ వారికి రాకుండా చేశారు. ఓ అధికారి నమ్మిన బంటుగా నటిస్తూ టెండర్ వేస్తానని మోసం చేశాడు. దీంతో ఆ టెండర్ చేజారిపోయింది. ఏం జరిగిందని కార్మికులు ప్రశ్నిస్తే మీ టెండర్ లాక్ అయిందని, ఓపెన్ కాలేకపోవడంతో వేరొకరికి టెండర్ వెళ్లిందని చెప్పుకొచ్చారు. టెండర్ పోయినా ఉద్యోగం ఉంది కాదా అని ఆ కార్మికులు సర్దుకుపోయారు. అప్పటికీ వీరి జీతం రూ.12వేలే. కానీ ఉన్నట్టుండి ఒకరోజు "రేపటి నుంచి మీరు పనిలోకి రానక్కరలేదని, మిమ్మల్ని తొలగించామ"ని తెలిపారు. ఎలా తొలగిస్తారని కార్మికులు ప్రశ్నిస్తే.. "మీ వల్ల కాంట్రాక్టర్‌కు గిట్టుబాటు కావడం లేదని, మీ జీతాలు ఎక్కువగా ఉండటంతో తొలగించాలని నిర్ణయించామని చెప్పుకొచ్చారు. అదే క్రమంలో రూ.9వేల జీతంతో కొత్త వారిని వీరి స్థానంలో తీసుకున్నారు.

నిత్యం వేధింపులే...


సెంట్రల్ వాటర్ కార్పొరేషన్ ఆఫీసులో ఉన్నతాధికారులంతా అగ్రకులాలకు చెందినవారు. అయితే వారికి కుల పిచ్చి విపరీతంగా ఉండటం గమనించాల్సిన విషయం. ఆ దళిత కార్మికుల తొలగింపునకు ముందు అనేక రకాలుగా వేధింపులకు గురి చేశారు. కులం పేరుతో ఇష్టమొచ్చినట్టు తిట్టేవారు. ఆ కార్మికుల పని పరిధి దాటి అధికారుల బాత్రూములు కూడా కడిగించుకున్నారు. ఇలా అనేక రకాలుగా వేధింపులకు గురి చేయడంతో కార్మికులు ప్రశ్నించారు. ఈ ప్రశ్నించడాన్ని సహించలేని ఉన్నతాధికారులు ఆ కార్మికులను తొలగించేందుకు నిర్ణయించారు. 2009-10లో తీసేస్తేనే తొలగించిన ఆ కార్మికులు ఐక్యంగా నిలబడి యూనియన్ ఏర్పాటు చేసుకున్నారు. బిల్డింగ్ హౌస్ కీపింగ్ సర్వీసెస్ పేరుతో సొసైటీ ఏర్పాటు చేసుకున్నారు. వారు పని చేస్తున్న కాంట్రాక్టు టెండర్‌ను కూడా వారే దక్కించుకున్నారు. దీంతో అధికారుల వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. మీరు యూనియన్‌ను తీసుకురావద్దని పదేపదే వేధించేవారు. తరచూ బూతులతో తిట్టేవారు. వారిని తిట్టాలని జీఎస్ రావు (సబ్ డివిజనల్ ఇంజనీర్)

తోటి సిబ్బంది (ఉద్యోగుల)ని రెచ్చగొట్టేవారు

మధ్యాహ్న భోజనం చేసేందుకు కాంట్రాక్టు కార్మికులకు ఓ గదిని కేటాయించారు. ఎన్నో ఏండ్లుగా అక్కడే భోజనం చేసేవారు. అయితే కార్మికులకు భోజనానికి కూడా గది కావాలా? అంటూ కేటాయించిన గదిని కూడా లాగేసుకున్నారు. దీంతో ఆరుబయటే చెట్ల కింద టిఫిన్ బాక్సులు పెట్టుకునేవారు. భోజనాలు కూడా అక్కడే చేసేవారు. దీంతో కోతులు ఆ భోజనాలు ఎత్తుకెళ్లిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కోతుల వల్ల మధ్యాహ్న భోజనం లేక ఆకలికి మాడుతూ కూడా ఆ కార్మికులు పని చేసిన రోజులు ఎన్నో ఉన్నాయి. అధికారులు కొంతమంది తమ బంధువులు, సన్నిహితులను నియామకం చేసుకున్నారు. వారికి ఇచ్చిన ప్రాధాన్యత ఈ దళిత కార్మికులకు ఇచ్చేవారు కాదు. అక్కడి ఉద్యోగులకు కులం పిచ్చి బాగా ఉండటంతో తీవ్రమైన వివక్ష కొనసాగుతోంది. ఆఫీసర్స్ బాత్రూమ్‌కు వెళ్తే కూడా కులం తక్కువ వాళ్లు వెళ్లి నీళ్లు పోయాలని వేధించేవారు. కార్మికులకు ఎంత అత్యవసరమైనా బాత్రూమ్‌కు వెళ్లనిచ్చేవారు కాదు. తాగే మంచినీళ్లు కూడా ముట్టుకోనివ్వలేదు. "దళితులు మా నీళ్లు ముట్టుకోవద్దు, మా గదిలోకి రావద్దు" అని ఆంక్షలు విధించేవారు. బాత్రూమ్‌లకు తాళాలు వేయించారు. ఇలా అనేక రకాలుగా వేధింపులకు గురిచేశారు. ఓసారి ఏకంగా "మీకు ఈ నెల వచ్చిన జీతం తిరిగి ఇచ్చేసే యాలని పట్టుబట్టారు. జీతం ఎక్కువగా వస్తుంది, తగ్గించుకోవాలని ఒత్తిడి తెచ్చారు. కార్మికులు అందుకు అంగీకరించకపోవడంతో వీరికి ఈ సారి ఎలాగైనా టెండర్ రాకుండా చేయాలని వారి ముందే ముందే ఉన్నతాధికారులు మాట్లాడుకున్నారు. అనుకున్నట్టుగానే టెండర్ రాకుండా చేశారు. ఆ తర్వాత ఒకరోజు మీరు రేపటి నుంచి పనిలోకి రానవసరం లేదన్నారు. మిమ్మల్ని పనిలో నుంచి తొలగించారని చావు కబురు చల్లగా చెప్పారు. ప్రస్తుతమున్న కాంట్రాక్టర్‌కు మీవల్ల బెనిఫిట్ లేదంటూ ఆ పదిమంది దళిత కార్మికులను తొలగించారు. గత 12 ఏండ్లుగా పని చేస్తున్నాం. చెప్పా పెట్టకుండా ఎలా తొలగిస్తారని ప్రశ్నిస్తే " అసలు మీరెవరో మకు తెలియదు. రేపటి నుంచి ఆఫీసులోకి రావద్దు" అంటూ వెళ్లగొట్టారు. గత కొంతకాలంగా ఎన్నో అవమానాలు ఎదుర్కొని, ఎంతో మానసిక వేధకనకు గురి చేసినా ఉద్యోగం కోసమే ఆ దళిత కార్మికులు భరిస్తూ వచ్చారు. కానీ చివరికి వారిని ఉద్యోగం లో నుంచి కూడా తొలగించడంతో వెంటనే సీఐటీయూ నాయకత్వంలో ఆందోళనకు దిగారు. గత నెల రోజుల నుంచి ఆందోళన చేస్తూనే ఉన్నారు. మరోవైపు తమకు జరిగిన అన్యాయంపై కార్మికశాఖను ఆశ్రయించారు. కుల వివక్షపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిశారు. అయినా నేటికీ వారి సమస్య పరిష్కారం కాలేదు.

సెల్ : 9666011107

ఆ ఉద్యోగాలు అమ్ముకుంటున్నారు



మమ్మల్ని అనేక రకాలుగా వేధింపులకు గురిచేశారు. తరచూ కులం పేరుతో దూషించారు. నీచమైన పనులన్నీ చేయించారు. మమ్మల్ని అక్కడి నుంచి వెళ్లగొట్టేందుకు అనేక రకాలుగా హింసించారు. అయినా రెక్కాడితే డొక్కనిండని మేము భరిస్తూ వచ్చాం. అయినా మాపై పెంచుకున్న కక్షసాధింపు చర్యలు మానుకోలేదు. కాంట్రాక్టు మాకు రాకుండా చేశారు. చివరికి మమ్మల్ని ఉద్యోగాల నుండే తొలగించారు. దీనికంతటికీ అగ్రకుల ఆధిపత్యమే కారణం. ఒక సెంట్రల్ గవర్నమెంట్ స్థాయి పోస్టుల్లో ఉన్న అధికారులు ఇలాంటి కువ వివక్ష పాటిస్తూ మమ్మల్ని హింసించారు. మమ్మల్ని తొలగించి ఆ ఉద్యోగాలను లక్షల రూపాయలకు అమ్ముకున్నారు.

- శ్యామలీల, బాధితురాలు



వరుణుడు ఆడనిస్తే..

మూడు గంటలుగా ఎడతెరపి లేకుండా వర్షం. తొలి సెషన్ మొత్తం తుడిచిపెట్టుకు పోయింది. లంచ్ తర్వాత చిరు జల్లుల ప్రవాహం నెమ్మదించటంతో కోహ్లిసేన ఆసీస్ చివరి నాలుగు వికెట్లు పడగొట్టింది.
కానీ ఆతిథ్య జట్టుకు ఊరట కల్పిస్తూ ఓ వైపు వర్షం, మరో వైపు వెలుతురు లేమి సహకరించాయి!. 25.2 ఓవర్ల ఆట మాత్రమే సాగిన నాల్గో రోజులో ఆస్ట్రేలియాను 300కే కుప్పకూల్చి, 322 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది కోహ్లిసేన. సమయాభావంతో వెంటనే ఫాలోఆన్ ఆడించినా.. వెలుతురు లేమితో నాలుగు ఓవర్ల ఆటే సాగింది. దీంతో ఆస్ట్రేలియా డ్రా ఆశలతో నాల్గో రోజును ముగించింది.
కంగారూ గడ్డపై చారిత్రక సిరీస్ విజయాన్ని ఖాయం చేసుకున్న టీమ్ ఇండియా, నేడు వరుణుడు సహకరిస్తే 3-1తో సిరీస్‌ను సాధించాలని చూస్తోంది. నేడు సైతం వర్ష సూచన ఉండటంతో సిడ్నీ టెస్టు డ్రా దిశగా సాగుతోంది!.

- సిడ్నీ విజయంపై కోహ్లిసేన కన్ను
- 322 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం
- ఐదు వికెట్లు కూల్చిన కుల్దీప్ యాదవ్
- ఆస్ట్రేలియా 300 ఆలౌట్, ఫాలోఆన్‌లో 6/0

సిడ్నీ (ఆస్ట్రేలియా)

టీమ్ ఇండియా తిరుగులేని ప్రదర్శనలతో చెలరేగిన సిడ్నీ టెస్టు, చివరగా డ్రా దిశగా సాగుతోంది. వెలుతురు లేమి, ఎడతెరపి లేని వర్షం ఆతిథ్య ఆస్ట్రేలియాను ఆదుకున్నాయి. చైనామన్ మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (5/99) ఐదు వికెట్ల మాయజాలంతో విజృంభించటంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 300 పరుగులకే కుప్పకూలింది. చివరి వికెట్‌కు మిచెల్ స్టార్క్ (29, 55 బంతుల్లో 3 ఫోర్లు), జోశ్ హజెల్‌వుడ్ (21, 45 బంతుల్లో 2 ఫోర్లు) 14 ఓవర్ల పాటు ప్రతిఘటించారు. ఓవర్‌నైట్ స్కోరు మరో 64 పరుగులు జోడించిన ఆస్ట్రేలియా మరో 21.2 ఓవర్లలోనే చెతులెత్తేసింది. 322 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన టీమ్ ఇండియా, ఆస్ట్రేలియాకు ఫాలోఆన్ విధించింది. ఫాలోఆన్‌లో నాలుగు ఓవర్ల ఆడిన ఆస్ట్రేలియా 6/0తో కొనసాగుతోంది. వెలుతురు సమస్యతో నాల్గో రోజు ఆట నిలిపి వేసే సమయానికి ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజ (4), మార్కస్ హారీస్ (2)లు అజేయంగా ఆడుతున్నారు.

ఐదు వికెట్ల కుల్దీప్ : నాల్గో రోజు తొలి మూడు గంటల పాటు వర్షంతో ఆట ఆరంభం కాలేదు. టీ విరామానికి ముందు ఆట మొదలైంది. నాల్గో రోజు తొలి వికెట్ పడగొట్టేందుకు కోహ్లిసేన ఎంతోసేపు ఎదురుచూడలేదు. మహ్మద్ షమి వికెట్ టూ వికెట్ బంతికి పాట్ కమిన్స్ (25, 44 బంతుల్లో 6 ఫోర్లు) ఓవర్‌నైట్ స్కోరు వద్దే వికెట్ కోల్పోయాడు. పీట్ హ్యాండ్స్‌కాంబ్ (37, 111 బంతుల్లో 5 ఫోర్లు) సైతం ఎంతోసేపు నిలువలేదు. బుమ్రా బంతిని కాచుకోలేని పీటర్ పెవిలియన్‌కు చేరుకున్నాడు. తర్వాతి ఓవర్లో ఫుల్‌టాస్ బంతితో నాథన్ లైయాన్ (0)ను ఊరించిన కుల్దీప్ యాదవ్ ఎల్బీగా వెనక్కి పంపించాడు. కానీ చివరి వికెట్ కోసం కోహ్లిసేన కష్టపడక తప్పలేదు. మిచెల్ స్టార్క్ (29), జోశ్ హజెల్‌వుడ్ (21)లు 14 ఓవర్ల పాటు ఆడి 42 పరుగులు జోడించారు. స్టార్క్ మూడు ఫోర్లు బాదగా, హజెల్‌వుడ్ రెండు బౌండరీలు కొట్టాడు. ఆఫ్ స్టంప్‌కు ఆవల బంతేసి, అదనపు టర్న్ రాబట్టిన కుల్దీప్ యాదవ్ తన ఐదో వికెట్‌కు హజెల్‌వుడ్‌ను బలిగొన్నాడు. దీంతో 300 పరుగుల వద్ద ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ ముగిసింది. ఫాలోఆన్‌లో నాలుగు ఓవర్ల ఆట తర్వాత వెలుతురు సమస్యతో ఆట సాగలేదు. నేడు అర గంట ముందుగానే ఆట ఆరంభం కానున్నది.





భారత్ తొలి ఇన్నింగ్స్ : 622/7 డిక్లేర్డ్

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : మార్కస్ హారీస్ (బి) జడేజా 79, ఉస్మాన్ ఖవాజ (సి) పుజార (బి) కుల్దీప్ 27, మార్నస్ (సి) రహానె (బి) షమి 38, షాన్ మార్ష్ (సి) రహానె (బి) జడేజా 8, ట్రావిశ్ హెడ్ (సి,బి) కుల్దీప్ 20, హ్యాండ్స్‌కాంబ్ (బి) బుమ్రా 37, టిమ్ పైన్ (బి) కుల్దీప్ 5, పాట్ కమిన్స్ (బి) షమి 25, మిచెల్ స్టార్క్ నాటౌట్ 29, నాథన్ లైయాన్ (ఎల్బీ) కుల్దీప్ 0, జోశ్ హజెల్‌వుడ్ (ఎల్బీ) కుల్దీప్ 21, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం : (104.5 ఓవర్లలో ఆలౌట్) 300.**

వికెట్ల పతనం : 1-72, 2-128, 3-144, 4-152, 5-192, 6-198, 7236, 8-257, 9-258, 10-300.

బౌలింగ్ : మహ్మద్ షమి 19-2-58-2, జస్‌ప్రీత్ బుమ్రా 21-5-62-1, రవీంద్ర జడేజా 32-11-73-2, కుల్దీప్ యాదవ్ 31.5-6-99-5, హనుమ విహారి 1-0-2-0.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ (ఫాలోఆన్) : ఉస్మాన్ ఖవాజ బ్యాటింగ్ 4, మార్కస్ హారీస్ బ్యాటింగ్ 2, ఎక్స్‌ట్రాలు : 0, **మొత్తం : (4 ఓవర్లలో) 6.**

బౌలింగ్ : మహ్మద్ షమి 2-1-4-0, జస్‌ప్రీత్ బుమ్రా 2-1-2-0.

31 ఏండ్లలో తొలిసారి.. : ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు సిరీస్ విజయం ఖాయం చేసుకున్న కోహ్లిసేన, ఆతిథ్య జట్టును మూడు దశాబ్దాల తర్వాత ఫాలోఆన్ ఆడించిన ఘనత దక్కించుకున్నది. ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియా చివరగా 1988లో సిడ్నీలోనే ఇంగ్లాండ్ ఫాలోఆన్ ఆడించింది. సొంతగడ్డపై వరుసగా 172 టెస్టుల్లో ఫాలోఆన్ ఆడని కంగారూను కోహ్లిసేన సిడ్నీలో వరుసగా రెండోసారి బ్యాటింగ్‌కు వచ్చేలా చేసింది. ఆస్ట్రేలియాను ఫాలోఆన్ ఆడించటం భారత్‌కు ఇది నాల్గోసారి. 1986 సిడ్నీ టెస్టులో సైతం ఆసీస్‌ను టీమ్ ఇండియా ఫాలోఆన్ ఆడించింది. స్వదేశంలో (1979-80) ఢిల్లీ, ముంబయి టెస్టుల్లో ఆస్ట్రేలియాను తక్కువ స్కోరుకే పరిమితం చేసి, ఫాలోఆన్ ఆడేలా చేసింది. ఇక ఓవరాల్‌గా ఆస్ట్రేలి యాను ఫాలోఆన్ కోరటం 2005 తర్వాత ఇదే ప్రథ మం. ట్రెంట్‌బ్రిడ్జ్ టెస్టులో ఇంగ్లాండ్ ఫాలోఆన్ విధిం చింది. ఈ 30 ఏండ్లలో ఆస్ట్రేలియా ఫాలోఆన్ ఎదుర్కొ వటం ఇంటా, బయటా ఇది రెండోసారి మాత్రమే.

322 సిడ్నీ టెస్టులో భారత్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 322 పరుగులు. ఆస్ట్రేలియాలో భారత్‌కు ఇదే అత్యుత్తమం. మెల్‌బోర్న్‌లోనూ కోహ్లిసేన 292 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది. కానీ 1998 ఈడెన్ గార్డెన్స్‌లో ఆస్ట్రేలియాపై సాధించిన 400 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యమే ఇప్పటివరకూ అత్యధికం, అత్యుత్తమం!.

5/99 సిడ్నీలో కుల్దీప్ యాదవ్ ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. ఆసీస్‌లో ఓ మణికట్టు లెఫ్టార్మ్ స్పిన్నర్‌కు ఇది రెండో అత్యుత్తమ గణాంకాలు. 1955లో జానీ వార్లీ సిడ్నీలోనే 5/79తో ఆసీస్‌పై విరుచుపడ్డాడు. తొమ్మిదో టెస్టు ఆడుతున్న కుల్దీప్‌కు ఇది రెండో ఐదు వికెట్ల ప్రదర్శన.



పవన్ షెరావత్

కొత్త మెరుపుల్

- నయా స్టార్ పవన్ షెరావత్
- మట్టికరిచిన పట్నా పైరేట్స్

ప్రో కబడ్డీ సీజన్ 6

నవతెలంగాణ క్రీడా విభాగం

ప్రో కబడ్డీ లీగ్ సీజన్ 6 వరకూ రైడర్లు అనగానే పర్దీప్ నర్వాలే గుర్తొస్తాడు. తెలుగు టైటాన్స్ స్టార్ రాహుల్ చౌదరి సహా యూ ముంబా హీరో అనూప్ కుమార్, జస్వీర్ సింగ్ క్లాసిక్‌లే అందరికీ తెలుసు. కానీ సీజన్ 6 ప్రో కబడ్డీకి కొత్త హీరోలను అందించింది. అంచనాల్లేని బెంగళూర్ బుల్స్ చాంపియన్‌గా అవతరించగా, స్టార్స్‌తో నిండిన జట్లు టైటిల్ రేసులో లేకుండా పోయాయి. శనివారం ముంబయిలో జరిగిన ఫైనల్లో గుజరాత్‌పై 38-33తో నెగ్గి బెంగళూర్ కబడ్డీ లీగ్ విజేతగా నిలిచింది. ఈ కబడ్డీ సీజన్‌లో కొన్ని మరిచిపోలేని ప్రదర్శనలు..!

బెంగళూర్ బాహుబలి!

బెంగళూర్ బుల్స్‌కు లభించిన బాహుబలి పవన్ కుమార్ షెరావత్. సీజన్ ఆరంభానికి ముందు పవన్‌పై పెద్దగా అంచనాల్లేవ్. శరవేగంగా పురోగతి సాధించిన పవన్, లీగ్‌లో స్టార్ రైడర్‌గా ఎదిగాడు. గత రెండు సీజన్లలో మ్యాచ్‌కు సగటున ఒక్క పాయింటే సాధించిన పవన్, ఈసారి ఏకంగా సగటున 11.29 పాయింట్లు తీసుకొచ్చాడు. బుల్స్ సారథి రోహిత్ కుమార్‌ను మించిపోయాడు. 2017 వేలంలో పవన్ ధర రూ. 13.8 లక్షలు మాత్రమే. ఈసారి అతడి కోసం బుల్స్ రూ. 52.8 లక్షలు వెచ్చించింది. అప్పట్లో బుల్స్ వ్యూహంపై అందరూ నవ్వుకున్నారు. కానీ ఇప్పుడు పవన్ కుమారే బెంగళూర్‌ను విజేతగా నిలిపాడు.

డిఫెన్స్‌లో మొనగాడు

యూపీ యోధ రైడర్ నితేశ్ కుమార్ అరుదైన ఘనత సాధించాడు. సాధారణంగా ఓ రైడర్ వంద పాయింట్లు సాధించాడు అంటే, అది పెద్ద విషయం కాదు. కానీ డిఫెండర్ 100 పాయింట్ల మార్క్ చేరుకోవటం మామూలు విషయం కాదు. భారత టాప్ డిఫెండర్ సురెందర్ నడా 2017లో నెలకొల్పిన 80 టాకిల్ పాయింట్లే లీగ్‌లో అత్యధికం. కానీ 21 ఏండ్ల నితేశ్ కుమార్ తన రెండో సీజన్‌లోనే సత్తా చాటాడు. యూపీ యోధ కుడి కార్నర్‌లో కేవలం 25 మ్యాచుల్లోనే వంద పాయింట్లు అందుకున్నాడు. ప్రొ కబడ్డీ లీగ్‌లో వంద పాయింట్లు సాధించిన ఏకైక డిఫెండర్‌గా నితేశ్ రికార్డు నెలకొల్పాడు.

ఊహించిన పరాభవం

ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఎలాగో, పీకెఎల్‌లో పట్నా పైరేట్స్ అటువంటి జట్టు. వరుసగా మూడు సార్లు కబడ్డీ లీగ్ టైటిల్ పట్టేసిన పట్నా, ఈ సారి అనూహ్యంగా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించలేదు. ఇక ప్రొ కబడ్డీలో ఇంతవరకూ పట్నా ఎన్నడూ ప్లే ఆఫ్స్‌కు ముందు నిష్క్రమించలేదు. ఈ సారి పర్దీప్ నర్వాల్ ఒంటరి పోరాటం పట్నాకు పని చేయలేదు. సమష్టిగా రాణించిన





అనూప్ కుమార్

యూపీ యోధ ఈసారి పట్నాను వెనక్కి నెట్టి ప్లే ఆఫ్స్‌కు చేరుకున్నది.

స్టార్‌డమ్ పని చేయలేదు

పీకెఎల్‌లో స్టార్స్‌తో నిండిన జట్లు తమిళ తలైవాస్, జైపూర్ పింక్ పాంథర్స్. టైటిల్ ఫేవరేట్లుగా బరిలోకి దిగిన ఈ రెండు జట్లు సైతం ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించలేదు. జైపూర్‌లో దీపక్ నివాస్ హుడా, అనూప్ కుమార్, బాజీరావ్ సహా మోహిత్ చిల్లార్‌లు ఉన్నారు. అజయ్ ఠాకూర్, జస్వీర్ సింగ్, సుఖేశ్ హెగ్డే, మంజిత్ చిల్లార్‌లు తమిళ తలైవాస్‌లో ఉన్నారు. అయినప్పటికీ రెండు జట్లూ దారుణంగా విఫలమయ్యాయి. తమ జోన్లలో వరుసగా 5, 6వ స్థానాల్లో నిలిచాయి. స్టార్స్‌తో నిండివున్నా, జట్టుగా ఆడటంలో విఫలమయ్యాయి.

కెప్టెన్ కూల్ వీడ్కోలు

పీకెఎల్ సీజన్‌లో వెలువడిన అత్యంత ఆశ్చర్యకర ప్రకటన.. కెప్టెన్ కూల్ అనూప్ కుమార్‌దే. 2016లో యూ ముంబాను చాంపియన్‌గా నిలిపిన అనూప్, తొలి సీజన్‌లో రన్నరప్‌గా నిలిపాడు. కానీ ఈ సీజన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ ప్లే ఆఫ్స్‌కు చేరుకోలేదు. ఆ వెంటనే అనూప్ కుమార్ కబడ్డీకి వీడ్కోలు పలకటం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. 15 ఏండ్లుగా కబడ్డీతో సహ జీవనం చేస్తోన్న అనూప్ కుమార్, ఒత్తిడి సమయాల్లో ప్రశాంతంగా పాయింట్లు తీసుకురావటంలో దిట్ట. 2016 కబడ్డీ వరల్డ్‌కప్‌లో భారత్‌ను విజేతగా నిలిపిన సారథి.. కెరీర్ ఉన్నత స్థితిలో వీడ్కోలు తీసుకున్నాడు.

దబంగ్ ఢిల్లీ వాహ్

పీకెఎల్‌లో పట్నా పైరేట్స్‌కు పూర్తి భిన్నమైన కథ దబంగ్ ఢిల్లీది. 2014 నుంచి ఒక్కసారీ ఆ జట్టు ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టలేదు. ప్రతీ సీజన్‌లో పాయింట్ల పట్టికల్లో కింది నుంచి రెండో స్థానం కోసం పోటీపడే ఢిల్లీ, ఈ సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు చేరుకున్నది. చంద్రన్ రంజిత్, రవీందర్ పహల్‌లు కూతలో, డిఫెన్స్‌లో ఢిల్లీకి నాయకత్వం వహించారు. ఎలిమినేటర్‌లో బెంగాల్ వారియర్స్‌ను సైతం ఓడించిన ఢిల్లీ సీజన్ 6ను సంతృప్తికరంగా ముగించింది.

ప్రేమపేరుతో ఘాతుకం..

స్నేహితులతో కలిసి లైంగికదాడి
- శిశువుకు జన్మనిచ్చిన బాలిక
- ఆలస్యంగా వెలుగులోకి...

నవతెలంగాణ-పెద్దపల్లి

ప్రేమించానని నమ్మించి పెండ్లి మాటెత్తే సరికి ఆ యువకుడు మరో ఇద్దరితో కలిసి బాలికపై అత్యాచారం చేశాడు. గర్భం దాల్చిన ఆ బాలిక ఇటీవల ఆడశిశువుకు జన్మనిచ్చింది. కాగా ఆ బాలికను యుకులు వేధిస్తుండడంతో తాళలేక తల్లితో కలిసి పోలీసులను ఆశ్రయించింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ దారుణ సంఘటన పెద్దపల్లి జిల్లాలో చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దపల్లి మండలం మేరపల్లికి చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న (15) బాలికను రంజిత్ అనే యువకుడు ప్రేమిస్తున్నానని నమ్మించాడు. బాలిక కుటుంబ సభ్యులకు తెలిసి పెండ్లిచేసుకోవాలని కోరగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో మరో ఇద్దరు యువకులు వైకుంఠం, సతీష్‌తో కలిసి అత్యాచారం చేశాడు. ఈ విషయం బయటకు తెలిస్తే పరువుపోతుందని ఎవరికీ చెప్పలేదు. గర్భం దాల్సిన బాలికకు ఆరోగ్యం బాగలేక ఆస్పత్రికి తీసుకెళ్లగా ఐదునెలల గర్భిణీ అని తేలింది. 4రోజుల క్రితం ఆడ శిశువుకు బాలిక జన్మనిచ్చింది. శిశువు మరణించింది. అయినా ఆ యువకుల నుంచి బెదిరింపులు రావడంతో బాధితురాలు తల్లితో కలిసి ఆదివారం పెద్దపల్లి డీసీపీ సుదర్శన్‌ను ఆశ్రయించగా వెంటనే స్పందించిన ఆయన నిందితులపై కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. పెద్దపల్లి ఏసీపీ వెంకటరమణారెడ్డికి నిందితుల అరెస్టుపై ఆదేశాలు జారీ చేశారు. ఏసీపీ స్థాయిలో విచారణ చేపట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ తెలిపారు. బసంత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. కేసు నమోదు చేసి మహిళ పోలీసు సమక్షంలో వైద్యపరీక్షలకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బుల్లెట్ ప్రూఫ్ కార్ల చార్జీలు రూ.1.3 కోట్లు

- సీఎం సహా 33 మందికి ఈసీ వడ్డింపు
- మాజీ స్పీకర్ మధుసూదనాచారికి అత్యధికంగా రూ.8.8 లక్షలు
- ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకే నోటీసులు : అదనపు డీజీ జితేందర్



(ఫైల్)

నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బుల్లెట్ ప్రూఫ్(బీపీ) కార్లను వినియోగించిన రాష్ట్ర సీఎం కె. చంద్రశేఖర్‌రావు సహా 33 మంది రాజకీయ ప్రముఖులకు చార్జీలను కేంద్ర ఎన్నికల కమిషన్(సీఈసీ) వసూలు చేస్తున్నది. ఈ మేరకు ఈసీ ఇచ్చిన ఆదేశాల మేరకు బుల్లెట్ ప్రూఫ్ కార్లను సమకూర్చిన రాష్ట్ర ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్(ఐఎస్‌డబ్ల్యూ) నోటీసులను జారీ చేసింది. ముఖ్యంగా గతేడాది సెప్టెంబర్ 6 నుంచి డిసెంబర్ 7 వరకు ఎన్నికల నియమావళి అమలులో ఉందని, ఆ సమయంలో ప్రచారానికి వెళ్తూ సీఎం కేసీఆర్, మాజీ స్పీకర్ మధుసూధనాచారి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, మరో కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ, బీజేఎల్పీ మాజీ నాయకుడు కిషన్‌రెడ్డి, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, టీఆర్ఎస్ ఎమ్మెల్యే దయాకర్‌రావు, మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, తదితరులు కలిపి మొత్తం 33 మంది ప్రముఖులు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను ఉపయోగించారు. అయితే ఎన్నికల నియమావళి అమలులో ఉన్న సమయంలో స్టార్ క్యాంపెయినర్లుగా వారి వారి పార్టీల తరపున రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన స్టార్ క్యాంపెయినర్లకు సెక్యూరిటీలో భాగంగా బీపీ కార్లను ఐఎస్‌డబ్ల్యూ విభాగం సమకూర్చింది. అయితే ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పుడు వీరికి ఎలాంటి ప్రోటోకాల్ వర్తించదని, వారు ఉపయోగించిన బీపీ కార్ల చార్జీలను ఆయా పార్టీలు లేదా వినియోగించిన వారు భరించాల్సిందేనని ఈసీ తాజాగా జారీ చేసిన ఉత్తర్వులలో పేర్కొన్నట్టు నిఘా అధికారులు తెలిపారు. ఈ మేరకు కిలోమీటరుకు 37 రూపాయల చొప్పున చార్జీలు వసూలు చేయాలని ఆదేశించిందని, అలాగే వారి కారు డ్రైవర్‌కు ప్రతి రోజు భత్యం వంద రూపాయలను కూడా వసూలు చేయాలని కోరిందని తెలిపారు. ఈ నేపథ్యంలో సీఎంతో సహా మొత్తం 33 మంది రాజకీయ ప్రముఖులకు అయిన బీపీ కార్ల చార్జీలు ఒక కోటి 30 లక్షల రూపాయలుగా అధికారులు తేల్చారు. ఇందులో సీఎం కేసీఆర్ చాలావరకు హెలికాప్టర్‌లోనే తిరగడం వలన కొంత తక్కువగానే అంటే లక్ష రూపాయల లోపు బీపీ కారు ఖర్చు వచ్చిందని తెలిపారు. ఇక ఇందులో అత్యధికంగా మాజీ స్పీకర్ మధుసూధనాచారి వాడిన బీపీ కారుకు అయిన ఖర్చు 8.8 లక్షల రూపాయలుగా లెక్క తేల్చారు. ఇక అతి తక్కువగా దయాకర్‌రావు వాడిన బీపీ కారుకు రూ.53 వేల రూపాయలు అయినట్టు నిర్ధారించారు. అలాగే మాజీ మంత్రి మహేందర్‌రెడ్డికి 7.7 లక్షల రూపాయలు అయినట్టు పేర్కొన్నారు. తాము ఏదో ఒక పార్టీని టార్గెట్ చేసి బీపీ కార్ల వాడినందుకు వచ్చిన ఖర్చులను వసూలు చేయడం లేదని, ఇందులో అన్ని పార్టీల వారు ఉన్నారని రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ జితేందర్ ఆదివారం రాత్రి నవ తెలంగాణతో మాట్లాడుతూ తెలిపారు. అధికార పార్టీకి చెందినవారిలో రాష్ట్ర సీఎం వాడిన బీపీ కారుతో పాటు మరికొందరు మంత్రులు వాడిన కార్లకు చార్జీలను వసూలు చేస్తున్నామని ఆయన వివరించారు. ఇది పూర్తిగా ఈసీ ఇచ్చిన ఆదేశాల మేరకు జరుగుతున్న ప్రక్రియగా ఆయన వివరించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.